ఆంధ్ర సచిత్ర వారపత్రిక



11-8-78
75 పైసలు

అందంగా, నల్లగా ఆరోగ్యవంతమైన జుట్టుకి కావాలి కె ఎమ్ పి కొబ్బరి నూనెయిచ్చే సంరక్షణ

కె ఎమ్ పి—కొబ్బరి నూనెలో ప్రకృతిలోగల మంచి లక్షణాలున్నాయి. ప్రతి నూనె బొట్టూ, మీ జుట్టుకు కుదుళ్ళనుంచీ కొసలదాకా పెరుగుదలనిస్తుంది. శీతాకాలంలో చుండ్రును తొలగిస్తుంది. వేసవిలో చర్మాన్నీ, జుట్టునీ ఎండ, వేడి నుంచి సంరక్షిస్తుంది. దాంతో మీ జుట్టు యిక ఆరోగ్యవంతంగా, చక్కగా అమర్చిన తీరులో ఉంటుంది. రోజంతా.



kmp వారి ఉత్పాదన
1907 నుంచీ
నాణ్యతగల వస్తువుల్ని
తయారుచేస్తున్నారు.

maa KMP 1-78 TEL

రాంసింగ్ తన పంట పొలాల అభివృద్ధికై ఉపయోగపడే ఆర్థిక పథకం గురించి ఆలోచించ సాగాడు.





దూర దృష్టిగల అనేక మంది వ్యవసాయదారులలో రాంసింగ్ ఒకడు. అతని పంటను కాపాడి, ఉత్పత్తిని పెంపొందించడానికి, భూమిని సారవంతం చేయడానికి, శక్తివంతమైన ఎరువులు, వ్యవసాయ పరికరాలు కావాలి. ప్రకృతి వైపరీత్యాలనుండి తట్టుకోవడానికి ఆర్థిక సంపత్తి కావాలి. ఈ సమస్య లన్నింటినీ పరిష్కరించేందుకు, ఆంధ్రా బ్యాంక్ కర్షకసహాయ పథకంలో చేరాడు రాంసింగ్ ఈపథకంలో అతను పొదుపుచేసిన ధనానికి సమానమైన మొత్తం ఋణరూపంలో లభిస్తుంది. ఆఋణాన్ని సులభ వాయిదాలలో తీర్చవచ్చు.

దాదాపు 55 సంవత్సరాల అపారమైన అనుభవం గడించి 600 కు పైగా శాఖలతో, దేశమంతటా విస్తరించిన ఆంధ్రా బ్యాంక్, అనేక ఇతర పథకాలను కూడా ప్రవేశ పెట్టింది. అవే - భాగ్యలక్ష్మి, కిడ్డీబ్యాంక్, సంరక్ష, సంక్షేమ, కల్పతరువు, గృహకల్ప, జనసహాయ మరియు మహిళా సంక్షేమ పథకాలు ప్రతి పథకం ప్రత్యేకమైనదే. ఒక్కొక్క సమస్యను తీర్చడానికి ఒక్కొక్క పథకం. అంతేకాదు. పరిశ్రమలకు, బలహీన వర్గాలకు కూడా ఆంధ్రా బ్యాంక్ ఆర్థిక సహాయం చేస్తోంది.

ప్రజావసరాలకై పాటుపడేదే - ఆంధ్రా బ్యాంక్.


అతడు నిరీక్షిస్తున్న పథకం ఆంధ్రా బ్యాంక్ వారి కర్షక సహాయ ద్వారా లభించింది. ఆ పథకంలో అతను ప్రతి ఆరు నెలలకూ పొదుపుచేసి పెద్ద మొత్తాన్ని ఫలితంగా పొందాడు.

ది ఆంధ్రా బ్యాంక్ లి.

కేంద్ర కార్యాలయం, సుల్తాన్ బజార్, హైదరాబాద్-500 001.

ఓ. స్వామినాధరెడ్డి : ఛైర్మన్

KIRON/AB/78-15 TEL



ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :

దేశోద్ధారక కాశీనాథుని

నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితం : 1908

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు :

[1938 1972]

శుక్రవారం : 11-8-'78

కాళయుక్తినామ సం. శ్రావణ శు. సప్తమి

సంపుటము 71 : సంచిక 47

సంపాదకుడు

శివలెంక రాధాకృష్ణ

*

పోస్టుతో ఏడాది చందా రు. 41-60

ఆరు మాసాల చందా రు. 20-80

విడిప్రతి వెల 75 పైసలు

ఆంధ్రపత్రిక కార్యాలయము

గాంధీనగరం, విజయవాడ–520 003


విషయానుక్రమణిక

కథలు :

సీరియల్ కథలు :


వ్యాసాలు, శీర్షికలు :

ప్రకృతి రహస్యం కనుగొనబడింది!



ఇది సహజంగా, మృదువుగా
మీ వంటి చాయను పెంపొందిస్తుంది

చర్మానికి నలుపుదనం ఎలా సంక్రమిస్తుంది.
మీ చర్మం లోపల మెలానిన్ అనే ఒక పదార్థముంది. ఇది ఎంత హెచ్చుగా ఉంటే మనుషులు అంత నల్లగా ఉంటారు. మీరు ఎండలోకి వెళ్ళినపుడల్లా, అల్ట్రావయిలెట్ కిరణాలు మీ చర్మంలో ప్రవేశించి మెలానిన్‌ను మరింత పెంచుతాయి.



వంటి ఛాయను పెంచడానికి పురాతన పద్ధతి ఏదైనా ఉందా?
వందలాది సంవత్సరాలుగా, ఆడవారు—సెనగపిండి, పాల మీగడ, నిమ్మరసం, గ్లిసరిన్ ఇంకా ఏవేవో ఉపయోగిస్తూ వస్తున్నారు. వీటి మూలంగా చర్మం మెత్తబడి కాస్త మెరవచ్చు; అంతేగాని చర్మాన్ని నిజంగా ఎర్రగా చేయలేవు. మరొక తెగకు చెందినవి బ్లీచింగ్ పదార్థాలు. ఇవి ఎంత హానికరమైనవో వేరే చెప్పనక్కర్లేదు. అపురూపమైన మీ పట్టుబట్టల్ని మీరు బ్లీచ్ చేస్తారా? మీ చర్మం కూడా పట్టువలె నాజూకు అయినది. పట్టుకంటె అపురూపమైనది.

విజ్ఞాన విజయం!
ఫెయిర్ అండ్ లవ్‌లీ సహజంగా మృదువుగా తన పనిచేస్తుంది.



ఫెయిర్ అండ్ లవ్‌లీలో గల ఒక విటమిను, దానిని మీరు రాసుకొన్నపుడు, మీ చర్మంలో ప్రవేశించి, సహజంగా, మృదువుగా, సురక్షితంగా, మెలానిన్ వ్యాప్తిని వెనక్కు నెట్టుతుంది. దాంతో మీ చర్మం చూస్తుండగానే ఎర్రపడుతుంది. అంతేకాక, ఫెయిర్ అండ్ లవ్‌లీ మీ చర్మాన్ని బయటి నుంచి కూడా సంరక్షిస్తుంది. దీనిలోని ఒక పదార్థం ఎండలోని అల్ట్రావయొలెట్ కిరణాలను వడబోసి వాటి మూలంగా మీ చర్మం మరింత నల్లబడకుండా ఆపుతుంది.

6 వారాలకు మీకే తేడా కనపడుతుంది!
ఫెయిర్ అండ్ లవ్‌లీని ఆరు వారాల పాటు నియమంగా వాడితే, మీతోపాటు ఇతర్లు కూడా మీ వంటి చాయలో మార్పును గుర్తిస్తారు.


ఫెయిర్ అండ్ లవ్‌లీ క్రీమ్ నల్ల చర్మాన్ని ఎర్రబరచడంతో పాటు ఇంకా చేస్తుంది.
ఫెయిర్ అండ్ లవ్‌లీ మీచర్మానికి కోమలత్వాన్ని సువాసనను చేకూరుస్తుంది. రోజుకు కనీసం ఒకసారి వాడండి. రెండుసార్లు వాడితే మరీ మంచిది. నియమంగా వాడితే, మీ వంటి చాయ పెంపొందుతుంది, అలాగే ఉంటుంది. సహజంగా, మృదువుగా ఎరుపెక్కుతుంది.
ఫెయిర్ అండ్ లవ్‌లీ —నల్లని చర్మాన్ని ఎర్రబరచడం కోసం సున్నితమైన తీరు.





ఫెయిర్ అండ్ లవ్‌లీ నల్లని చర్మాన్ని ఎర్ర బరచడం కోసం సున్నితమైన తీరు

లింటాస్-PALOV.8-2315 TL



ఉత్తరాలు

అట్టమీద బొమ్మ

అందాలనటి కుమారి జయప్రద చిరు దరహాస వదనార విందంతో (21-7-78) ఆంధ్ర సచిత్ర వారపత్రిక చాలా ఆకర్షణీయంగా వుంది. సామాన్యుని సణుగుడు శీర్షికపై వీరాజీగారు తెలియజేసిన విషయాలు వాస్తవంగా వున్నాయి. "భయం" కథ ఒక మాదిరిగా వుంది.

పులుసుగంటి సత్యనారాయణ (రవి), (ఐండార్లంక)

సినిమా

పెద్దకథ ప్రేమించుకున్నాక.. చాలబాగుంది. శ్రీనివాస్‌గారి సినిమా సొగడ్తే "రామకృష్ణులు" చిత్రము ప్రేక్షకుల అమోఘ ఆదరణను చూరగొన్నది ముఖ్యంగా స్త్రీలను ఆకర్షించినది" అనడము చాల శోచనీయంగా ఉంది. శ్రీనివాస్ గారు బాగలేనిచిత్రాలను ఇలాఎందుకు పొగుడ్తారో?

అజీజ్‌బాబు, పెంట శంకర్, (భువనగిరి.)

మోజు

శుక్రవారమండీ ఈ రోజు అని మా ఆవిడ ప్రతిశుక్రవారం జ్ఞాపకం చేస్తుంది. ఎందుకో తెలుసా ? మా అభిమాన ఆంధ్రసచిత్రవారపత్రిక మా డాగ్‌డోగ్రాకు వచ్చేది శుక్రవారమే కనుక మా యింట్లో వారపత్రిక శుక్రవార పత్రిక అని నామ కరణ చేసుకుంది.

మోహనరూప సీరియల్ చాలా యింటరెస్ట్‌గా నడుస్తోంది. పద్మావతి పెళ్ళి (పెద్దకథ) ఎటువంటి ఒడుదుడుకులు లేకుండారాజశేఖరంతో పెళ్ళి కుదిరింది. (14-7-78) పత్రికలో కథలు సరవా లేదు.

యస్. ఆర్. దదలబాద (డాగ్‌డోగ్రా-డార్జిలింగ్ జిల్లా)

మాడ్రన్ స్కూల్

జయప్రద ముఖచిత్రంతో వెలువడిన 21-7-78వ తేదీ పత్రికలో అంశాలన్నీ చాలా బాగున్నాయి. ముఖ్యంగా "వీరాజీ"గారి పరిచితమైన "మాడ్రన్‌స్కూల్"లో, చక్కని నిజం ఎంచక్కా తెలిపారు. వాస్తవాలను బాగా చిత్రీకరించారు. డొనేషన్‌ల రేట్ల స్థాయిని కూడావివరిస్తే, తెలియని వారు ఇకనైనా జాగ్రత్త పడతారు "కార్టూన్‌లు" బాగానే ఉన్నాయి. "ధర్మపథం" "జి.వి.జి" పేజీ చాలా బాగున్నాయి. శ్రీనివాస్‌గారు చాలాచక్కగా వ్రాస్తున్నారు.

పెన్మెత్స సూరిబాబు, ఎ. వి. రావ్ మల్లిఖార్జున్. (హైదరాబాద్.)

శరణాగతి

ధర్మపథం

—బులుసు వేంకటరమణయ్య.

ఆపదలో ఉండి, దానిని తప్పించుకొనుటకు శక్తి లేనివాడు ఆ ఆపత్తును తప్పించుకొనుటకు ఇతరులను ఆశ్రయించవలసి ఉంటుంది అలా ఆశ్రయించేటప్పుడు ఎంతో ఆలోచించవలసి ఉంటుంది. అలా ఆలోచించి ఒక నిశ్చయానికి వచ్చిన పిమ్మటనే శరణాగతిని పొందవలసి ఉంటుంది.

ఆ శరణాగతి ఆరు విధాలుగా వుంటుందని రామాయణంలో ఇలా చెప్పబడి ఉన్నది.

"ఆనుకూల్యస్య సంకల్పః
ప్రాతికూల్యస్య వర్జనమ్,
రక్షిష్యతీతి విశ్వాసః
గోప్తృత్వ వరణం తథా.
ఆత్మ నిక్షేప కార్పణ్యే
షడ్విధా శరణాగతిః"

లోకంలోని జనుల తత్త్వాలు అనేక రీతులుగా ఉంటాయి. స్థూల దృష్టికి అందరూ సమానంగానే కనబడుతారు. శరణు పొందే వారిని ఆదుకొనేవారెవరో ప్రతికూలంగా ఉండేవారెవరో సులభంగా తెలియదు. వారి వారి స్వభావాలను తన ఆలోచనలవల్లగాని, అప్తులవల్లగాని తెలుసుకోవాలి. అప్పుడు అనుకూలంగా ఉండేవారెవరో, ప్రతికూలంగా ఉండేవారెవరో తెలుస్తుంది. తనకు అనుకూలంగా ఉండేవారినే ఆశ్రయించాలి. ప్రతికూలురని తోచినవారివైపు పోకూడదు.

అయితే ఇతరులకు ఆశ్రయమిచ్చి కాపాడాలనే కోరిక కొందరికి ఉండవచ్చును. కాని ఆ విధంగా చేసే శక్తి లేకపోవచ్చును. అట్టివారిని ఆశ్రయించి ప్రయోజనం ఉండదు. "ఈయన నన్ను తప్పక రక్షించ గలడు" అనే గట్టి నమ్మకం ఉన్న వారినే ఆశ్రయించాలి.

తర్వాత— తాను ఎవరిని ఆశ్రయించదలిచాడో ఆ వ్యక్తిని నిర్ణయించుకొని, ఆయనయే తనకు దిక్కని దృఢనిశ్చయంతో ఆయన సన్నిధిని చేరాలి. చేరి ఆయన కాళ్ళపై పడిపోవాలి. తన దయనీయస్థితిని వెళ్ళబోసుకుని "నీవు రక్షిస్తేగాని నిలువలే" దంటూ— అతని పాదాలు విడువ కూడదు. ఈ విధంగా బాగుగా ఆలోచించి, తగిన వారిని ఆశ్రయించినప్పుడు ఆ వ్యక్తి ఎంత మాత్రం చేయి విడువడు.

ఈ ఆరు విధాల పద్ధతులు తెలిసినవాడే రక్షణను పొంద గలుగుతాడు.

విభీషణుడు శ్రీరాముని ఆశ్రయించినప్పుడు ఈ విషయాలు బాగుగా ఆలోచించే ఆయన వద్దకు వచ్చాడు. ఆయన తన అన్నకు శత్రువయినా, తనకు శత్రువు కాడు. తనకు ఎంత మాత్రం ప్రతికూలుడు కాడనే విభీషణుని నిశ్చయం. అందువల్లనే ధైర్యంతో వచ్చి శరణు జొచ్చి కృతార్థుడయినాడు.

కథలు

నటి శ్రీప్రియతో వెలువడిన పత్రిక చూడగానే కొనేయాలనిపించింది. కొన్నాను. -పద్మావతి పెళ్ళి- కథ చాలాబాగుంది. శారదమ్మ యొక్క-పాత్ర చాలా బాగానచ్చింది. పత్రిక పేజీలు పెంచి రేటు పెంచడి.

జి. లక్ష్మన్ గౌడ్, జి. శోభ, (జనగామ)

* * *

మీ కార్యాలయం నుండి వెలువడిన 21-7-78వ సంచిక జయప్రద ముఖచిత్రంతో పత్రికకు అత్యంత ఆకర్షణీయంగా శోభాయమానంగా ఉంది.

ఈ సంచికలో కథలు -భయం- -అంతా గ్యాస్ మహిమ- చాలా బాగున్నాయి.

ఈనాటి వనితాలోకం -శీర్షికలో- వానిరెడ్డి రూప్నిరాణి గారు -టీచర్ ఉద్యోగాలైనా స్త్రీకే కేటాయించాలి- అన్న విషయం పై విషయాలను బాగా విస్తృతంగా వివరించారు.

టి. రంపీంద్రనాథ్, (అనంతపురం)

* * *

అందాల తార కుమారి జయప్రద ముఖచిత్రంతో వెలువడిన 21-7-78 నాటి పత్రిక ఎంతో హుందాగా ఉంది. -ప్రేమించుముక్తికై- అన్న పెద్దకథ ప్రారంభంలోనే మా హృదయాలను ఆకర్షించింది -భయం- కథ పత్రికకే హైలైట్ -మోహనరూప-సీరియల్ మంచి ఇంటరెస్ట్‌గా సాగుతోంది. ఇక శ్రీనివాస్‌గారి సినిమా కబుర్లు. జి.వి.జి. పేజీ గురించి మరి చెప్పనవసరంలేదు.

పండురు భక్తరాజేశ్వరరావు. అప్పల నరసింహారావు. (భీమునిపట్నం.)

సీరియల్

మా అభిమాన నటియైన 'కుమారి జయప్రద' ముఖచిత్రం మా మీ ఆంధ్ర సచిత్ర వార పత్రికకు ఎంతో అందాన్నిచ్చింది. పదే పదే చూడాలనిపించింది. 'మోహనరూప' సీరియల్ చదువుతూ ఉంటే మోహన రాగంలో పాట వింటున్నట్లు అనుభూతి కలుగుతుంది. ఇంత మంచి సీరియల్ రచించిన మాదిరెడ్డి సులోచన గారికి ప్రచురించిన మీకు థాంక్స్. కథలలో "భయం" కథ బాగుంది. 'ప్రేమించు ముక్తికై' మొదట్లోనే మమ్మల్ని ఆకట్టుకొంది. సినిమా విశేషాలు చక్కగా వివరిస్తున్న శ్రీనివాస్ గారికి మా అభినందనములు. జి.వి.జి. పేజీ ఈ వారం పత్రికకే హైలైట్.

కుమారి పి. సుధారాణి, జల్లి క్రిష్ణమూర్తి (కుప్పం.)

* * *

ది. 21-7-78 నటి జయప్రద ముఖచిత్రంతో (మీ) మా పత్రిక చూడ ముచ్చటగా నున్నది. ప్రేమించుముక్తికై పెద్దకథ మొదటిభాగము మమ్మల్ని ఆకట్టుకున్నది. మోహనరూప సీరియల్ మంచి మూడ్‌లో నడిపిస్తున్నారు. భయం కథ సమాజములో కొందరడి మంచిచెడులుఆలోచించక చేసే పనులకు ఎలాంటి బాధ్యత వహించవలసి ఉంటుందో ఈ కథ అద్దం చూపించినది. జోక్స్ కడుపుబ్బ నవ్విస్తున్నాయి. రాగద్వేషాలు సీరియల్ ప్రారంభ సంచికతో మీ (మా) అభిమాన హాస్య నటులు రాజబాబు ముఖచిత్రంతో చూడాలని వుంది.

మంత్రి లక్ష్మయ్య. అయిలా మధుసూదన్‌బాబు, విజయామధు, నాగేందర్, అర్వపల్లి లక్ష్మి రాజమ్. నాగలక్ష్మి. (పెంట్రిభి ఆర్.యస్.)


* * *

జయప్రద ముఖచిత్రంతో వెలువడిన 21-7-78 నాటి మా అభిమాన ఆంధ్రసచిత్రవార పత్రిక అందాలు విరజిమ్మే అజంతా సుందరిలా రోజంతా మమ్మల్నెంతో మురిపించింది.

సీరియల్ "మోహనరూప" గలగలపారుతున్న సెలయేరులా సాఫీగా సాగిపోతుంది. రచయిత్రికి మా అభినందనలు.

ప్రేమించుముక్తికై పెద్దకథ ఆదిలోనే ఆసక్తిదాయకంగా, ఆనందదాయకంగానూ వుంది. 'భయం' కథ పర్వాలేదు. ఇక అంతా గ్యాస్ మహిమ యను కథ పేరుకు తగ్గట్టుగా వుంది. ఈ సంచికలో కథలు ఏమి బాగాలేవు.

గంటా ఉమాశంకర్ రెడ్డి. వెంకమహంతి మన్మధ పట్నాయిక్, శంకర్, శేఖర్, శివ కుమార్‌లు. (బరంపురం.)



పుట్టిన రోజు బహుమతి

మల్లాది వెంకటకృష్ణమూర్తి

...జ్‌కు బయల్దేరడానికి సిద్ధమవుతుండగా భగవతికి కాలింగ్ బెల్ తాలూకు చైమ్స్ ...పించాయి. వెళ్ళితలుపు తీసింది.

బయట ...రుగురు పెద్ద అద్దాల ...రువాని మోస్తూ నించుని కనబడ్డారు. ...మటలు కక్కుతున్నారు దాన్ని మోసుకు ...వటంవల్ల.

... కాలింగ్ బెల్ మోగించినతను చెప్పాడు ...ండు కాగితాలు అందించి.

"చమన్‌లాల్ షాప్ నుంచి ఈ స్టీల్ ...రువా తెస్తున్నాం ఈ అడ్రస్‌లో డెలివరీ ...వ్వమని చెప్పారు. బీరువా లోపల ఎక్కడ ...పెట్టాలో చూపించి, ముట్టినట్లుగా ...ఎర్ర కాగితంమీద సొంతకం చేసివ్వండి."

అప్పుడు గుర్తుకు వచ్చింది భగవతికి ...తన భర్తని అద్దాల బీరువా కొనమని పోరు ...పెడుతున సంగతి తన పుట్టిన రోజు ...రోజు కనుకనే అది కొన్నారన్నమాట!

బీరువాని ఎక్కడ పెట్టాలో చూపించి సొంతకం చేసింది ఆ కాగితంమీద.

"తాళం చెవులు మీవారి దగ్గర వున్నాయి. కూలీలకి అరవై రూపాయలు ఇవ్వండి. ఒక్కొక్కరికీ పది..."

వేనిటీ బేగ్‌లోంచి అరవై తీసి ఇచ్చింది. తనకి నచ్చే కలర్ 'క్రీమ్ కలర్'. ఓవల్ షేప్‌లో వున్న నిలువుటద్దం. ఎంతో ముచ్చటగా వుంది.

భర్తని మనసులోనే మెచ్చుకుంది తృప్తిగా. రాత్రి ట్రంక్‌కాల్ చేసినప్పుడు మూడు నిముషాలు ఎక్స్‌టెన్షన్ తీసుకొని వెయ్యి ముద్దులు ఇవ్వాలి...

క్లబ్‌కెళ్ళి చీకటి పడుతుండగా తిరిగి వచ్చింది ఇంటికి. లైట్ వెలిగించాక ఇంటిని చూస్తే గుండె గుభేలుమంది భగవతికి.

పూచిక పుల్ల కూడా లేదు ఇంట్లో. పూర్తిగా ఖాళీగావుంది.

గంట తర్వాత వచ్చిన సబిన్‌స్పెక్టర్ భగవతి చెప్పింది విని చిన్నగా నవ్వి చెప్పాడు.

"ఇది మూడోసారి ఆ దొంగలు ఇల్లు మొత్తం దోచుకోవటం. ఆ బీరువాలో అరలుండవు. బీరువా తలుపులకి తాళం లోపలనుంచి తీసుకొనే ఏర్పాటు వుంటుంది అందులో ఇద్దరు దొంగలుంటారు. బీరువా ద్వారా ఇదరు దొంగలని మీరే ఇంట్లోకి మీకు తెలియకుండా రప్పించారన్నమాట. మీరుబయటకెళ్ళగానే లోపలనుంచి తాళం తెరచుకుని బయటికి వచ్చి, మిగతా దొంగల సహాయంతో వాళ్ళు మీ ఇల్లంతా గుల్ల చేసి వెళ్ళారు వాళ్ళని పట్టుకునే ప్రయత్నం చేస్తున్నాం..."

భగవతి కుప్పలా కూలిపోయింది ఏడుస్తూ.

భూకంపాల ఉనికిని తెలిపే భూగర్భ కేంద్రం

ఆర్మీనియాలో భూగర్భ భౌగోళిక వాతావరణ అధ్యయన కేంద్రం కోసం 378 మీటర్ల పొడవు సొరంగాన్ని తొలవడం పూర్తయింది. ట్రాన్స్ కకేసస్‌లో యిదే మొట్ట మొదటి కేంద్రం. ఈ నిర్మాణం పని పూర్తి అయిన వెనువెంటనే ఆర్మీనియన్ భూగర్భ శాస్త్రవేత్తలు, నిత్య జీవితాన్ని భయాందోళనలకు గురిచేసే ప్రాంతాల్లో భూకంపాల ఉనికిని కనిపెట్టగలరు త్రికోణాకారంలో నిర్మించబడిన యీ సొరంగంలో 9 విభాగాలుంటాయి. ప్రతి ఒక్క విభాగంలో, భూగర్భ పొరల ఉనికిని రికార్డు చేసేందుకు వేరు వేరు పరికరాలను అమరుస్తారు.

భూకంపాల చిహ్నాలను గమనించే యీ వాతావరణ అధ్యయన కేంద్రం, భూమి యొక్క పై పొరల్లోని అలజడుల్ని, భూ అయస్కాంత క్షేత్రంలోని మార్పులను, రాబోయే విధ్వంసానికి సంబంధించిన యితర చిహ్నాలను నమోదు చేస్తుంది. భూగర్భ వాతావరణ అధ్యయన కేంద్రం యీ సమాచారాన్ని భూమి పైన వుండే కేంద్రానికి ప్రసారం చేస్తుంది. వీటికి సంబంధించిన పనినంతా కంప్యూటర్ల ద్వారా నిర్వహించబడుతుంది.

హైదరాబాద్ నోట్ బుక్


—తిరుమల రామచంద్ర

మదర్ థెరెసా :

భారతదేశంలోని బాధిత దరిద్ర ప్రజల సేవ కోసం అంకిత అయిన మదర్ థెరెసా జూలై 7 వ తేదీన ఇక్కడి ఆర్చిబిషప్ గృహంలో పత్రికా ప్రతినిధుల గోష్ఠిలో మాట్లాడుతూ, పేద లకు తోడ్పడడం కోసం మహిళలు సహకరించ వలసిందని కోరారు. తమ సేవాసంస్థలు సంచార చికిత్సా కేంద్రాలు నిర్వహిస్తున్నట్టు ఆమె తెలి పారు. తమ సేవాసంస్థలు లక్ష 50 వేల కుష్ఠు వ్యాధితులకు సేవచేస్తున్నవని, ఈ రోగుల ఆశ్రయానికి కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు విశేష స్థలాలు కేటాయిస్తున్నవని అన్నారు. ఈ విధంగా మదర్ థెరెసా ప్రపంచం నాలుగంచులా 120 సేవాసంస్థలు నిర్వహిస్తున్నారు. వీటిలో 89 భారతదేశంలోను, ఐదు మన రాష్ట్రంలోను ఉన్నవి.

మహానటుడు శ్రీ రొద్దం హనుమంతరావు:

అర్ధశతాబ్దికిందటి దేశపరిస్థితినిసింహావలోకనం చేస్తే, అది, న్యాయవాది యుగంగా మనకు దర్శనమిస్తుంది. ఏ రంగం చూచినా న్యాయ వాదులే కానవచ్చేవారు. శ్రీ రాఘవతో ఎన్నో నాటకాలలో నటించి, మన్నన పొందినవారు సుప్రసిద్ధ న్యాయవాదులు శ్రీ రొద్దం హనుమంత రావు. ఆయన వయస్సు ఇప్పుడు 72 ఏండ్లు. మొట్టమొదట ఆయన అనంతపురం ఆర్ట్స్ కాలేజీ దినోత్సవంలో, 1922లో విజయనగర సామ్రాజ్య పతనం నాటకంలో రామరాజుభార్య తిరుమలాంబగా నటించారు. వయస్సు 16 సంవత్సరాలు. అప్పటి నుంచి అర్ధశతాబ్దిపాటు 40 నాటకాలలో వివిధ పాత్రలు నిర్వహించారు. వాటిలో 20 స్త్రీపాత్రలు. జీవితాన్నే నాటకంగా మలచుకొన్నవారు రొద్దం వారు. అనంతపురంజిల్లా పెనుకొండలో రొద్దం వారి వంశం ప్రసిద్ధన్యాయవాదుల వంశం, నట వంశమూను. రొద్దంవారు 1923లో పెనుకొండలో శ్రీ కృష్ణదేవరాయ నాట్యమండలి స్థాపించి, తొలి సారిగా విజయనగర రాజ్యపతనం నాటకం ప్రదర్శించారు. ప్రతి ఎండకాలం సెలవులోను ఒక నాటకం అభ్యసించి, ఆడేవారు. రొద్దం వారి తొలి మగవేషం ధర్మవరంవారి ఉత్తర గోగ్రహణంలో ఉత్తరకుమారుడు. శ్రీహనుమంత రావు 1933లో అనంతపురంలో న్యాయవాదిగా స్థిరపడినారు; శ్రీ హనుమంతరావు అనంతపురంలో శ్రీ అశ్వత్థనారాయణశాస్త్రితో కలిసి 'లలిత కళా పోషక సమితి' స్థాపించి పెక్కు నాటకాలువేశారు. శ్రీ హనుమంతరావు అకపా దకపా నాటకాలలో హార్మోనియం వాయించేవారు. చంద్రగుప్త నాటకంలో స్థానంవారితోపాటు, రాఘవతోపాటు రొద్దంవారు చాణక్యుడుపాత్ర, విప్రనారాయణలో స్థానంవారితోపాటు శ్రీనివాసపాత్ర, తులాభారం, చింతామణి, సారంగధరలలో స్థానం వారితో కృష్ణుడు, సుబ్బిసెట్టి, సుబుద్ధి పాత్రలు నిర్వ హించారు రాఘవతో సారంగధర, రామదాసు, పాదుకాపట్టాభిషేకంలలో సుబుద్ధి, ధర్మకర్త, దశరథుడు, లక్ష్మణుడు మున్నగు పాత్రలు నిర్వ హించారు. స్థానం వారితోపాటు వెంగళూరు, మైసూరులలో నెలరోజులపాటునాటకాలు ప్రదర్శించి మైసూరు మహారాజావారి అంతఃపురంలో, మహా రాజావారి సమక్షంలో విప్రనారాయణ నాటకం ప్రదర్శించి దుశ్శాలువలు సన్మానం పొందారు. సాంఘిక నాటకాలలో జయంమనదేలో సుబ్బా రాయుడుగా, కులంలేని పిల్లలో పావన్న పంతులుగా, ఎన్ జీవోలో ఎన్ జీవోగా పెండ్లి ట్రెయినింగులో శాస్త్రిగా, పల్లాటి ప్రధానిగారి సమస్తే(మిసమ్మసినిమాకథ)లో జమీందారుగోపాల రావుగా, గాలివానలో నరసింహారావుగా, కళ్ళో ద్ధారకులలో కళాధర్ గా నటించి మెప్పుపొందారు.



శ్రీ రొద్దం హనుమంతరావు

ఆంగ్ల నాటకాలలో ఒథెల్లోలో రాఘవ ఒథెల్లో వేయగా, రొద్దం వారు ఇయాగోగా, మర్చంట్ అఫ్ వెన్నిస్ లో రాఘవ షైలాక్ వేయగా, రొద్దం వారు ఆంటోనీ, పోర్షియాగా నటించారు. పెక్కు చోట్ల సన్మానంపొందారు. ఇప్పటికి-72ఏళ్లయినా, ఎవరైనా బలవంతంచేస్తే చిన్న చిన్న వేషాలు వేస్తారు. రొద్దంవారికి కాఫీ, కేదారగౌళ, కానడ, భీంపలాస్, తోడిరాగాలు చాల ఇష్టం. బాడ్ మింటన్, టెన్నిస్ క్రీడలలో పెక్కు పతకాలు పొందారు. ఒకప్పుడు సౌతిండియా చాంపియన్ గాను వున్నాడు. ఇలాంటి మహానటుని సి. యస్. ఆర్. కళామందిర్ వారు. సి. యస్. ఆర్. ఆంజనేయులు 72వ జయంతి సందర్భంగాను,

(48వ పేజీ చూడండి)

సీరియల్

రాగద్వేషాలు

శ్రీమతి మాధవపెద్ది పుణ్యశీలాప్రసాద్

(గత సంచిక తరువాయి)

3

అత్యంత శ్రద్ధతో తీవ్రంగా తెలుగు దేశం వైపు సంబంధాలు చూస్తున్నారు హనుమంతరావుగారు.

కలకత్తాకి ఎవరు తెలుగు వాళ్ళు వచ్చినా రావు గారికి ఇట్టే తెలిసిపోయేది.

వాళ్ళని తమ యింటికి రప్పించుకుని భోజనమో కాఫీనో ఇచ్చి వివరాలు కనుక్కుని వీళ్ళతో సంబంధాలు తిరగేసేవారు.

రావుగారి సంగతి తెలుసుకున్న ఒక వివాహాల వీరయ్య రావుగార్ని వదిలేవాడు కాదు

నెలకోసారి వచ్చి ఒక వారం, పది రోజులు తిష్ఠ వేసి- ఒక వరుళ్ల లిస్టు రావుగారి చేతికిచ్చేవాడు.

అందరి సంగతులూ ఏకరువు పెడుతూ వుండేవాడు. చాలా వరకు రావు గారికి వచ్చేవి కావు. మరి కొన్ని ఆయన కూతురికి వచ్చేవి కావు. అసలు ఇందిరకి ఆయన్ని చూస్తేనే మంటగా వుండేది.

రోజుల తరబడి ఇంట్లో తిష్ఠ వేయడం, అన్నీ అడిగి మరీ చేయించుకు తినడం. ముఖ్యంగా ఆయన చేసే వ్యాఖ్యానాలు—

"అమ్మాయ్. మరీ మగవాళ్ళ లాగా ఆ డ్రస్సు లేమిటమ్మా? పెళ్లి కావల్సిన పిల్లవి- కాస్త మన కట్టూ — బొట్టూ వుండద్దూ? అసలు నువ్వు బొట్టు పెట్టుకోవేం? చేతులకి గాజులూ, మెళ్లో ఓ గొలుసూ వుంటే అందం ! ఆ జుట్టేమిటి? చక్కగా జడల్లు కోరాదూ?" ఇట్లాంటి పలహాల్ను, విమర్శలు— ఇందిరకి అసలు గిట్టవు.

తండ్రిని చూసి వూరు కుంటోంది— కాని లేకపోతే బయటికి దిబ్బడో గెంటిం చేదే- వొకర్నతో చెప్పి !

"పెళ్ళయ్యాక అన్నీ మారతాయండీ— వీరయ్యగారూ! అది ఏం చేసినా ఇప్పుడేగా? ఇంకా చిన్న పిల్ల ! అందుకే నేను దేనికీ అడ్డు చెప్పను." కూతుర్ని ఆప్యాయంగా చూస్తూ వీరయ్య మాటలకి జవాబు చెప్తారు- రావుగారు.

ఈ సారి వీరయ్యగారు తెచ్చిన సంబంధాల్లో ఒకటి తండ్రీ-కూతుళ్ళ కిద్దరికీ నచ్చింది.

వాళ్ల అడ్రసు తీసుకుని కూతురి జాతకం పంపిస్తూ ఉత్తరం రాశారు వాళ్ళకి రావుగారు.

పదిహేను రోజుల్లోనే తిరుగు సమాధానం వచ్చింది. జాతకాలు కుదిరాయనీ— పిల్ల ఫోటో పంపమనీను. ఎన్నో ఫోటోలే వున్నా ఇందిరకి మళ్ళీ ప్రత్యేకంగా ఒక ఫోటో తీయించారు-రావుగారు.

ఆ ఫోటో పంపిస్తూ తన ఆస్తి వివరాలురాస్తూ, తన తదనంతరం ఆ ఆస్తి అంతా కూతురు, అల్లుళ్ళదేనని కూడా రాశారు.

ఆ తరువాత వాళ్ళు అబ్బాయి ఫోటో పంపించారు. జాతకం కూడా పంపిరారు' వీళ్ళనీ చూసుకోమని !

అబ్బాయి ఫరవాలేదు. ఓ మోస్తరుగా వున్నాడనుకున్నారు. రావుగారు, ఇందిరా కూడా !

'యావందేవుంది, మంచి సంప్రదాయం గల కుటుంబమైతే అంతేచాలు,' అన్నారు రావుగారు.

ఆ తరువాత నెలరోజులకి వాళ్ళు పిల్లని చూడ్డానికి వస్తున్నామంటూ ఉత్తరం రాశారు.

ఇంక రావుగారి హడావిడి ఇంతా, అంతా కాదు !తెలిసిన వాళ్ళింట్లో 'బస' ఏర్పాటు చేశారు. తాము స్వయంగా స్టేషనుకి వెళ్ళి వాళ్లని ఆహ్వానించారు.

భోజనాదులు మంచి హోటల్లో ఏర్పాటు చేశారు. పెళ్లివారి కన్నీ రాజభోగాలే ! వాళ్లతో బాటే వీరయ్యని గూడా ! వచ్చిన రోజు 'రెస్ట్' తీసుకోమని ఆ తరువాతరోజు ఏర్పాటు చేశారు పెళ్లి చూపులు ! ఇందిరని ఒక గంటసేపు తన దగ్గిర కూర్చోబెట్టుకుని ఏవేవో ఉపదేశించారు ! ఎట్లా మసులుకోవాలో చెప్పారు.

వాళ్ళమ్మ పట్టుచీరల్లో ఒకటి కట్టుకోమన్నారు. తల్లి నగలు అలంకరించుకోమన్నారు. బొట్టు పెట్టుకుని తీరుగా జడల్లుకోమన్నారు. తన ఊహ తెలిశాక అట్లా ఎప్పుడూ అలంకరించుకోలేదు ఇందిర. అద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకుని తనే కళ్ళు తిప్పుకోలేకపోయింది. తండ్రిపోలికలూ,తల్లిరంగూ వచ్చాయామెకి. బుగ్గల సొట్టలూ, విశాల నేత్రాలూ ఆమెకి ప్రత్యేకంగా దేవుడిచ్చిన వరాలు !

కళ్లకి కాటుక పెట్టడంతో ఇంకా విశాలంగా కనబడుతున్నాయని ! ముదురు

జరిగిన కథ 1 : ఉన్నతాధికారి హనుమంత రావుగారు వివాహమాడిన బెంగాలీ యువతి గీత, ఇందిరను కనిన కొంతకాలానికి మరణిస్తుంది. ఆయన అక్క సుగుణ తన కొడుకు ఫారిన్ రిటర్న్‌డ్‌ను ఇందిరకు యివ్వటకు ఆమె అత్త మామలు నిరాకరించారని ఉత్తరంలో వివరం తెలియచేస్తుంది.


రంగు పట్టు చీరలో అందాల బొమ్మలాగా మెరిసిపోతోంది ఇందిర !

శభాష్ అమ్మాయ్! అట్లా వుండాలి! లక్ష్మీదేవిలాగా వున్నావు! మన తెలుగు ఆడబడుచులు అట్లాగే వుండాలి!'' వీరయ్యగారి మాటలకి మొహం చిట్లించింది ఇందిర !

ఇల్లంతా అందంగా నీట్ గా సర్ది వుంది వర్షం దాటాక వచ్చారు— వీరయ్యగారితో కలిసి పెళ్లికొడుకు-అతడి తల్లీ, దండ్రీను ఎదురెళ్ళి లోపలికి తీసుకొచ్చారు రావుగారు

''దయచేయండి! అమ్మా— మీ రిట్లా రండి! రండి కూర్చోండి— అమ్మా మీ రట్లా కూర్చోండి!'' తడబడుతూ మాట్లాడుతున్నారు రావుగారు— అచ్చు ఆడపిల్ల తండ్రిలాగే!

వారు కూర్చున్నాక— కాఫీ, ఫలహారాలు తెప్పించారు తమ ఇంటి సంగతులన్నీ ఏకరువు పెట్టడం ప్రారంభించారు



రాగద్వేషాలు

పొరపాటున గూడా గీత సంగతి ఎత్తడంలేదు. కొంత సేపయాక– తండ్రి పిలుపుతో నెమ్మదిగా నడిచి వచ్చింది ఇందిర.

వచ్చి తండ్రి పక్కన కూచోబోయి– తండ్రి అటు పక్క చూపించడంతో–పెళ్లి కొడుకు తల్లి పక్కన కూచుంది. ఆవిడ కళ్లార్పకుండా చూసింది ఇందిరని.

ఇందిర తల ఎత్తలేదు.

పెళ్లికొడుకు తన దృష్టి మరల్చుకో లేక ఆరాధనగా అలాగే చూస్తుండిపోయాడు!

పెళ్లికొడుకు తండ్రి గూడా సంతృప్తి కరంగా చూడడం గమనించారు రావుగారు.

ఏవో రెండు-మూడు ప్రశ్నలడిగారు.

అన్నిటికీ సంతృప్తికరంగానే జవాబులు ఇచ్చింది ఇందిర.

'తల్లిలేని పిల్ల' అని సానుభూతి చూపించారు, ఇందిర మీద.

పసుపు, కుంకుమ, పూలు, కొబ్బరికాయ, జాకెట్టు గుడ్డ, బొట్టుపెట్టి పెళ్లి కొడుకు తల్లికి ఇప్పించారు, ఇందిర చేత రావుగారు.

ఆవిడ చాలా సంతోషించింది.

ఆవిడ కూడా తను తెచ్చిన పళ్లు, పువ్వులు, ఇందిరకి బొట్టుపెట్టి ఇచ్చింది.

ఇంక వెళ్తామని లేచారు, వాళ్లు.

ఆ తరువాత రోజు తెలియజేశారు పిల్ల నచ్చిందని! కట్నం, కానుకలు గూడా మాట్లాడుకొన్నారు.

ఊరువెళ్లాక పురోహితుడితో మాట్లాడి ముహూర్తాల సంగతి రాస్తానన్నాడు, పెళ్లి కొడుకు తండ్రి విశ్వనాథంగారు.

రావుగారు సంతృప్తిగా నిట్టూర్చారు! ఆనందంలో తేలిపోయారు!

పెళ్లి ఎట్లా చెయ్యాలో, శుభలేఖలు ఎట్లా వేయించాలో, పెళ్లికి ఎవరెవర్ని పిలవాలో, అన్నీ ఆ పూటనుండే ఆలో చించసాగారు! ప్లానులు వెయ్యసాగారు! తనకు తెలిసినవాళ్లకి చాలామందికి అప్పుడే చెప్పేశారు!

ఇందిర పెళ్లయి వెళ్లిపోతుంది, అని తల్చుకుంటే ఆయనకి చాలా బాధగావుంది!

ఇందిరని తీసుకుని చీరల షాప్‌కి వెళ్లి, కావలసిన చీరలన్నీ కొన్నారు. నగల కోసం 'శేఠ్'ని ఇంటికే రప్పించారు.

"తల్లీ ఇందూ!" పిల్చారు రావుగారు.

"ఏమిటి నాన్నా" వచ్చింది ఇందిర.

ఒక్కసారి దగ్గరికి తీసుకుని తల నిమిరారు. కళ్లల్లో నీళ్లు తిరిగాయి ఇద్దరికీ.

"ఆఁ! చూడు తల్లీ శేఠ్‌జీ వచ్చారు. నీకు ముత్యాలసెట్ కావాలో, కెంపులసెట్ కావాలో సెలెక్ట్ చేసుకో! ఇవి కొత్తగా వచ్చాయట! డైమండ్ నెక్లెస్ ఎట్లాగూ వుంది..."

ఒకసారి వాటిని చూసి,

"నాన్నా..." ముద్దుగా అంది ఇందిర.

"ఏం తల్లీ, ఏమిటి నీ సందేహం – చెప్పు?"

"నాకు ఈ రెండు సెట్లూ నచ్చాయి– రెండూ కావాలి. కెంపులసెట్ ఎర్ర పట్టు చీర మీదకి మాచ్ అవుతుంది – ముత్యాల సెట్ అన్నిటి మీదకి మాచ్ అవుతుంది..."

"అంతేకదా? ఆల్‌రైట్...శేఠ్‌జీ–బిల్ తయారుచేసి పంపించండి. చెక్ రాసిస్తాను"

శేఠ్‌జీ చాలా సంతోషించాడు.

"థాంక్‌యూ రావ్‌జీ! బహుత్ షుక్రియా..." అంటూ లేచాడు.

అంతలో పోస్ట్ వచ్చింది. ఇందిరే అందు కుని తండ్రి చేతిలో పెట్టింది ఉత్తరాల కట్టని! శేఠ్‌జిని పంపించి ఉత్తరాలు చూడడంలో మునిగిపోయారు రావుగారు.

ఇందిర భోజనాల ఏర్పాట్లు చూడడానికి లోపలికి వెళ్లింది.

అరగంట గడిచింది–

"ఇందిరా" గట్టిగా కేక పెట్టారు రావుగారు. సింహ గర్జన లాగా వుంది ఆ పిలుపు!

పరుగున వచ్చిందామె.

తండ్రి మొహం చూసిన ఇందిర ఉలిక్కి పడింది. ఎప్పుడూ చూసి వుండదు తండ్రిని ఆ విధంగా!

అంత భయంకరంగా వున్నారాయన!

గబగబా దగ్గరికొచ్చి కూతురి రెండు భుజాలూ గుచ్చి పట్టుకున్నారు!

చాలా నొప్పి కలిగింది ఇందిరకి!

అయినా ఓర్చుకుంది!

ఆ నొప్పి కన్నా తండ్రి విచిత్ర ప్రవర్తన బాధ కలిగిస్తోంది ఇందిరని!

"ఏ...మి...టి నాన్నా- ఏం జరిగింది?"! పెదిమలు విడివడ్డాయి

ఏ- మాట పైకి రాలేదు

కూతురి ముఖంలోకే పరిశీలనగా చూస్తున్నారాయన!

ఏమీ మాట్లాడడం లేదు.

అలాగే చూస్తూవున్న ఆయన— చూస్తూండగానే చాప చుట్టలాగా కింద పడిపోయారు

వళ్ళంతా చెమటలు!

భయం వేసింది- ఇందిరకి.

"నాన్నా, నాన్నా" అని పిలిచింది.

మాటా పలుకూ లేదు— ఆయనకి.

అసలు స్పృహ కూడా వున్నట్టు లేదు!

ఏడుపు ముంచుకు వచ్చింది, ఇందిరకి! ఏంచెయ్యాలో తోచక తండ్రి దగ్గర అట్లానే కూచుంది, ఏడుస్తూ, 'నాన్నా, నాన్నా అని పిలుస్తూనేవుంది.

ఆ పిలుపు విన్న నౌకర్లు, వంటమనిషి అంతా పరుగెత్తుకుని వచ్చారు.

"అమ్మాయిగారూ డాక్టర్, డాక్టర్," అంది వంటమనిషి గాబరాగా.

ఆ మాటతో, అప్పుడే గుర్తుకు వచ్చినట్టు ఒక్కంగలో ఫోన్ దగ్గరికి వెళి ది ఇందిర ఫామిలీ డాక్టర్‌కి ఫోన్ చేసింది.


ఆయనతో ఏం చెప్పిందో, ఎట్లా చెప్పిందో తనకే తెలీలేదు ఇందిరకి.

పనివాళ్ళంతా కలిసి, రావుగార్ని ఆయన గదిలో పడుకోబెట్టారు, ఫాన్ వేశారు.

ఇందిర బొమ్మలాగా చూస్తోంది అంతా!

మరో పావుగంటకి డాక్టర్‌గారు వచ్చారు రావుగార్ని పరీక్షించి, ఏదో ఇంజక్షన్ చేశారు.

"ఈయన కేదో షాక్ తగిలిందమ్మా, కొంచెం బ్లడ్ ప్రెషర్ వచ్చింది అంతే! హి విల్ బి ఆల్ రైట్! ఏం ఫరవాలేదు భయపడవద్దు అయినా నువ్వు ఒక్కదానివే వుంటే ఇదే ఆలోచిస్తూ, భయపడుతూ వుంటావు. నీకు తోడు ఎవరైనా వుంటే మంచిది! మీ తాతగారిని రమ్మని ఫోన్ చెయ్యనా?" అంటూనే ఫోన్ ఎత్తి రావుగారి మామగార్ని పిల్చి చెప్పారు. వాళ్ళని వెంటనే రమ్మని చెప్పారు. వాళ్ళు మరో అరగంటకి వచ్చారు. వాళ్ళు వచ్చేదాకా డాక్టర్ వున్నారు. ఇందిరకి



ధైర్యం చెప్తూ. ఇందిరకి చెప్పలేదు గానీ— వాళ్ళ తాతగారికి చెప్పారు డాక్టరు అసలు విషయం.

రావుగారికి 'హార్ట్ ఎటాక్' వచ్చింది! 'తెల్లవారితేగానీ ఏ సంగతీ చెప్పలేం' అని! రాత్రంతా డాక్టరు కూడా అక్కడే వుండి పోయారు. తెల్లవారాక పరిస్థితిలో మెరుగు కనబడకపోతే హాస్పిటల్లో చేర్పించాలని చెప్పారు.

అయోమయంగా చూస్తూండి పోయింది ఇందిర. ఎవ్వరికీ నిద్రలు లేవు ఆ రాత్రి!

4

రాత్రంతా అట్లాగే వున్నారు రావుగారు. తెల్లవారాక స్పృహ వచ్చిందాయనకి! చలనం కనబడింది ఆయనలో. కళ్ళు తెరిచారు. వెంటనే డాక్టరుగారు పరిశీలించారు పరీక్షించారు. మళ్ళీ ఏవో ఇంజక్షను ఇచ్చారు. 'ఇంక ఫరవాలేదు. గండం గడిచినట్టే' అన్నారు. కానీ చాలా జాగ్రత్తగా వుండాలన్నారు. అందరూ తేలిగ్గా ఊపిరి పీల్చారు.

"తల్లీ ఇందూ!" నీరసంగా పిల్చారు రావుగారు.

"నాన్నా"!

ఇందిర తండ్రికి దగ్గరగానే వుంది. తండ్రి కళ్ళు విప్పడం మాట్లాడడం' చూసిన ఇందిర సంతోషపడి పోయింది.

"అమ్మా ఇందూ!" అంటూ కూతురి రెండు చేతులూ పట్టుకుని కన్నీరు కార్చారు

అక్కున చేర్చుకొని వెక్కి వెక్కి ఏడ్చారు.

డాక్టరు మందలించారు.

"మీరట్లా ఆవేశ పడకూడదు. అస లెక్కువ మాట్లాడకూడదు. అమ్మా, ఇందిరా నువ్వు కాసేపు అవతలకెళ్ళమ్మా," అన్నారు.

"వద్దు, వద్దు. నా తల్లి నా దగ్గరే వుండాలి. నేను ఆవేశ పడను లెండి" అన్నారు రావుగారు బతిమాలుతున్నట్టు డాక్టరు వైపు చూస్తూ, కూతురి చెయి వదలకుండానే! బత్తాయి రసం తెచ్చి యిచ్చింది ఇందిర అమ్మమ్మ. అది తాగి కాసేపు కళ్ళు మూసుకుని పడుకున్నారు ఇందిర పక్కనే కూచుంది.

అప్పుడే గుర్తుకొచ్చింది. ఆయనకి "ఆ ఉత్తరం, ఆ ఉత్తరం, ఏది తల్లీ?" అనడిగారు కూతుర్ని

"ఏ ఉత్తరం నాన్నా?" ఇందిర చెప్పిన అర్థంకాలేదు తండ్రి అనారోగ్యంలో ఏవిషయమూ పట్టించుకోలేదు ఇందిర.

'అప్పుడు. ?' తండ్రి మాటలతో తనకి కూడా జ్ఞాపకం వచ్చింది.

కిందటిరోజు తండ్రి ఉత్తరాలు చూసుకుంటూ తనని పిలవడం, తరువాత తనని గట్టిగా పట్టుకుని, ఆ మరుక్షణమే స్పృహ తప్పి పడిపోవడం...! గబగబా లేచి హాల్లో బల్ల దగ్గరికి వెళ్ళింది. అక్కడొక కవరూ, పక్కనే ఉత్తరం పడున్నాయి! గబుక్కున తీసింది విప్పింది

అది .. అది... తనను చూసి వెళ్ళిన వారి దగ్గర్నించి వచ్చిన ఉత్తరం!

పెళ్ళికొడుకు తండ్రి రాసింది—

'ఇది చదివేనా నాన్న స్పృహ తప్పి పడిపోయింది?'

"ఇందులో ఏముంది?"

గుండెలు కొట్టుకున్నాయి!

రాగద్వేషాలు

చెమటలు పట్టాయి— పళ్ళంతా !

ఛీ, ఛీ ఇదేమిటి? తనకీ భయమెందుకు? అనుకుంటూ— ఉత్తరం చదవడం మొదలు పెట్టింది !

"ప్రియ మిత్రులు హనుమంతరావుగారికి నమస్కారములు—

ఉభయ కుశలోపరి.

మీ అమ్మాయిని చూసి వెళ్ళాక లగ్నాలు నిర్ణయించి రాస్తానన్నాను. మీ అమ్మాయి మాకు అన్నివిధాలా నచ్చింది. మీరు సహృదయులు. నేను రాసింది వివరంగా చదివి అర్థం చేసుకుంటా రనుకుంటాను.

మీకు ఏవిధంగా రాయాలో తెలియడం లేదు. అయినా ఈ సందేహం తీర్చుకుంటే గానీ మాకూ మనశ్శాంతి వుండదు.

అసలు సంగతేమిటంటే— పిల్ల తల్లి— అన్య కులస్త్రాలని ఎవరో అన్నారు. ఈ విషయంలో—

మీరు 'కాదు' అని రాసేస్తే ఇంక మీ అమ్మాయిని చేసుకోడానికి మాకే అభ్యంతరమూ వుండదు.

మీరు అన్యథా భావించరని తలుస్తాను. అంత తొందరగా మనం చాదస్తాలని వదులుకోలేం కదండీ? తప్పయితే క్షంతవ్యుణ్ణి. వుంటాము. మీ జవాబు కోసం ఎదురుచూస్తూ—

భవదీయుడు.
విశ్వనాథం."

ఆ ఉత్తరం చదవంగానే ఇందిర మొహం కందిపోయింది.

చాలా కోపం వచ్చిందామెకి !

కానీ ఇందులో తప్పెవరిది? తమదే !

అయితే తన తండ్రికి ప్రాణం మీదికి తెచ్చింది ఈ ఉత్తరమన్న మాట !

అవును నిజమే. తన తండ్రి అప్పుడే తన పెళ్ళి గురించి ఆశాసౌధాలు కట్టేసుకున్నారు. తన పెళ్ళి జరిగిపోయినట్టే రంగుల కలలు కన్నారు చాలా ఏర్పాటు చేసేశారు. పదిమందికీ చెప్పేశారు. ఈ సమయంలో ఈ ఉత్తరం ఆయనకి పిడుగుపాటు లాగా తగిలింది— అశనిపాతం అయింది ! అందులో ఆశ్చర్యం లేదు. ఆయనంత 'షాక్' తినడంలో ఏమాత్రం ఆశ్చర్యం లేదు.

మనిషి తానూహించింది జరగకపోతే నిరాశ పడతాడు. అనుకోనిది జరిగితే తట్టుకోలేకపోతాడు. ఇట్లాగే ఆలోచిస్తూ వుండిపోయింది ఇందిర చాలాసేపు. అంతలో ఆరోజు ఉత్తరాలు తెచ్చిచ్చాడు నౌకరు. అందులో ఇంకో చిత్రమైన ఉత్తరం బయట పడింది !

ఈ సారిది పెళ్ళికొడుకు రాశాడు. అసలు విప్పకుండా చింపేద్దామనుకుంది ఇందిర. మళ్ళీ మరోక్షణం ఆలోచించి, ఆ ఉత్తరం విప్పింది కళ్ళు అక్షరాల బారుల వెంబడి పరుగెత్తాయి.

"శ్రీ హనుమంతరావుగారికి నమస్కారములు—

నేను మీ అమ్మాయి ఇందిరని చూసి వెళ్ళిన పెళ్ళికొడుకుని. నా పేరు శ్రీకర్. నేను నిర్మొహమాటంగా రాస్తున్నాను. మీ అమ్మాయి ఇందిర నాకు నచ్చింది. నేను పెళ్ళి చేసుకుంటే మీ అమ్మాయినే చేసుకోవాలని నిర్ణయించుకున్నాను.

మా నాన్నగారి ఉత్తరం మీకు అందే వుంటుందనుకుంటాను. అది మిమ్మల్ని బాధ పెడితే క్షమించండి. ఆయన రాసిన

పైవారమే: సైన్సు వరదాలు!

కులాలు, మతాలు, అంటే నాకు నమ్మకం లేదు. దేవుడు అందర్నీ ఒక్కలాగే సృష్టించాడు. అందరిలోనూ ప్రవహించేది రక్తమే. దాని రంగు ఎఱుపే !

ఇంకా ఈ కాలంలో కూడా కులాలు, మతాలు అంటూ ప్రాకులాడడం తెలివి తక్కువ. మా నాన్నగారితో ఈ విషయమే వాదిస్తున్నాను. నేను కృతకృత్యుణ్ణవుతాననే అనుకుంటాను. నాకు ఎవర్నీ, ఏవిధంగానూ నొప్పించడం ఇష్టం వుండదు. మా నాన్నగారికి కూడా నచ్చచెప్పి, ఒప్పించి, ఆయన అంగీకారంతోనే ఇందిరని పెళ్ళి చేసుకుందామని నా కోరిక. దానికి కొంత టైము పట్టొచ్చు.

మీరు నన్ను అర్థం చేసుకుని, నాకు కొంత వ్యవధి నిమ్మని అడుగుతున్నాను.

ఇంకొక చిన్న సలహా. మీరు వీరయ్యగారి లాంటి వాళ్ళని చేరనియ్యొద్దు. వాళ్ళు ప్రమాదకరమైన మనుషులు. మానాన్నగారి దగ్గిర కులాల— మతాల ప్రసక్తి తెచ్చింది ఆయనే !

నన్నూ— నా చొరవనీ అర్థం చేసుకుంటారని ఆశిస్తాను.

ఉంటాను.
నమస్సులతో
శ్రీకర్."

అది చదివాక తండ్రికి చూపించాలా— వద్దా— అన్న ఆలోచనలో పడి పోయింది ఇందిర— మళ్ళీ !

"అమ్మా— ఇందు తల్లీ !"

అంతలో తండ్రి పిలుపు వినిపించింది.

అప్రయత్నంగానే చేత్తో వుత్తరంతో బాటే తండ్రి దగ్గరికి వెళ్ళింది ఇందిర.

"చదివావా తల్లీ ఉత్తరం?" వాత్సల్యంతో అడిగారు.

తండ్రి పక్కనే కూచుంటూ—"చదివాను నాన్నా ! ఇదిగో ఇంకో వుత్తరం వచ్చింది— ఇవాళ—" అంటూ తండ్రి చేతి కిచ్చింది ఆ వుత్తరం.

బాధగా చూశారాయన.

"ఇది... ఇది... ఆ అబ్బాయి రాశాడు నాన్నా!" అంది ఇందిర.

ఆ ఉత్తరం చదివారు. ఏమీ మాట్లాడ లేదు. మౌనంగా వుండి పోయారు.

ఆయన మనసులో మాత్రం ఎన్నో ఆలోచనలు !

అయిష్టంతో ప్రారంభమయిన సంబంధం కొడుకు ప్రోద్బలం మీద వాళ్ళు ఒక వేళ అంగీకరించినా ఇందిరని ఎప్పుడయినా ఒక మాట అనకుండా వుంటారా? ఇందిర తల్లి తన ప్రాణ సమానంగా ప్రేమించిన తన గీతని— తన పరోక్షంలో నయినా చులకన చేయకుండా వుండగలరా? అదంతా తల్చుకుంటే తన కిప్పుడే చాలా బాధగా వుంది.

అయినా తన కెందుకీ దౌర్బల్యం? తెలుగు వాళ్ళకే— తన కులం వాళ్ళకే ఇవ్వాలని తాపత్రయం దేనికి?

ఏమో... తనకే అర్థం గాకుండావుంది! తను తలుచుకుంటే తన తోటి వ్యాపారస్థుల పిల్లలు,తన ఫ్రెండ్స్ పిల్లలు— ఈ కలకత్తాలోనే చాలామంది వున్నారు. ఇందిరని ఇష్టమంటే చాలు మహద్భాగ్యంగా చేసుకుంటారు.

కానీ... తనీ దౌర్బల్యాన్ని జయించలేక పోతున్నాడు— ఎందుకో? ఆలోచిస్తూనే నిద్ర పోయా రాయన ! (ఇంకా వుంది)

వారఫలం

11-8-1978 శుక్రవారం మొదలు

17-8-1978 గురువారం వరకు

మేషం :— మీ ప్రయత్నాలకు ఆటంకాలువస్తాయి. ఆందోళన కలుగుతుంది. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. వారం ఆఖరులో వృత్తి వ్యాపారాలు బాగుంటాయి. విద్యా వైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. స్త్రీలకు-కుటుంబ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. సంతోష కరమైన సమాచారం అందగలదు.

వృషభం :— భాగస్వాములతో కలిసి చేసే వ్యాపారాలు బాగుంటాయి మీ ఆలోచనలు ఫలిస్తాయి. రావలసిన డబ్బు అందుతుంది. వారం ఆఖరులో అనవసరమైన వ్యయం చేస్తారు. చేజిక్కిన అవకాశాలు కూడా జారిపోవచ్చును. స్త్రీలకు-ఆరోగ్యం బాగుండదు. బంధుమిత్రులను కలుసుకొంటారు.

మిధునం:— అనవసరమైన సందేహాలు కలుగుతాయి. వృత్తిలో సాటివారి పోటీ పెరుగుతుంది. ఆడంబరం కోసం వ్యయం చేస్తారు. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి. స్త్రీలకు-కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. దైవకార్యాలు నెరవేరతాయి.

కర్కాటకం:— వృత్తిలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. మిత్రుల సహాయం లభిస్తుంది. సాహసిక వ్యవహారాలు బాగుంటాయి. రాజకీయ వ్యవహారాల్లో చికాకులు యేర్పడతాయి. ఇతరుల నిమిత్తం శ్రమ పొందవలసి వస్తుంది. స్త్రీలకు-ఆరోగ్యం బాగుంటుంది. సాటివారితో వాద ప్రతివాదాలు తగవు.

సింహం:— మీ మంచి తనమే మీకు యిబ్బందిని కలిగించగలదు. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి మిత్రుల సహాయం లభించగలదు. స్త్రీలకు-పుణ్యకార్యాలు చేస్తారు సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

కన్య:— అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. సజ్జన సాంగత్యం లభిస్తుంది. మిత్రులకు సహాయం చేస్తారు ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు ప్రయాణాలు వాయిదా పడతాయి. స్త్రీలకు-ఆరోగ్యం బాగుంటుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు

తుల:— మీ శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. రావలసిన డబ్బు అందుతుంది. వృత్తిలో సాటివారి పోటీ తగ్గుతుంది సాహసిక వ్యవహారాలు లాభించగలవు. స్త్రీలకు-సాహిత్యకళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. సంతోషకరమైన వార్తలను వింటారు.

వృశ్చికం:— వృత్తి వ్యాపారాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. బంధుమిత్రులను కలుసుకొంటారు ప్రయోజనంగల సంభాషణలను జరుపగలరు. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. స్త్రీలకు-ఆరోగ్యం బాగుంటుంది. శుభకార్యాల విషయంలో అభివృద్ధిని సాధిస్తారు.


ధనుస్సు: లాభం రావలసిన వ్యవహారాల్లోనే నష్టం రావచ్చును. వృత్తిలో శ్రమ కలుగుతుంది. వ్యతిరేకమైన వార్తలను వింటారు. వారం ఆఖరులో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. వ్యాపారంలో నూతనావకాశాలు లభిస్తాయి. స్త్రీలకు-కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది బంధుమిత్రులను కలుసుకొంటారు.

మకరం:— వ్యాపారంలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. మిత్రుల సహాయం లభిస్తుంది. సాహసిక వ్యవహారాలు బాగుంటాయి వారం ఆఖరులో వ్యతిరేకమైన వార్తలను వింటారు. మీ తాలూకు వస్తువులు పోవచ్చును. స్త్రీలకు-ఆరోగ్యం బాగుండదు. నూతన విషయాలను తెలుసుకొంటారు.

కుంభం: అన్ని వ్యవహారాల్లోను గౌరవం బాగుంటుంది. సజ్జన సాంగత్యం లభిస్తుంది. ప్రయోజనంగల పరిచయాలు యేర్పడతాయి. రావలసిన డబ్బు అందుతుంది. విద్యావైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. స్త్రీలకు-దైవ కార్యాలు నెరవేరతాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు

మీనం:— మీ కార్యక్రమాలు బాగుంటాయి. వ్యాపారంలో ఆదాయం పెరుగుతుంది. సాటివారిలో గౌరవం లభిస్తుంది. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కలుసుకొంటారు. స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. స్త్రీలకు-ఆరోగ్యం బాగుంటుంది. బంధువులకు సహాయంచేస్తారు

— మహేష్



సీరియల్

మోహనరూప

మాదిరెడ్డి సులోచన

ఆమె డాక్టరు అతనిలాంటివారిని ఎందరినో ముట్టుకుని పరీక్షచేసి వుండవచ్చు. అతను మాత్రం ఆమె స్పర్శను ఒక మధురానుభూతిగా పదిలంగా హృదయంలో దాచుకున్నాడు. మనసు ఆధీనం తప్పినట్టయింది. ఒకసారి అందంగా విచ్చుకునే ఆమె పెదవులు, మరోసారి ఆలుచిప్పల్లా వున్న కళ్ళు, ఇంకోసారి అజంతా చిత్రాలను గుర్తుకుతెచ్చే తనూలతను తలుచుకుని, అశాంతిగా దొర్లుతున్నాడు. 'ఛీ ! ఒక్కపూట జ్వరం వస్తే మనసు యింతగా పాడయిపోవాలా !'

స్నేహితుని కాబోయే భార్యపట్ల తన ఊహలు పవిత్రంగా వుండాలి త్వరగా ఉద్యోగం రావాలి. దూరం వెళ్ళిపోవాలి.

'ఇందాకే ఈ ఊరు వేయించమని అడిగావ్ !' మనసు నిలదీసింది. జవాబు చెప్పలేకపోయాడు. మెల్లగా లేచి, మందుల గదిలోకి వెళ్ళాడు. ఒకసారి తలెత్తి చూచి, మళ్ళీ తల దించుకున్నాడు కాంపౌండర్. కాంపోజ్ మాత్రలు రెండు తెచ్చుకుని మింగి పడుకున్నాడు.

రూప పని అయ్యాక ఇంటికి వెడుతూ వచ్చింది. ఇంద్రమోహన్ గాఢ నిదురలో వున్నాడు. తలుపులు చేరవేసింది.

"వాచ్‌మెన్ ! ఒక్కసారిలా వస్తావా !"

అతను పరిగెత్తుకువచ్చాడు.

"గేటు వేసి, యిక్కడ కూర్చో. అయ్యగారు లేవగానే ఏం కావాలో ఇవ్వు జ్వరం తగ్గకపోతే వచ్చి చెప్పు."

(గత సంచిక తరువాయి)

"మంచిదమ్మా."

ఆమెకు యింటికి వచ్చినా, ఆలోచనలన్నీ ఇంద్రమోహన్ చుట్టే తిరుగుతున్నాయి. సన్నిహితంగా మెలగడం మూలానా ! అంతకంటే సన్నిహితంగా ఎందరో క్లాసుమేట్స్ వచ్చారు. మామూలుగా మెలిగింది. ఆదికాక విశ్వంతో పెళ్ళి ప్రస్తావన వచ్చిననాడు కూడా మామూలుగానే వుంది. తన జీవితంలో భాగం పంచుకునే వ్యక్తి విశ్వం. అతను ఎందుకు తన తలపులనిండా నిండిపోలేదూ ?

"అమ్మా ! భోజనం చేయరా !" వంటామె పిలిచింది.

"చేస్తాను మోహన్‌గారికి జావ పాలు తీసుకువెళ్ళాలి."

"అదేమిటమ్మా అన్నం పంపాను.'

"ఆయన అన్నం తినే స్థితిలో వున్నారా ? జ్వరం..." అన్నది బట్టలు మార్చుకుంటూ

అతని నవ్వులో ఆకర్షణ వుంది మాటల్లో నమ్రత, గారడి చేస్తుంది మనసుల్ని.

అతని ప్రవర్తన అందరికి ఆమోదంగా వుంటుంది. ఒక్కనాడు కూడా నర్సులు, కాంపౌండర్లు, పనివారు అతనిపై నిందలు మోపలేదు. నిష్ఠూరాలు వెయ్యలేదు. ఎంత సహనం, యెంత శాంతం !

"ఇప్పుడు చెయ్యమంటూరా అమ్మా ?"

"మీకు చాతనయితే చెయ్యండి. లేకపోతే నేను చేసి పంపుతాను" అన్నది లేచి వంటింట్లోకి వెడుతూ

"అమ్మా ! మీరు చేసుకున్నాక నేను వుండి దేనికమ్మా." ఆవిడ నిముషంలో జావ కాచింది. పాలు కూడా కాచింది. ఆమెకు వడ్డించి, అవి తీసుకుని వంటామె వెళ్ళిపోయింది. రూపాదేవి సంధిగ్దావస్థలో పడింది. తన చదువు పూర్తికాగానే విశ్వం గురించి వాళ్ళు చెప్పారు. తను అంగీకరించింది. అప్పుడు తన మనసులో ఎవ్వరూ లేరు. ఇప్పుడీ ఇంద్రమోహన్ చేరి తన మనశ్శాంతి కరువు చేశాడు.

తను కాదంటే బలవంతం చేసేటంత సంకుచితులా తనవారు ! కాదనటానికిదేం పిల్లలాటా ! ఒక్కసారి అందర్నీ తలొక్క మాటన్నా, తరువాత తను సుఖపడగలదు. ఇంద్రమోహన్ అభిప్రాయం ఎలా వుందో ! సావిత్రిని చేసుకుంటానని అంటున్నాడు. అలాంటి అతని గుణాలే తనకు చేరువ చేస్తున్నాయి.

ఆమె ప్రక్కపై వాలి నిదురబోయింది. సాయంత్రం కాస్త త్వరగా తయారయింది.

"అయ్యగారు జ్వరం దిగిందనే చెప్పారమ్మా. అన్నం తింటానంటే వద్దని జావ యిచ్చాను." వంటామె చెప్పింది.

ఆమె తయారయి వెళ్ళేసరికి శుభ్రంగా అన్నం పెట్టుకుని తింటున్నాడు ఇంద్రమోహన్.

"జ్వరం తగ్గిందా ?"

"భోజనం మానేస్తే తగ్గుతుందా ! అసలు మీకు తెలుసో లేదో, రోగులు బలహీనంగా వుంటారు బలమైన ఆహారం పెట్టాలి" అన్నాడు సాంబారు పోసుకుని.

"జ్వరంలో వుండగా జీర్ణకోశము సరిగ్గా పని చేయదని తెలియదా !"

"అబ్బా వచ్చి కూర్చోండి" వేళ్ళకున్న సాంబారు నాకేస్తూ

"బాగుంది వరస..." నేను మందివ్వనని చెప్పాలనుకున్నా, వెంటనే అభిప్రాయం మార్చుకుని అతని ముందున్న కంచము లాగేసింది.

"ఇది అన్యాయం..." అన్నాడు.

"మాట్లాడక చెయ్యి కడుక్కోండి" అన్నది కోపంగా.

జరిగిన కథ — 7: స్నేహితులు విశ్వం, ఇంద్రమోహన్, పాషా, స్యామ్సన్, చక్రిలు విహార యాత్ర ముగించుకొని హైదరాబాద్ చేరినపుడు ఇంద్రమోహన్ ఐ. డి. పి. ఎల్‌లో ఇంటర్వ్యూకి వెళ్ళగా; మిగిలిన స్నేహితులు, అక్క సుగుణ, బావలతో కలిసి ఒక సంబంధం చూస్తాడు విశ్వం. ఆమె శ్రీహరి, రుక్మిణిల ఏకైక కుమార్తె డాక్టర్ రూప. ఆమె ఆహ్వానంమీద ధనికుడైన విశ్వం బీదవాడైన ఇంద్రమోహన్‌తో నర్సింగ్‌హోమ్ చూడటానికి సాగర్ వెళ్తాడు కానుకలన్నా కోరలేదన్న కారణంగా తనకు, తన చెల్లెలు పూర్ణకు కుండమార్పిడి సంబంధం విఫలమవడం, ఉద్యోగ ప్రయత్నంలో మోసగింపబడడంవల్ల ఇంద్రమోహన్ నిరాశా నిస్పృహలకు లోనవుతాడు. రూప తండ్రి విదేశాలకు వెళ్ళిన సమయంలో ఇంటి వ్యవహారాలు చూసే ఉద్యోగం చేస్తూ ఆమె నడవడి కనిపెట్టటానికి ఇంద్రమోహన్‌ను పంపుతాడు విశ్వం. రూప దూరపు బంధువైన శోభన్, ఇంద్రమోహన్‌లతో చనువుగా ఉండటాన్ని క్లినిక్ ప్రారంభోత్సవానికి వచ్చిన విశ్వం గమనిస్తాడు. దురలవాట్లకు లోనయిన విశ్వం ప్రవర్తనను గురించి రూప, ఇంద్రమోహన్‌ని ప్రశ్నిస్తుంది. ఇంద్రమోహన్‌కు తప్పిపోయిన సంబంధం తాలూకు అమ్మాయి, సావిత్రి, అబార్షన్ చేయించుకొనే నిమిత్తమై రూప నర్సింగ్‌హోమ్‌లో చేరుతుంది.

''అదికాదండీ మీ మందులున్నాయే కడుపులో తిప్పుతున్నాయి'' అన్నాడు.

''ఉహుం! దేనితో గరిటతోనా, స్పూన్‌తోనా!''

''మీకు వేళాకోళంగా వుందన్నమాట.''

''మీరు ఇంకొక్కమాట మాట్లాడినా, ఆస్పత్రిలో చేర్చి, నర్సును దగ్గర వుంచాలి'' అన్నది.

''అంత పని మాత్రం చేయకండి ...'' అన్నాడు, టవల్ తీసి అచ్ఛాదనంలేని భుజాలపై కప్పుకుంటూ.

ఆమె జ్వరం చూచింది. నాలుక చూచింది

''మీరు నిజంగా చదువుకున్నారా !''

''అబద్ధంగా ఎవరయినా చదువుకుంటారా ! అనుమానం అయితే నా సబ్జెక్ట్‌లో ప్రశ్నలు వెయ్యండి.''

''నూరు పైన జ్వరం వుంటే ఎక్కడయినా, గుత్తివంకాయకూర, సాంబారుతో భోజనము చేస్తారా ?''

''ఆకలండీ...'' అన్నాడు. ఆమె మరోసారి హెచ్చరించి క్లినిక్‌కు వెళ్లిపోయింది. రాత్రి ఎనిమిదివరకు పనే సరిపోయింది. పని తీర్చుకుని వచ్చేసరికి, ఒళ్లెరగని జ్వరంతో, స్పృహ లేనట్టున్నాడు. బాత్‌రూమ్‌లో వాంతులు చేసినట్టున్నాడు. అక్కడ ఆయాను పిలిచింది. అంతా శుభ్రం చేయించింది. శోభన్ కూడా కంగారుపడ్డాడు.

''ఫ్లూ అయివుంటుంది'' అన్నాడు.

మందులిస్తూ యిద్దరూ పదిన్నర వరకు కూర్చున్నారు.

''నువ్వు వెళ్లిపో శోభన్'' అన్నది. అతనిప్పుడు వేరుగా వుంటున్నాడు.

''రాత్రి డ్యూటీలో వున్న నర్స్‌కు అప్పగిస్తే !''

''మరి కాసేపు వుండి అదే పని చేస్తాను'' అన్నది. అతను వెళ్లిపోయాడు.

''అమ్మా ... అబ్బా...'' కాళ్ళు ముడుచుకుంటు దొర్లాడు. మెల్లగా, చేతులతో ఒత్తింది. వాచ్‌మెన్ వచ్చాడు.

''మీరు జరగండమ్మా ... నేను పడతాను. నేను అనుకుంటూనే వున్నాను. గడియారంతోపాటు తిరుగుతాడు'' అతను వచ్చి కాళ్లు పట్టాడు.

పదకొండు గంటలకు రెండు డిగ్రీలు దిగింది కాని, పూర్తిగా తగ్గలేదు.

'' నేను చూచుకుంటాను వెళ్లండమ్మా '' అన్నాక వచ్చేసింది. ఎందుకో ఆమె మనసులో నుండి విశ్వం బొమ్మ తొలగిపోయింది. ఇంద్ర మోహన్ నిలిచిపోయాడు.

మూడు రోజులయినా జ్వరం తగ్గలేదు. రక్త పరీక్షచేసి, టైఫాయిడ్ అని గ్రహించారు

''మీ వాళ్లకు ఉత్తరం వ్రాస్తాను ఇంద్ర మోహన్‌గారూ!'' అతనికి జ్వరం తగ్గినప్పుడు అడిగింది.

''నేను వెడతానండీ ! మా తమ్ముడికి పరీక్ష సమయము. అమ్మ వస్తే పూర్ణను ఆడిస్తాడు.''

''మీరు వెడతాననగానే పంపిస్తానా ఏం ? వైద్య సదుపాయం ఉంటుందా ! మీ చెల్లెల్ని పిలిపిస్తాను.''

''మీ ఇష్టం...'' అన్నాడు. ఆమె వెంటనే వాచ్‌మెన్‌ను పంపింది. కంగారు పడవద్దని ఉత్తరం కూడా వ్రాసింది.

''మీరెంత సేవచేశారో వాచ్‌మెన్ చెప్పాడు మీ రుణం తీర్చుకోలేనిది'' అన్నాడు కళ్ళు వాల్చి.

''ఇదిగో ఆ మాటే అనొద్దు. నాన్నగారుత్తరం వ్రాశాడు. మీ పనితనం గురించి తాతయ్య వ్రాశాక, మీలాంటి కొడుకు లేని లోపం ఆయన ఇప్పుడు ఫీలవుతున్నారట'' అన్నది అయిన్‌బ్యాగ్ తలమీద పెట్టి.

''దత్తత చేసుకొమ్మనండి. ఆస్తి, పాస్తులలో



భాగం వద్దుగాని, వారి అమృత హృదయంలో చోటిస్తే చాలు...''

''అబ్బా ఆశ...'' అన్నది. అతని సాన్నిధ్యం కోరుతుంది మనసు. ఏం చేయాలో తోచలేదు పడకమీదుండే పనులు చేయిస్తాడు

తెల్లవారేసరికి అందరూ వచ్చారు తల్లిఅయితే ఒకటే కంటితడి పెట్టుకోవటం.

''మనుష్యులన్నాక రోగాలే రావా అమ్మా! మిషిన్లు కూడా చెడిపోతాయి'' అన్నాడు

''నా తండ్రీ! నువ్వు మిషన్ కంటే గట్టి వాడవురా...''

''వెధవ మాటలు నువ్వూనూ! నీ దిష్టే కొట్టింది వాడికి''. కసిరాడు రామలింగం

అతనికి తన చుట్టూ ఉన్న ఆత్మీయులను చూస్తుంటే యెంతో తృప్తిగా ఉంది

''నాన్నరూ! మీరు వెళ్లి సుబ్బారాయుడితో మాట్లాడండి.''

గదిలోకి రాబోయిన రూపాదేవి చటుక్కున వెళ్ళిపోయింది అమె మనసు ఎందుకో ఇంద్రమోహన్ వివాహాన్ని అంగీకరించలేకపోతుంది.

ఇంద్రమోహన్ బలవంతంపై పూర్ణను వదిలి, మిగిలినవారు వెళ్ళిపోయారు. ఏడవరోజు జ్వరం పూర్తిగా తగ్గింది అతను మెల్లగా లేచి కన్సల్టింగ్ రూమ్‌లోకి వెళ్ళాడు. రూప ముందున్న బల్లమీద చేతులు పెట్టి, ముఖం దాచుకుని కూర్చుంది.

'డాక్టర్‌గారూ!'' అతను పిలిచాడు.

''ఓ.. మీరా! ఏమిటిలా వచ్చారు! నాకు కాస్త పని లెక్కువయి రాలేదు. రండి కూర్చోండి..''

ఇంద్రమోహన్ కూర్చున్నాడు.

''రేపయినా అన్నం తినొచ్చా!''

''మరీ చిన్నకుర్రాడిలా చేస్తున్నారు. మరోరోజులు చూచి జ్వరం రాకపోతే అన్నం పెడతాం...''

''అబ్బా...'' వికారంగా ముఖం పెట్టాడు

''మీరిప్పుడే తిరగవద్దు, పదండి..'' ఇద్దరూ గదికి వచ్చారు. శోభన్ కూర్చుని వున్నాడు. ఒకమూల పూర్ణ ఒదిగి నిల్చుంది

''మీరు అప్పుడే షికారు కెళ్లారా!'' వెనుక రూప రావటం చూచి లేచాడు. అయిదారు నిమిషాలు కూర్చుని వెళ్లిపోయింది. ఆమెకు తెలుసు అతనితో అనుబంధం, ఆత్మీయత పెంచుకోవటం మంచిదికాదని.

15

ఇంద్రమోహన్ ఇంటికి వచ్చి రూపాదేవికోసం చూస్తూ వరండాలో కూర్చున్నాడు అతను వేదాంతిలా నవ్వుకున్నాడు. మారిపోతున్న చిత్రమైన పరిస్థితులు చూస్తుంటే మతి పోతుంది తనంత మూర్ఖుడు! స్త్రీలకు అవమానాలు జరిగితే కడివెడు కన్నీరు కార్చి, బుట్టెడు సానుభూతి సంపాదించి బ్రతుకగలరు కాని, తప్పటడుగు వేసినవారికి చేయూత నిస్తామంటే చులకన అయిపోతారు. గర్భం అని తెలియగానే తనకంటగట్టాలని చూశారు సావిత్రిని. ఇప్పుడేం అవసరము! వాళ్లివ్వనన్నందుకు బాధ పడలేదు. ''మాతోటివారి దగ్గర గుమాస్తాగిరి చేస్తున్న వాడికి పిల్లనిస్తానా'' అన్నాడట. మతిలేని వాడు! మదమెక్కినవాడు దాంతో తండ్రి భయపడి 'బ్రతికి ఉంటే పరువుగా బలుసాకయినా తినవచ్చు, వచ్చేసెయ్యమని' రాశాడు పూర్ణను తన్నాలి. ఏం చెప్పిందో ఏమో. వాళ్లన్నారని కాదురా! రాత్రింబవళ్లు ఆ అరవ చాకిరి నీకెందుకు!' తండ్రికి కాసింత ఎతి ఉందను కున్నాను అదీ లేదు

''ఏమండోయ్..' గట్టిగా అరుపు వినిపించే సరికి ఉలిక్కిపడి చూచాడు.

''అమ్మయ్య! సమాధిలోనే ఉన్నారనుకున్నాను తెలివి వచ్చిందన్నమాట'' అన్నది నవ్వుతూ రూపాదేవి.

'సమాధి...చచ్చినాక కడతారు. నేను బ్రతికే ఉన్నాను...'' అన్నాడు కంగారుగా.

''ఏమిటండి బాబూ అంత దీర్ఘ ఆలోచన'' అతని యెదురుగా కూర్చుంది నిజంగానే సమాధి లోకి వెళ్లినంత నిశబ్దంగా ఆమెను చూచి కళ్లు దించుకున్నాడు. కళ్లు చెదరగొట్టే అందం. అతి మామూలు, నెమిలి పింఛం రంగు నేత చీర ఆమెకు యెంతగా నప్పిందో.

''ఇంద్రమోహన్ గారూ! నిదుర మాత్ర మింగారా!''

''ఆఁ...ఒక్కటి మింగితే ఏం లాభం! ఒక ఇరవయ్యో ముప్పయ్యో ఇవ్వండి''

''అంత కష్టం ఏమొచ్చిందండీ బాబూ!''

''శ్రీ... శ్రీ... సుబ్బారాయుడు ద గ్రేట్ పరువు ప్రతిష్టలు గల పెద్ద మనిషి, ఈ చిన్న మనిషి...'' తన ఛాతిపై కొట్టుకున్నాడు అతను

''ఊఁ చిన్నమనిషి అంటే మీరా! . ఆఁ తరువాత...''

''ఈ చిన్న మనిషిచేసే చిన్న ఉద్యోగాన్ని నిర సించి, తన అనుంగు పుత్రిక సావిత్రిని ఇవ్వనుగాక, ఇవ్వను పొమ్మని, మా నాన్నగార్కి ఉత్తరం వ్రాశారట. మా నాన్నగారు బాధపడి, బరువెక్కిన హృదయంతో, మన పరువు నడిబజారునకు ఎక్కనివ్వకురా అంటూ వ్రాశారు.''

''తమరు అర్జంటుగా పెద్ద ఉద్యోగంలో చేరిపొండి'' అన్నది నవ్వుతూ

''పెద్ద ఉద్యోగం ఏం కర్మ! పిలిచి ఇస్తే మంత్రిని అవుదామని కూడా వున్నది'' అన్నాడు విసురుగా.

''అంత చికాకు ఎందుకు? ఏది జరిగినా మన మంచికేగా!''

''అంతోటి అందకత్తె దొరకదని కాదండీ! నా ఆశయాలకు అపజయం రెండవసారి. అదికాక మా చెల్లెలు సమస్య అలాగే వుండిపోయింది.''

''అన్ని సమస్యలూ పరిష్కారం అయ్యే సమయం ఆసన్నమయింది ఇంద్రమోహన్‌గారూ! ఆదివారం ఉదయం నాన్న వస్తున్నారు.''

''నిజమా!'' అన్నాడు సంతోషంగా అప్పడే సగం బాధ్యత తీరినట్లు.

''అవును. అదేరోజు సాయంత్రం శోభన్‌కు ఫేర్‌వెల్ పార్టీ...'' అన్నది.

''ఇక మాకు పార్టీలే, పార్టీలన్నమాట ఎంగేజ్‌మెంటు పార్టీ, మారేజ్ పార్టీ! ఆ తరువాత లాలీ లాలీ పార్టీ...'' చేతులతో చూపాడు

అతని జోక్‌కు రెస్పాన్స్ రాలేదు ఆమె గంభీరంగా వుండిపోయింది

''అదేమిటండీ బాబూ! అంత నిస్సారంగా వున్నారు! ఎదురుచూచిన అమృత ఘడియలు ఎదురువస్తే...'' అన్నాడు

''మీకా, మీ స్నేహితుడికా ఉత్సాహం!''

''మీకు లేదా! తెలిసిందండోయ్! మగాడు బయటపడతాడు. మీరేమో గుట్టుగా దాచుకుంటారు''

''రిసర్చిచేసి పెద్ద నిజం కనిపెట్టారుగాని, ఆదివారం సాయంత్రం పార్టీ ఏర్పాట్లన్నీ మీరే చూచుకోవాలి. నేను నాన్నగారిని రిసీవ్ చేసుకుంటాను''

''దారిలో విశ్వాన్ని పిక్‌అప్ చేసుకుంటారు అవునా!''

''మీకు విశ్వం తప్ప మరో ధ్యాస లేన ట్టుంది'' చికాకుగా చూచిందామె

ఆమె ఆంతర్యం ఏమిటో ఇంద్రమోహన్‌కు అర్థంకాలేదు అతనికి ఏమేమి చేయాలో, ఎంతమంది వస్తున్నారో వివరించింది.

''నాన్నగారు ఏర్‌పోర్ట్‌లో దిగగానే మొదటి దండ నేను వేయాలనుకున్నాను అవకాశం లేకుండా చేస్తున్నారు. పాపం తగులుతుంది..'' అన్నాడు కుర్రాడిలా మూతి బిగించి.

''ఇక్కడ ఆస్పత్రిలో అడుగు పెట్టినప్పుడు వేద్దురుగాని మునిగిపోయిందేం ఉంది!''

''ఓ యస్! ఈ రోజే ఆర్డర్ చేస్తాను నిలువెత్తు దండ. ఇంతవరకు యెవ్వరూ వేసి ఉండరు. అలాగే, మీకు ఒకటి వేస్తాను...''

''గుడ్! స్వయంవరమా!'' అన్నది కవ్వింపుగా నవ్వుతూ.

''ఉహూఁ! నాకు డాక్టరంటే భగవంతుడని అందరు అంటారే ఆ భగవంతునితో సమానం స్వంత సుఖాలను వదిలి సమయా సమయాలు ఆలోచించక ఇతరుల కోసం బ్రతికేవారంటే ఆరాధన...''

''అమ్మమ్మ చాలులెండి'' అడ్డు పెట్టింది. అప్పుడే ఒక వ్యక్తి పరుగెత్తుకుంటూ వచ్చాడు.

''అమ్మగారూ! అర్జంటుగా రావాలి లాల్ బహద్దర్ కెనాల్ దగ్గర ఒకామె అవస్థపడు తుంది...''

''ఏమయింది?'' అతను చమట్లు కక్కుతూ సైకిల్‌పై వచ్చాడు

''వందనను పంపుతారా, ఇంద్రమోహన్ గారూ!''

''అలాగే...''అని ఒక్కక్షణం ఆలోచించాడు

''లాభం లేదండి. నాకు డ్రయివింగ్ రాదు వందనగార్కి రాదు. మేం నడుస్తూ వెళ్లేసరికి, ఆ పేషెంటు కాస్త...''

''గోవిందా, అవనివ్వం లెండి పదండి

అతనివెంట బయలుదేరి వెళ్లింది. అక్కడ యెవరూ లేరు. ఇంద్రమోహన్ దిగి ఎంక్వైయిరి చేశాడు.

"యెవరో సిటీకి వెళ్లుతూ లిఫ్ట్ ఇచ్చా రండీ" అని చెప్పాడో టూరిస్ట్. అతనొచ్చి ఆ విషయం రూపాదేవికి చెప్పాడు

"ఓ...సరే వచ్చాం. కాసేపు తిరుగుదాం పదండీ." దిగి కార్ లాక్ చేసింది.

అక్కడ చిన్న ఉపవనము, దానిలో లాల్ బహద్దూర్‌శాస్త్రిగారి స్టాచ్యూ ఏన్గు బొమ్మ ఉన్నాయి. అది దాటి ముందుకు వెళ్లారు. నీరు కాళ్ళలో దుమికినట్టు పడుతుంది. పరధ్యానగా ఒక్క అడుగు ముందుకు వేసింది ఇంద్రమోహన్ జబ్బపట్టి వెనక్కు లాగాడు.


"ఇంతమంది టూరిస్ట్‌లు తిరిగే స్థలం ఇంత అజాగ్రత్తగా వదిలివేస్తారా?" అన్నాడు కోపంగా. అప్పుడు చూచింది. ఒకదగ్గర పైకి బారుగా పెట్టిన దువ్వలు లేవు. నిజమే తను ఇంకొక్క అడుగు వేస్తే ... ఒళ్ళు జలదరించింది. అప్పటికే అతను పట్టుకున్నాడు

"థాంక్స్!" అన్నది స్పృహలోకి వచ్చినట్టు.

"నో మెన్షన్!" అని తన ముఖం ఆమె

వేలి తయారీ కాగితం

[మా పాఠకుడు శ్రీ సదానందంగారు యిటీవ్లో చేతో తయారు చేసిన కాగితం పైన యీ ఉత్తరం రాశారు. దాన్ని అలాగే యిక్కడ ఫొటో తీసి వేస్తున్నాము. —సం.]


27-6-78
గౌరవనీయులైన ఎడిటర్ గారికి నమస్కారములు.
[illegible]
ఇట్లు
పి. సదానందరెడ్డి

చూడరాదని దూరంగా వెళ్ళాడు అంత నిరాడంబరంగా, నిర్మలంగా వుండే మనిషితో కపటంగా ప్రవర్తించటం అన్యాయం అని అతని హృదయం ఘోష పెట్టింది. అందుకే తను ఏ ఉద్దేశంతో వచ్చాడో చెప్పాలని నిశ్చయించుకున్నాడు. ఆ విశ్వంమీద ఎలా పని చేస్తుందో! విశ్వం విషయమై ఆమె ఏమనుకుంటుందో!

"ఏమిటండీ ఎప్పుడూ పరధ్యానగా వుంటున్నారు?" అతని భుజంపై చేయి పడింది.

శరీరం అంతా విద్యుత్‌ఘాతం తగిలినట్టు కంపించసాగింది. అతను ఆశ్చర్యంగా చూచాడు. ఆమె ఇంత చొరవ చనువు తీసుకుంటుందేం?

"ప్రొఫెసరుగా తయారయ్యారు."

మృదువుగా ఆమె చెయ్యి తీసివేశాడు.

"రూపాదేవి! అక్కడ గార్డెన్‌లో కాసేపు కూర్చుందాం. మీతో చాలా ముఖ్యమయిన విషయాలు చెప్పాలి. కాని నా పరిస్థితులను అర్థం చేసుకోండిగాని, 'అసహ్యించుకోకండి" అన్నాడు ముందుకు నడుస్తూ.

"నాకు మీతో చర్చించాల్సిన విషయాలు చాలా వున్నాయి, కాని ఇద్దరం మన విషయాలు సోమవారం వరకు వాయిదావేద్దాం. ఆదివారం నాన్నగారు వచ్చారంటే నాకు రోగుల బాధ్యత తప్ప మరేం వుండదు."

"అయిదు నిమిషాల్లో అయిపోతుంది..."

"ఉహుం! మనము వెంటనే వెళ్లాలి" అన్నది ఇద్దరూ బయలుదేరారు కార్లో.

"శోభన్ స్థలంలో వచ్చే డాక్టరు తప్పక సోమవారం వస్తాడుకదా!"

"మీకా సందేహం ఎందుకు కల్గింది? తప్పక వస్తాడు" అన్నాడు.

"సోమవారం నుండి, రోజు ఒక గంట కారు నడపటం నేర్చుకోండి" అన్నది రోడ్డు వంక చూస్తూ.

"నా పెళ్లికావటం మీకిష్టం లేదా! అబ్బాయి డ్రయివరు అన్నా అనగలరు" అన్నాడు తమాషాగా.

"అవేమి అనకుండా, మిమ్మల్ని వరించి, వివాహమాడే అమ్మాయినే చూస్తాను లెండి" అన్నది ప్రసన్నంగా అతను ఏం అనలేదు. ఏదో అర్థం చేసుకోవటానికి ప్రయత్నించాడు. సోమవారం నాడు తేలిక పడిన గుండెతో తిరగవచ్చు అనుకున్నాడు, తన అరచేతులు చూచుకుంటూ.

16

లక్ష్మినర్సింగ్ హోమ్ ఆవరణ కలకలలాడుతూ, తోరణాలతో, రంగు, రంగు కాగితాలతో అందంగా అలంకరింపబడి ఉంది. మేడకు కట్టిన చిన్న చిన్న బల్బులు మిణుకు, మిణుకు మంటున్నాయి. ఆవరణలో బల్లలు అమర్చి, తెల్లని దుప్పట్లు పరిచి, పూలకుండీలు, తళతళలాడే ప్లేట్లు పెట్టారు.

"తప్పదియ్యా! నా షష్టిపూర్తి మహోత్సవానికి నువ్వుంటే ఇంత ఘనంగా చేసేవాడివి. ఇంద్రయ్యా! మా రూప వివాహం కూడా నీ చేతుల మీదుగా జరుగాలి" అన్నాడు తాతయ్య.

"అంతకంటే సంతోషకరమైన విషయమేముంటుంది?"

ఇంద్రమోహన్ గేటుకు కట్టిన పూలకొమ్మలు సరిచేశాడు. గేట్లో అంబాసిడర్ కారు వచ్చి ఆగింది. వెనుక సీట్లోనుండి శ్రీహరి, రుక్మిణి దిగారు. ముందునుండి విశ్వం దిగాడు. అతను ముఖం మాడ్చుకుని గంభీరంగా ఉన్నాడు ఇంద్రమోహన్ చిరునవ్వుకు జవాబు చెప్పలేదు.

"నమస్తే సార్!" అతను నిలువెత్తు గులాబీల మాల శ్రీహరి మెడలో వేశాడు. కాస్త చిన్న మాలను అతని చేతికిచ్చి రుక్మిణిగారికి వెయ్యమని అన్నాడు

"ఏమిటోయ్! మళ్లీ వివాహం నాటి ముచ్చట్లు గుర్తుకు వచ్చేలా చేస్తున్నావ్" అని, ఇంద్రమోహన్ భుజం తట్టి తాతయ్యకు నమస్కరించాడు.

"హరీ!" ఆయన కళ్ళు నీటితో నిండగా కొడుకును లేపి హృదయానికి హత్తుకున్నాడు

"ఊం. ఒరేయ్ విస్సీ! ఇటురా..." ఉత్సాహంగా ఖరోదండ తెచ్చి విశ్వంకు ఇవ్వబోయాడు రూప చటుక్కున అందుకుని తన మెడలో వేసుకుంది.

శోభన్ చప్పట్లు కొట్టగానే, అందరూ అనుసరించారు. ఆయన పరమార్శించారు. అందంగా అలంకరించిన వేదిక దగ్గరకు తీసుకు వెళ్లాడు. వేదికపైకి, తాతయ్యను, శ్రీహరి దంపతులను, రూపను ఆహ్వానించారు, వందన

ఇంద్రమోహన్ ఆహుతులంతా ఉపాహారాల బల్లల దగ్గర కూర్చున్నాక, స్వాగతం చెప్పాడు.

"ఈనాడు ఇక్కడికి విచ్చేసిన పెద్దలకు, ఆత్మీయులకు, స్నేహితులకు హితులకు బంధువులకు, 'లక్ష్మి నర్సింగ్‌హోమ్ అండ్ క్లినిక్' తరపున స్వాగతం చెబుతున్నాను. దానికి దాతలు, నేతలు అయిన తాతయ్యగారిని మీకు పరిచయం చేయటం సాహసమే అవుతుంది. ఈ నర్సింగ్ హోమ్ కుమారి రూపాదేవి నేతృత్వంలో, శ్రీ శ్రీహరిగారి ఆధ్వర్యంలో నడుస్తుంది వారు వృత్తిరీత్యా ఇంజనీరు అయినా వారమ్మాయికోసం, ప్రతి చిన్నదానికి, హైద్రాబాద్ పోవటం కుదరనివారికోసం ఈ నర్సింగ్‌హోమ్ ప్రారంభించారు. విదేశాలలో పరిశ్రమలు పరిశీలించటానికి శ్రీ శ్రీహరిగారు సతీసమేతులయి వెళ్లి వచ్చారు ఆ సందర్భంగా ఈ చిన్న తేనీటి విందు ఏర్పాటు చేశాం

'లక్ష్మి నర్సింగ్‌హోమ్' అనుబంధంగా నడిచే ఎక్స్‌రే డిపార్ట్‌మెంటూ, ఇ ఎన్ టి. డిపార్ట్‌మెంటు ప్రారంభం కావస్తున్నాయి. రూపాదేవి క్లినిక్ చూసుకుంటున్నారు కాన్పులు వగైరాలు, కుమారి వందన చూచుకున్నారు. కొన్నిసార్లు బయటికి వెళ్లి రోగులను చూడవలసి వచ్చేది. అలాంటప్పుడు రూపాదేవికి సహాయంగా శోభన్‌గారు వెళ్లేవారు డాక్టర్ శోభన్, ఉత్సాహవంతులయిన యువకులు పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చెయ్యాలని హైద్రాబాద్ వెడుతున్నాడు. అతనికి వీడ్కోలు చెబుతూ అతనికి మంచి

మో హ న రూ ప

...విష్యత్తు వుండాలని కోరుతూ మీరందరూ, ...లహారం ప్రారంభించాలని కోరుతున్నాను.''

ఇంద్రమోహన్ వేదిక దిగాడు.

''నర్సింగ్‌హోమ్ కట్టడం నిర్విఘ్నంగా ...రిగిందంటే దానికి కారణం ఇంద్రమోహన్'' అని శ్రీహరి ప్రశంసించాడు.

''ఇంద్రయ్య నిజంగా సమర్థుడయిన కుర్రాడు'' తాతయ్య ఆశీస్సులు అందచేశాడు.

''అర్ధరాత్రి, అపరాత్రి అనక తనకు చేయూత నిచ్చి, తండ్రిలేడన్న భావం రానియ్యకుండా నర్సింగ్ హోమ్ నడపటంలో ఇంద్రమోహన్ శోభన్ ప్రముఖ పాత్రలు వహించారని'' రూపాదేవి చెప్పింది.

[ఇంకా వుంది]

జి. వి. జి. పేజీ



'వయసు పిలిచింది'లో కమల్, శ్రీప్రియ

ప్రాణం ఖరీదు

బంగారి తల వంచుకొని అడుగులో అడుగు వేసుకుంటూ, మంచంమీద బిక్కుబిక్కుమంటూ కూర్చొనున్న పెద్దోడు దగ్గరికి వచ్చింది.

"బంగారీ! ఎప్పుడూ నవ్వుతూ తుళ్ళుతూ, ముద్దబంతిపువ్వులా మసిలేదానివి – నువ్విలా నవ్వు తుళ్ళు లేకుండా వుంటే, పేట పేటంతా సిన్నబోయినట్టుందే!" అన్నాడు పెద్దోడు.

"గాలీ, నీరూ వుంటే నేకదట్రా – ముద్దబంతిపువ్వు నవ్వేదీ, తుళ్ళేదీనీ?" అంది బంగారి.

"గాలీ నీరూ లేకుండా ఎవడు సెయ్యగలడే? ఈ బెంగంతా – నర్సిగాడు ఊరొదిలి వెళ్ళిపోయాడనేగా? రోజూ ఒకసారి అయినా నీ ఇంటికొచ్చి, నిన్ను సూసుకొని, నీ సేత్తో ఒక గలాసుడు మంచీల్లు తాక్కుండా పొలం ఎల్లేవోడుకాదు. ఎప్పుడో ఒకప్పుడు పలిపిడుగులా వత్తాడు. నిన్ను సందిట్లోకి తీసుకుంటాడు."

"నిజంగా వత్తాడంటావా?"

"రాపోతే – నే లేనేటీ?" అన్న పెద్దోడు, బంగారి తలెత్తి కోపంగా చూసేసరికి "ఈ భూమ్మీద ఎక్కడున్నా ఎతికి తీసుకొస్తానే... దేకుతూ పాకుతూ అయినా తీసుకువత్తా. నా మాటినవే. ఇంకెప్పుడూ నవ్వుతూవుండాలె. ఏదీ – ఒక్కసారి నవ్వు! నవ్వాలిమరి...సూసావా– ఎంత ఎలుగొచ్చిందో!" అన్నాడు.

కె. వాసు దర్శకత్వంలో క్రాంతికుమార్ నిర్మించే శ్రీ అన్నపూర్ణా సినీ ఎంటర్‌ప్రైసెస్ "ప్రాణం ఖరీదు" చిత్రంలో సత్యనారాయణ (పెద్దోడు), నూతన నటి రేష్మ (బంగారి)తో పాటు జయసుధ, చంద్రమోహన్, రావుగోపాలరావు, చలం, వరప్రసాద్, రమాప్రభ, కొత్త నటుడు చిరంజీవి నటిస్తున్నారు. సి. ఎస్. రావు, చక్రవర్తి, లోకనాథ్, హేమచందర్, అంకిరెడ్డి– రచన, సంగీతం, ఛాయ, శిల్పం, కూర్పు నిర్వహిస్తున్నారు.

రామబాణం

"రామబాణం ఎదురు లేనిది. తిరుగులేనిది. 'నా మాట రామబాణం. న్యాయం నా ఆరో ప్రాణం' అని నీతికీ నిజాయితీకి ప్రతినిధి అయిన మా చిత్రంలోని హీరో నినాదం. అందుకే ఆ పేరు పెట్టాను" అని తెలియజేశారు కౌముదీ పిక్చర్స్ అధినేత ఎం. ఎస్. రెడ్డి. జూలై 10 న మల్లెమాల రాసిన పాటలు రికార్డు చేయబడ్డాయి. సత్యం సంగీత దర్శకుడు. జూలై 30 న షూటింగ్ ప్రారంభం. శోభన్‌బాబు, జయప్రద, కృష్ణంరాజు, లత, జగ్గయ్య, జమున, రంగనాథ్, సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి, మోహన్‌బాబు, నాగేష్, జయమాలిని నటవర్గం. భీశెట్టి, జయంపు కృష్ణ సృష్టించిన కథకు మల్లెమాల చిత్రానువాదం, సంభాషణలు, గీతాలు పొందుపరచారు. పి. ఎస్. ప్రకాష్ ఛాయ, బి. చలం శిల్పం, మార్తాండ్ కూర్పు, జి. కృష్ణమూర్తి– బి. జి. నాయుడు నిర్వహణ గల ఈ వర్ణచిత్రానికి సి. ఎస్. రెడ్డి సహదర్శకుడు, ఈశ్వరరెడ్డి దర్శకుడు.





'శ్రీరామ రక్ష'లో ఒక దృశ్యం

సింహాగర్జన

శివవర్మ (కృష్ణ) "ధైర్యం! ఏమిటే వంట సామాన్లన్నీ?" అని ప్రశ్నించాడు.

"ఇప్పుడు రాకుమారి వస్తుందికదా? నీతో యుద్ధం చేస్తుందికదా? అందులో ఎవరో ఒకరు ఓడిపోక తప్పదుకదా? ఆ ఓడిపోయినవాళ్ళు — గెలిచి అలిసిపోయినవారికి వంట వండిపెట్టాలి కదా?" అన్నాడు చెలికాడు ధైర్యం (కె. వి. చలం).

"అదికాదురా. రాకుమారి చేతిలో సరదాకు ఓడిపోయి — ఆమెను సంతోషపరుద్దామనుకున్నానే!" అని శివవర్మ అంటూండగా రాకుమారి (లత) గుర్రానికి రకరకాల కత్తులు తగిలించుకొని వస్తూ, "ఈరోజు నిన్ను నా బందీగా చేసి వెంట తీస్కెళ్తాను చూస్కో!" అంది.

"సుకుమారమైన నీ చేతుల్లో బందీని కావాలనే కోరుకుంటున్నాను రాకుమారీ! రా!"

"నేను పిలుస్తున్నది బలాబలాలు తేల్చుకోడానికి."

"నేను పిలుస్తున్నది బాహువుల్లో చేర్చుకోడానికి."

"చేతిలో కత్తిలేని వాడితో నేను యుద్ధం చేయను."

"ఓ ఆడపిల్లతో మగాడు యుద్ధం చేయడానికి కత్తి వుండాలా? గుండె వుంటే చాలుకదా?"

"ఇంక నిన్ను క్షమించను. కత్తి అందుకోకపోతే నీ ఖర్మ!" అంటూ రాకుమారి కత్తి తిప్పుతూ శివవర్మ మీది కొచ్చింది. శివవర్మ తమాషాగా తప్పుకుంటూ, "పూలగుత్తులు పుచ్చుకోవాల్సిన చేతులు — కరకు కత్తులు పుచ్చుకోకూడదు రాకుమారీ!" అన్నాడు.

ధైర్యం ఉషారుగా "కత్తి బాగా ఝళిపించండి, రాకుమారీ! ఓడిపోయారంటే — వంట చెయ్యాల్సివస్తుంది. దెబ్బకు అన్న అబ్బా అనాలి," అన్నాడు.


రాకుమారి ఆయాసమొస్తున్నా — కత్తి తిప్పుతూనేవుంది. శివవర్మ దొరక్కుండా "మల్లెమొగ్గకు ఆవేశమూ అందమే. ఆయాసమూ అందమే. గుండెలు ఎగిరెగిరిపడుతున్నాయి — గుచ్చుకుంటాయేమో జాగ్రత్త!" అని వేళాకోళం చేస్తూనేవున్నాడు. చివరికి రాకుమారి అలిసిపోయి, కూలబడింది.

"మూడనేసరికి కత్తి పుచ్చుకోకపోతే — కత్తిపీట పుచ్చుకోవాలి ... ఒకటీ ... రెండూ ... మూడు ... ఓడిపోయినట్లే! ఇక వంటే గతి!" అన్నాడు ధైర్యం గెంతుతూ.

"నేను చెయ్యను. నాకు చేతకాదు," అంది రాకుమారి రొప్పుతూ.

"చెయ్యవూ?" అంటూ కత్తి తీసి ఝళిపించాడు శివవర్మ. రాకుమారి అదిరిపడి, పక్కకు పరుగెత్తి, "చేస్తాను. చెయ్యక చస్తానా?" అంటూ వంట సామానులున్నచోట సణుక్కుంటూ కూర్చుంది. పొగకు కళ్ళు మండగా — వంట చేయలేక ఆమె నానా అవస్థ పడుతూంటే, విజయోత్సాహంతో ఠీవిగా చూస్తూ నిలుచుండిపోయాడు శివవర్మ.

గిరిబాబు కథ, సమర్పణలో, కొమ్మినేని శేషగిరిరావు దర్శకత్వంలో, మాగంటి వెంకటేశ్వర రావు, యర్రా శేషగిరిరావు సినిమా స్కోప్‌లో నిర్మించే "సింహగర్జన" వర్ణ చిత్రంలో సంగీత, గుమ్మడి, కాంతారావు, మోహన్‌బాబు, శరత్‌బాబు, కొంగర జగ్గారావు, సి. హెచ్ కృష్ణమూర్తి, రాజారెడ్డి, జయమాలిని, అంజలీదేవి తక్కిన తారాగణం. జంధ్యాల మాటలు, చక్రవర్తి సంగీతం, దేవరాజ్ ఛాయ, కందస్వామి కూర్పు, రంగారావు శిల్పం తెర వెనుక హంగులు.



'కుమార రాజా'లో ఒక దృశ్యం



'సింహబలుడు'లో ఒక దృశ్యం

తుఫాన్ మెయిల్

తను ఎత్తుగడలకు అడుగడుగునా అడ్డు పడుతున్న తుఫాన్ మెయిల్ వివరాలు తెలుసుకోవడం కోసం ఆమెతో పరిచయం ఉన్న శాంత, రాధ, సరోజలను పట్టుకొని, తుఫాన్ మెయిల్ వివరాలు చెప్పమని హింసించడం ప్రారంభించారు భుజంగం ముఠా. ఇంతలో బాల్కనీ మీద రివాల్వర్ పేలిన చప్పుడుతోపాటు ''ఆ ప్రశ్నకు సమాధానం నేను చెప్తాను'', అన్న గంభీర కంఠం వినిపించి, అందరూ అటు చూశారు.

''ఓ... తుఫాన్ మెయిల్!'' అన్నాడు భుజంగం.

''అవును; నువ్వు సృష్టించిన నకిలీ తుఫాన్ మెయిల్ కాదు. మీ అందరి పిరికి గుండెల్లో పిడుగులు కురిపించడానికి వచ్చిన అసలు తుఫాన్ మెయిల్'' అంది రివాల్వర్ పొగ ఊదుతూ.

పద్మవ్యూహంలోకి అభిమన్యుడిలా చొచ్చుకు వచ్చిన ఆమె ధైర్యానికి ఒక్క క్షణం విస్తుపోయి, ''వెరీ గుడ్! ఎప్పటికైనా నువ్విక్కడికి వస్తావని నాకు తెలుసు'' అన్నాడు భుజంగం.

''ఏనాటికైనా నేను రావలసిన చోటు ఇదేనని నాకూ తెలుసు'' అంటూ ఒక్క జంప్‌లో బాల్కనీ మీంచి – వారి మధ్యగా ఉన్న వెస్టర్ రాడ్ మీదకు చేరుకుంది తుఫాన్ మెయిల్.

''చచ్చేందుకే వచ్చావు!''

''కాదు; చంపేందుకు!''

''సింహం గుహలోకి అడుగు పెట్టికూడా ఇంత ధైర్యంగా మాట్లాడుతున్న నీ సాహసాన్ని మెచ్చుకుంటున్నాను!''

''నీ మెప్పు ఎవరికీ అక్కర్లేదు. ముందు ఈ ముప్పు తప్పించుకో!'' అంటూ కొరడా ఝుళిపించింది తుఫాన్ మెయిల్.

అమాంతంగా భుజంగం ముఠా ఆమెమీద పడింది. హంటర్ గాలిలోకి లేస్తోంది. ఒక్కొక్కరి వీపూ తాషామరబ్బా మోగుతోంది...

న్యాయానికి, అన్యాయానికి జరిగే ఇలాంటి సంకుల సమరంలో విజయం న్యాయానిదే కదా?

కె. ఎస్. రెడ్డి దర్శకత్వంలో కె. ప్రకాష్ నిర్మించే సురేఖా ఆర్ట్ పిక్చర్స్ క్రైమ్ థ్రిల్లర్ ''తుఫాన్ మెయిల్'' వర్ణచిత్రంలో నటవర్గం: మంజుల, ప్రభాకరరెడ్డి, విజయలలిత, నరసింహరాజు, గిరిబాబు, శరత్‌బాబు, హరిబాబు, సత్యేంద్ర కుమార్, కె. వి. చలం, మాడా, భీమేశ్వరరావు, శ్యామ్, పి. ఆర్. వరలక్ష్మి. సాంకేతిక వర్గం: కృష్ణమోహన్, సత్యం, దేవరాజ్, బి. ఎస్. కృష్ణ, కందస్వామి.

'జగన్మోహిని'లో ఒక దృశ్యం





'మనవూరి పాండవులు'లో గీత

స్వర్గసీమ

లలిత కళలంటే ఎక్కువ మక్కువ పడి, ఆ కళకే తన జీవితాన్ని అంకితం చేసుకోవాలనుకున్న జయంతి పెళ్ళయి అత్తవారింటికి వచ్చినా తన నృత్యం ప్రాక్టీస్ మాత్రం మానలేదు.

''ఈ ఇంటి కోడలు మేడ మీదెక్కి తైతక్కలాడుతూ ఉంటే — అలా చూడు — ఊరు ఊరంతా చూసి ఎలా నవ్వుతున్నారో! పెళ్ళయి చాలాకాలమైనా, పిల్లా పాపా సంసారమని లేకుండా ఇలా నాట్యాలు సంగీతాలలో గడుపుతూంటే ఎలా?'' అని విసుక్కుంది అత్త రాజమ్మ.

''పిల్లా పాపలకేం అత్తయ్యగారూ! తలుచుకుంటే పుడతారు. కాని, కళ అనేది తపస్సు చేసినా రాదు. నా జీవితం కళకేగాని కాన్పులకు అంకితం కాదు,'' అంది జయంతి నిర్భయంగా.

''అవునమ్మా, చిన్న మేడమ్ త్వరలోనే ప్రపంచమంతా ప్రదర్శన లివ్వబోతున్నారు'' అన్నాడు కుటుంబం లోపెం కొన్నూ.

''ఏమిటి! ప్రదర్శనలా! అవ్వా — ఎంత సిగ్గుచేటు! ఏరా, ఇదేం సంసారుల కొంపా — మరేమనుకున్నావ్?'' అని తన కొడుకు రమేష్‌ని నిలదీసింది రాజమ్మ.

''ఏదీ కాదు; ముళ్ళకంప...హాయిగా బస్తీలో ఉండేదాన్ని తీసుకొచ్చి ఈ పల్లెకొంపలో పడేశారు... ఖర్మ—ఖర్మ...''అంటూ విసుగ్గా వెళ్ళిపోయింది జయంతి.

''అటు చూస్తే పెళ్ళాం, ఇటు చూస్తే తల్లి!''

ఇద్దరిమధ్య ఇరుకున పడ్డ రమేష్‌కి ఏం తోస్తుంది?

పి. చంద్రశేఖరరెడ్డి దర్శకత్వంలో పి. కొండారెడ్డి నిర్మించిన శ్రీ దేవీ ఆర్ట్ కంబైన్స్ ''స్వర్గసీమ'' విడుదలకు సిద్ధంగా వుంది. తెర ముందు: శ్రీధర్, మంజుల, ప్రభ, నరసింహరాజు, అల్లు రామలింగయ్య, సాక్షి రంగారావు, కె. వి. చలం, గిరిజ, రాధికా కిరణ్, పద్మాంజలి, పండరీబాయి, బేబీ రాణి, బేబీ వరలక్ష్మి, బేబీ పద్మజ. తెర వెనుక: అప్పలాచార్య, మహదేవన్, లక్ష్మణ్‌గోరే, నాయని మహేశ్వరరావు, మోహన్‌జీ—జగన్, పి. రంగా, మన్నె రాధాకృష్ణ, డి. బలరామరెడ్డి, ఎన్. పరంధామరెడ్డి బి.యే., బి.ఎల్.



'రాధాకృష్ణ'లో జయప్రద, శోభన్‌బాబు

* జి. వి. జి. పేజీ *

జగన్మోహిని

''ఈ సీన్‌లో నీకు సగంవరకే డైలాగ్ లుంటాయి. ఆ తర్వాత వుండవు,'' అన్నారు విఠలాచార్య.

''అవునవును. నేను రెడీ, సార్!'' అంది ప్రభ.

గౌరి వేషంలో ప్రభ, మోహిని వేషంలో జయమాలిని వున్నారు. డైరెక్టర్ ఆదేశంతో కెమెరాలోని ఫిలిమ్‌కు చలనం కలిగింది.

మోహిని: ఇక నీవు నీ రాజాను మరిచిపో. నీకేం కావాలన్నా యిస్తాను. నగలు, నాణేలు, మణులు, సౌధాలు — ఏవైనా సరే, అడుగు.

గౌరి: అవన్నీ పతి సాన్నిధ్యానికన్నా ఎక్కువైనవామ్మా? దయచేసి నా భర్తను నాకివ్వు.

మోహిని: వీల్లేదు. రాజాను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టను. నీ పిచ్చి ఊహలు, పూజలు మానుకోవాలి.

గౌరి: మోహినీ! నా తల్లి భ్రమరాంబ నా వ్రతం పూర్తయిన వెంటనే నన్ననుగ్రహిస్తుంది. నా భర్తను నాకు ప్రసాదిస్తుంది.

మోహిని: అలాగేం? (అంటూ ఆగ్రహంతో చెయ్యి ఆడించేసరికి గౌరి వృద్ధురాలైపోయింది. మోహిని కిలకిలా నవ్వింది).

గౌరి: ఎంతపని చేశావు మోహినీ! ఇంత లేత వయసులోనే నన్ను పండు ముసలిదాన్ని చేయడానికి నీకు మనసెలా వచ్చింది? నీ కోరికలు తీర్చుకోడానికి తొలి రాత్రే నా భర్తను నానుంచి దూరం చేశావ్! కల్యాణమైకూడా కన్నెగా బ్రతుకుతున్న నన్నిలా హింసించడం నీకు న్యాయం కాదు, మోహినీ! నీ క్షుద్రశక్తితో నా రూపాన్ని చెడగొట్టగలవుగాని — నా వ్రతాన్ని చెడగొట్టలేవు. నా పూజలు మన్నించి ఆ భ్రమరాంబ తల్లి నా భర్తను నాకు యివ్వకపోదు. నా యధారూపం నాకు రాకపోదు.

మోహిని: స్తోత్రం చేస్తూ, వ్రతం చెయ్యడానికి — అసలు నీకు నోరుండనిస్తేగదా? (అంటూ తిరిగి కోపంగా చెయ్యి ఆడించేసరికి గౌరి మూగదానిగా మారిపోయింది.)

షాట్ అనుకున్నవిధంగా వచ్చినందుకు దర్శక నిర్మాత బి. విఠలాచార్య సంతృప్తిగా మందహాసం చేస్తూ, ''మా జగన్మోహిని చిత్రాన్ని ఆగస్ట్‌లో విడుదల చేయాలనుకుంటున్నాం,'' అన్నారు.

సంక్షిప్త చిత్ర వార్తలు

★ యువ చిత్రవారి ''సీతామాలక్ష్మి'' చిత్రం హైదరాబాద్, కాకినాడలో 125 రోజులు; విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్నం, తిరుపతి కేంద్రాలలో వంద రోజులు విజయవంతంగా ప్రదర్శింపబడిన సందర్భాన్ని పురస్కరించుకొని జూన్ 1న మద్రాసు 'హోటల్ చోళా'లో ఉత్సవం జరిపారు.


★ రమణ రచన, బాపు దర్శకత్వంలో జయకృష్ణ నిర్మాతగా కృష్ణంరాజు సమర్పించే ''మన వూరి పాండవులు'' వర్ణచిత్రం జూన్ 29 ఉదయాన రాజమండ్రికి సమీపానగల గుమ్మళ్ళదొడ్డి కొండపైని శ్రీ లక్ష్మీనారాయణ — కోదండ రామాలయంలో ప్రారంభమైంది.

★ దాదాపు పదహారేళ్ళక్రితం ''బావమరదలు'' చిత్రం అనంతరం ''శ్రీదేవి, రామయతండ్రి'' చిత్రాలకు కథ సమకూర్చిన పద్మనాభరావు కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో కృష్ణ చిత్ర నిర్మించే ''ప్రియబాంధవి'' వర్ణచిత్రానికి జూన్ 30న పాటల రికార్డింగ్‌తో ప్రారంభోత్సవం జరిగింది. రంగనాథ్, రాజబాబు, ధూళిపాళ, ముక్కామల, పండరీబాయిలతోపాటు నాయికగా ఓ కొత్త నటి పాల్గొనే ఈ చిత్రానికి పెండ్యాల సంగీత దర్శకుడు. సమర్పణ: మండపురి శ్రీకలంకట్ల. పూర్తిగా శ్రీశైలం ప్రాంతంలోనే షూటింగ్ జరుగుతుంది.

★ సి. గౌరీశ్వరి నిర్మాతగా విజయనిర్మల దర్శకత్వంలో నటుడు నాగభూషణం సమర్పించే శ్రీ గౌరీశ్వరీ ఆర్ట్స్ ''ప్రేమ చేసిన పెళ్ళి'' షూటింగ్ జూన్ 27న పూర్తయింది.

★ ''ఖైదీ నెంబర్ 77'' అనంతరం హనుమాన్‌ప్రసాద్ దర్శకత్వంలో పరుచూరి విరచిత ''కలియుగ మహాభారతం'' నాటకాన్ని నిర్మాత జి. సత్యనారాయణ తెరకెక్కిస్తున్నారు. నరసింహరాజు, వంకాయల సత్యనారాయణ, పి. ఎల్. నారాయణ, నూతన్‌ప్రసాద్, ఎం. రంగారావు, మాధవి, జయమాలిని తారాగణం. జూలై 25 నుంచి రామచంద్రపురం, మండపేట ప్రాంతాలలో షూటింగ్ ప్రారంభం.

★ వి. మధుసూదనరావు దర్శకత్వంలో తయారౌతూన్న శాంతిశ్రీ పిక్చర్స్ వర్ణచిత్రానికి ''అంగడి బొమ్మ'' అని పేరు పెట్టారు. ★



'శభాష్ గోపీ'లో బేబీ మంజుల, మురళీమోహన్

సినిమా విశేషాలు

దాసరిక మరో విజయం

విజయ చిత్రాల దర్శకుడు, వెరైటీ చిత్రాల దర్శకుడు, వాల్యుబుల్ దర్శకుడు అని శ్రీ దాసరిని అంటే ఎవరికీ అభ్యంతరం వుండదనుకుంటాను. ఎందుకంటే నేను వ్రాసింది నిజం అని వారి దర్శకత్వంలో విడుదలైన ఎన్నో చిత్రాలు నిరూపించాయి శ్రీ దాసరికి "శివరంజని" మరొక విజయం అవుతుందని నమ్మేవారిలో నేనుకూడా ఒకడ్ని ఆ చిత్రంలో నటిస్తున్న ఇద్దరు క్రొత్త వాళ్ళకు ఆ చిత్రం చక్కటి భవిష్యత్తునిస్తుందని విశ్వసించేవారిలో కూడా నేను ఒకడ్ని. అంత నమ్మకం నాకెలా కల్గిందని మీరడగొచ్చు అందుకే ఈ క్రింది సమాధానం.

"శివరంజని" ఇదొక రాగం అని చాలామందికి తెల్సే వుంటుంది. ఇలాంటి చక్కటి రాగం ఒక చిత్రం పేరు కావడం ఆహ్లాదకరం అవుతుందని నా నమ్మకం "శివరంజని" చిత్రం ఒక సినిమా నటి జీవితానికి సంబంధించిన కథ గావడం మరొక ఆకర్షణ అనుకోవడం అసమంజసం కాదనుకుంటాను ఆద్యంతం ఆసక్తికరంగా నడుస్తుంది "శివరంజని" కథ. అడుగడుగునా ఆత్రుతను కల్గిస్తుంది "శివరంజని" వినూత్న పాత్రలో జయసుధ నటించడం, చిత్రంలో క్రొత్తగా నటిస్తున్న సుభాషిణి (జయసుధ చెల్లెలు), హరిప్రసాద్ ప్రశంసనీయమైన నటనను ప్రశంసించడం నా నమ్మకాన్కి మరి రెండు గట్టి నిదర్శనాలు. "శివరంజని" చిత్రంలో మోహన్ బాబును వెరైటీ బాబుగా చూస్తాం

తారకప్రభు ఫిలింస్ బ్యానరుపై శ్రీ దాసరి నిర్మిస్తున్న స్వంత చిత్రం, "శివరంజని" షూటింగ్ "పెద్దాపురం, కాకినాడ, యానాం, రఘుదేవపల్లి, సామర్లకోట" మున్నగు చోట్ల పూర్తయింది. "శివరంజని" చిత్రానికి కథ, మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం బాధ్యతలను శ్రీ దాసరి నారాయణరావు, సంగీతాన్ని రమేష్ నాయుడు, కెమెరాను కె. యస్. మణి, కళను భాస్కరరాజు, నిర్వహణను కె. బసవయ్య, ప్రొడక్షన్ను బోసుబాబు నిర్వహించారు. సినిమా స్కోప్ వర్ణచిత్రంగా సింగారించుకుంటున్న ఈ చిత్రం ఆంధ్రలో లక్ష్మి ఫిలింస్ ద్వారా, నైజాంలో శ్రీ తారకరామా ద్వారా, సీడెడ్‌లో కిశోర్ మాధవీ పిక్చర్స్ ద్వారా విడుదలౌతుంది

చలానిక ప్రమోషన్

"అగ్రదర్శకుడు" శ్రీ దాసరి రూపొందించిన "శివరంజని" చిత్రం ... హాస్య నటుడు కె. వి చలానికి, బలమైన భవిష్యత్తుకు దారితీస్తుంది.

ఇన్నేళ్ళు ... పరిశ్రమలో వున్నా ... కె. వి. చలానికి సరయిన పాత్రను ఎవ్వరూ ఎందుకివ్వలేక పోయారో యిప్పుడు అర్థమైంద.

"ప్రజాదర్శకుడు" శ్రీ దాసరి యిచ్చే పాత్ర ద్వారా ... ఆయన ప్రతిష్ఠవంతంగా ప్రకాశించాలని వుంది.

"చిల్లెమ్మ"లో మాడాకు ఎంత ప్రఖ్యాతి లభించిందో, "శివరంజని"లో చలానికి అంత కీర్తి రాగలదని నమ్మవచ్చు.

మొత్తానికి "దాసరి" యిూజ్ గడుసరి.

జయచిత్ర నటిస్తున్న చిత్రాలు

విజయమాధవీ పిక్చర్స్ నిర్మిస్తున్న "కటకటాల రుద్రయ్య", శ్రీ గోపీనాథ్ రూపొందిస్తున్న "చెప్పింది చేస్తా", లక్ష్మి ఫిలిం కంబైన్స్ నిర్మిస్తున్న చిత్రం, సురేష్ ప్రొడక్షన్స్ నిర్మించనున్న చిత్రం, విజయలక్ష్మి మూవీస్ నిర్మిస్తున్న "రిక్షా రాజీ", "అల్లరి పిల్లలు", శివనాగజ్యోతి ఫిలింస్ ప్రారంభించనున్న చిత్రం తమిళంలో ఆరు చిత్రాలు, కన్నడంలో ఒక చిత్రాన్ని కుమారి జయచిత్ర నటిస్తున్నారు.

సంవత్సరానికి ఆరు మంచి చిత్రాలలో పని చేస్తే చాలు అనెడి నిర్ణయాన్ని, జయచిత్ర తీసుకోవడం ... ఆమె ఉజ్వల భవిష్యత్తుకు ఎంతో ఉపకరించగలదని ఈ కలం నమ్ముతూంది.

సత్యం శ్రీరామరక్ష

స్టిల్స్ తీయడంలోనేకాదు, సినిమా తీయడంలోనూ సిద్ధహస్తుడు శ్రీ సత్యం అనే నిజాన్ని వారి "శ్రీరామరక్ష" చిత్రం విడుదలయ్యాక మీరే అంటారు. టైటిల్ పెట్టడంలోనే తన స్టయిల్‌ను ప్రస్ఫుటపరచారు మన సత్యం వెరైటీ చూపించాలనేది సత్యంగారి తపన అయినప్పటికీ, ఆ వెరైటీలో క్వాలిటీ కన్పడాలనే వారి తృష్ణ. "శ్రీరామరక్ష" చిత్రం చూస్తున్నంతసేపు సత్యంగారి సమయస్ఫూర్తి గుర్తుకొస్తూనే వుంటుంది. చక్కటి అభిరుచిగల నిర్మాత శ్రీ సత్యం అని పెక్కురు ప్రశంసించే విధంగా తన "శ్రీరామరక్ష" చిత్రాన్ని నిర్మించారు అజయ్ ఆర్ట్ పిక్చర్స్ పతాకంక్రింద నిర్మింపబడిందీ చిత్రం.

శ్రీ అక్కినేని ద్విపాత్రాభినయం వింత మలుపులతో కూడి, క్రొత్తతరహాగా నడిచే "శ్రీరామరక్ష" వర్ణచిత్రంలో వాణిశ్రీ, జయసుధ కథానాయికలు.

శ్రీ తాతినేని రామారావుగారి దర్శకత్వం, శ్రీ ఆత్రేయ సంభాషణలు, శ్రీ టి చలపతిరావు సంగీతం, శ్రీ సెల్వరాజ్, శ్రీ రవికాంత్‌నగాయిచ్ ఛాయాగ్రహణం అస్సెట్స్‌గా గల ఈ రంగుల చిత్రం జూలైలో జరిగిన కొద్దిపాటి పాచ్‌వర్క్‌తో పూర్తయింది అతిత్వరలో విడుదల చెయ్యాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

'రామచిలక'లో



దేవర్ ఫిలింస్ రెండో చిత్రం

తమిళ దేశంలో నెంబర్ వన్ నిర్మాత అని పట్టం పుచ్చుకున్న శ్రీ శాండో చిన్నప్పదేవర్, తెలుగులో కూడా "అదృష్ట జాతకుడు" అని తొలి చిత్రమే నిరూపించింది.

తన మరి చిత్రాన్ని, సెప్టెంబర్ రెండున, శ్రీ దేవర్ ప్రారంభించడానికి నిర్ణయించారు.

"కుక్క ... అశ్వం" చేసే సాహసకృత్యాలకు ముఖ్యత్వం యిస్తూ, మురళీమోహన్...శ్రీప్రియ, మోహన్‌బాబుగార్లకు ప్రధాన పాత్ర లిచ్చి ఓ కొత్త తరహా చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు సమర్పిస్తున్నట్టు, శ్రీ దేవర్ తె పారు

శ్రీ త్యాగరాజన్ దర్శకత్వాన్ని, మహాదేవన్ సంగీతాన్ని, రామ్మూర్తి ఛాయాగ్రహణాన్ని నిర్వహించే యీ చిత్రం "ఊటీ"లో సెప్టెంబర్ రెండున ప్రారంభమై, అక్టోబర్ 12 కల్లా పూర్తవుతుందని తెలిసింది.

సురేష్ ప్రొడక్షన్స్‌కు గుహనాథన్ కథ

ప్రముఖ చిత్ర నిర్మాత శ్రీ డి. రామానాయుడు, తెలుగులో భారీయెత్తున నిర్మించనున్న చిత్రానికి, జులై మొదటివారంలో బలీయమైన కథ లభించింది. తమిళ రచయిత శ్రీ గుహనాథన్ వ్రాసిన "అన్నదమ్ముల గూర్చిన కథ" తనకు మనస్ఫూర్తిగా నచ్చినట్టు, సురేష్ అధినేత తెలిపారు.

అక్టోబరు నుంచి ప్రారంభించే వుద్దేశ్యం శ్రీ రామానాయుడుకు వున్నట్టు, అగ్రశ్రేణి తారాగణంతో నిర్మించడానికి నిర్ణయించినట్టు, ఆయన తెలిపారు

సెప్టెంబరులో హిందీ చిత్రం "దిల్ అవుర్ దీవార్" విడుదల కాగలదని, శ్రీ నాయుడు చెప్పారు.

— జనప్రియ ★

కొండలరావు, వాణిశ్రీ





'శివరంజని'లో జయసుధ

'చలిచీమలుగా' మారిన 'కొలువు' కథా రచయిత శ్రీ మంథాకి ప్రేరణ ఎవరు !

ఆంధ్ర సచిత్ర వార పత్రిక లోగడ (1975) నిర్వహించిన చిన్న నవలికల పోటీలో సాధారణ ప్రచురణకి ఎన్నికై, సీరియలుగా పడ్డ "కొలువు" మీదే "క్లాసు" పిక్చర్‌గా రూపొందిన 'చలిచీమలు' చిత్రం ఆధారపడింది.

ఈ చిత్రంలో సాంబయ్య పాత్ర చాలా కీలకమైంది. అసలు కొలువులో ఆ పాత్ర పేరు సింహాద్రి — దీనికి శ్రీ మంథాకి ప్రేరణ ఎలా వొచ్చిందో ఆ రచయిత మాటల్లోనే చెబితే యిలా వుంటుంది.

"చలిచీమలు" చిత్రం నా నవలిక "కొలువు" మీద ఆధారపడి తీసినది —

1975 ఆంధ్రపత్రిక వీక్లీ దీపావళి చిన్న సీరియల్ నవలల పోటీకి నవలిక రాయాలని బుద్ధిపుట్టి ఏ కథ తీసుకోడమా అని ఆలోచించగా, నా మనస్సులో 1972లో నా బావమరిది పెళ్లికి శ్రీకాకుళం జిల్లాలోని ఒక గ్రామానికి వెళ్లడం గుర్తుకొచ్చింది — ఆ గ్రామానికి చీపురుపల్లినించి వెళ్లడం, రావడం బండిమీదే — ఆ గ్రామంలో నేను వారం రోజులుండి గమనించిన విషయాలే "కొలువు"గా రూపొందించేను — ఇంక ఈ కథకి ఆయువుపట్టు రామన్న కొడుకు సింహాద్రి (సినిమాలో సాంబయ్య) — ఆ పాత్ర కొంతమట్టుకు నా చిన్నతనపు ప్రతిబింబమే — నా తండ్రిగారికి సబ్—కలెక్టర్‌ని చూడవల్సిన పని తగిలింది ఓసారి — నా కప్పుడు పదేళ్లు — నన్ను వెంటపెట్టుక వెళ్లేరు, తన పరిస్థితి వివరించి ఆ ఊరునించి మరో ఊరు జరిగిన బదిలీని నిలుపుజేయమని కోరడానికి — నన్ను అతడి కాళ్లకి నమస్కరించమన్నారు — నేను నమస్కారం పెట్టలేదు — ఇందులో రామన్న, సాంబయ్య ఆనాటి పాత్రల ప్రతీకలు.

"కొలువు" సీరియల్‌గా ఆంధ్ర సచిత్ర వార పత్రికలో ప్రచురించబడినప్పుడు చాలామందిని ఆకట్టుకుంది దీనిని చిత్రంగా ఎవరన్నా తీస్తే బాగుండునిపించింది నాకు ఈ కథని ఆంగ్లంలోకి తర్జుమా చేసి, శ్యాంబెనగల్ వైజాగ్‌లో మకాం పెట్టినప్పుడు అతడికి పంపేను — కాని ఇంతలో మిత్రుడు శ్రీ పరుచూరికి ఈ కథ మీద ఆసక్తి కలిగి కొందరు ఉత్సాహవంతులయిన నిర్మాతలకి ఈ కథని తీస్తే బాగుంటుందని సలహా ఇవ్వటం, వెంటనే ఈ కథని వారు ఎంచుకోడం జరిగింది — కేవలం ఆర్ట్ పిక్చర్‌గానూ, లో బడ్జెట్ పిక్చర్ గానూ తీద్దామనుకున్నది, ఏ హంగులూ లేకపోయినా బాక్సాఫీస్ విజయం సాధించి, ప్రేక్షకుల మన్ననకి



మంధా వేంకట రమణారావు

పాత్రమయిందీ అంటే అది కథాబలం, టీమ్ వర్క్ అని చెప్పక తప్పదు" అంటారు శ్రీ మంథా. వార పత్రికలో ఒక కన్య చెప్పిన కథ చెప్పికూడా మంచి పేరు తెచ్చుకున్నారు రూర్కెలా ఉక్కు ఫ్యాక్టరీలో పెర్సొనల్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు చాలా కాలంగా కీర్తి సంపాదిస్తున్న రచయిత [★★★]

ఓ(నో)టు కథ



— గుడిసేవ సుందరరామయ్య—

అది ఫిబ్రవరి 24వ తేదీ—సమయం అర్థరాత్రి—

ఏకగ్రీవంగా ఎన్నికైన ముఖ్యమంత్రిలా ఆకాశంలో నిండుగా నవ్వుతున్నాడు చంద్రుడు. నిండు సభలో కూర్చున్న అసెంబ్లీ సభ్యుల్లా ధగధగలాడుతున్నాయి నక్షత్రాలు. మంచివాడి మనసులా నలుమూలలా వ్యాపించింది పున్నమి వెన్నెల. ఆ వెన్నెల్లో పడిపోయిన శివాలయం ఎన్నికల్లో డిపాజిట్ కోల్పోయిన అభ్యర్థి ముఖంలా వుంది.

బీటలిచ్చిన ఆలయ మండపం చీలిపోయిన రాజకీయ పార్టీలా వుంది. దానిమీద పండుకొన్న ఆకారం చిరిగిపోయిన బాలెట్ పేపర్లా వుంది. ఆ ఆకారానికి తల్లిదండ్రులు పెట్టిన పేరు మహాలక్ష్మి. కాని సంఘం పెట్టిన పేరు మాచమ్మ. ఆమె ఆ గూడెంలోకి అడుగుపెట్టి రెండు సంవత్సరాలు దాటింది. ఆమె వచ్చేసరికి మంత్రిగారి కోసం ఏర్పాటు చేయబడిన విడిదిలా పాడుపడ్డ శివాలయం సిద్ధంగా వుంది. ఆలయ మండపాన్నే ఇల్లుగా మార్చుకొంది. తల్లిదండ్రులు ఆమె కిచ్చిన ఆస్తిపాస్తులేమిటో ఎవ్వరికీ తెలీదు. కాని విధి మాత్రం ఆమె కిచ్చిన ఆస్తి అంగవైకల్యం. ఫ్యాక్టరీలో కూలీగా పని చేస్తున్నప్పుడు తన అజాగ్రత్త కారణంగా రెండు కాళ్లను పోగొట్టుకొంది మాచమ్మ. అంతకు ముందే భర్తచే వదిలివేయబడ్డిన మాచమ్మ బ్రతుకు ఆ సంఘటనతో బజారున పడింది. జానెడు పొట్టను నింపుకోటానికి అడుక్కోక తప్పలేదు. ఆ గూడెంకు అరమైలు దూరంలో వున్న పట్నంలో పగలంతా అడుక్కొని దీపాలు పెట్టే వేళకు శివాలయం చేరుకొని గిద్దెడు గింజలు ఉడకేసుకు తినటం మాచమ్మకు నిత్య దినచర్య.

నాల్గు రోజులుగా విపరీతమైన జ్వరం కాయటంతో బయటకు వెళ్లటానికి బద్ధకించింది. దాచుకొన్న బియ్యం కూడా ముందు రోజు రాత్రే అయిపోయాయి. ప్రొద్దున్నుంచీ ఒంట్లో బాగో లేదు. శరీరంలో నీరసం ఎక్కువైంది. కడుపులో ఆకలి ఒత్తిడి చేస్తూంది. అయినా ఆమె కళ్లు మాత్రం రోడ్డువైపుకు మాస్తూనేవున్నాయి. దీపాలు పెట్టిన వేళనుంచి ఆమె చూపు అటే వుంది.

ఆమె మనసులో ఓ చిన్న ఆశాదీపం మిణుకు మిణుకుమంటూ వుంది.

'ఏ చణంలోనైనా ఆ మా రాజులు రావొచ్చు. గూడెంలో వోళ్లంతా సందేలకే గూళ్లు సేరుకొన్నారు. ఈ రోజు పోతే యిలాంటి రోజు అయిదు యేళ్లవరకు రాదంట. తనుకూడా అందుకనే యేయి కళ్లతో సూతూంది ఆళ్లకోసం. ఆళ్లొత్తారు. తమ బాధలు కళ్లారా సూత్తారు. జరుగుతూంది. ఈ ఎలచ్చన్లు పతి యేటా వుంటే బాగుణ్ణు — మడిసి మడిసికీ పదినోటు యిత్తారంట ఎంత దయ ఆళ్లకు? తమలాంటోళ్లను ఆదుకొంటారంట ఆళ్లు. ఆళ్ల కడుపులు సల్లగుండాల!'

ప్రక్కనే వున్న ఊత కర్రలను తీసుకొని వాటి సాయంతో లేచినిలబడింది. అడుగులో అడుగు వేసుకుంటూ క్రొత్తగా అధికారంలోకి వచ్చిన పార్టీలా జాగ్రత్తగా నడవసాగింది. మండపం మెట్లను ఒక్కటొక్కటే దిగి క్రిందికి వచ్చింది గద్దెలు దిగి ప్రజలమధ్యకు వచ్చిన నాయకునిలా. చుట్టూ చూసింది ఆశగా

ఆ చుట్టు ప్రక్కల ప్రదేశమంతా రాళ్ల రప్పలతోను, పిచ్చి మొక్కలతోను నిండిపోయింది. వెర్రితలలు వేస్తున్న ఆధునిక నాగరికతలా ముళ్ల చెట్లు అసహ్యాన్ని కలిగిస్తున్నాయి. తీరు తెన్నుల్లేని రాజకీయ పార్టీల్లా అస్తవ్యస్తంగా మొలకెత్తిన మొక్కలు భయాన్ని కల్గిస్తున్నాయి

మాచమ్మ దృష్టి ఓ మొక్క మీద పడింది.

పదవీ స్వీకారం కోసం పరిగెత్తే మంత్రిలా గబగబ నడిచింది మాచమ్మ.

కామాక్షి చెట్టు నిండా కాయలున్నాయి.

ఎర్రగా పండిన పళ్లను చూడగానే మాచమ్మ ఆగలేక పోయింది.

ఆత్రంగా చేతికందిన పళ్లను త్రుంచి నోట్లో వేసుకొంది.

దూరంగా కారు హారన్ విన్పించగానే ఉలిక్కిపడి చూసింది.

ఒకదాని వెనుక మరొకటి మూడు కార్లు కన్పించాయి.

వాటిని చూడగానే ఆమె కళ్లల్లో ఆనందం తొణికిసలాడింది.

ధనరాసులు తరలి వెళ్తున్నట్లు కన్పించింది ఆమె కంటికి

ఊత కర్రల సాయంతో రోడ్డు మీదికి వచ్చింది.

కార్లు రేపిన దుమ్ములో దారి వెతుక్కొంటూ గూడెం వైపు నడిచింది.

కార్లు గూడెంలో ఆగిపోయాయి.

బాలెట్ పెట్టెలు క్రుమ్మరించగా బయటపడ్డ బాలెట్ పేపర్లలా కార్లలోంచి జనం బయటకు వచ్చారు.

వాళ్లలో ఓ వ్యక్తి చేతిలో బ్రీఫ్ కేసుంది గూడెంలోని పెద్దతలకాయలు దణ్ణాలు పెట్టుకొంటూ వాళ్లకెదురు వెళ్లారు.

మాచమ్మ ఓ ప్రక్కగా నిలబడి తదేకంగా చూడసాగింది.

బ్రీఫ్ కేసు తెరవగానే రూపాయల కట్టలు తళుక్కుమన్నాయి.

డబ్బు కన్పించగానే మాచమ్మకు కంగారెక్కువైంది. ఓట్లు లెక్కిస్తున్నప్పుడు పోటీ చేసిన అభ్యర్థి హృదయం ఎలా కొట్టుకొంటుందో అంత కంటె రెట్టింపు వేగంగా కొట్టుకోసాగింది మాచమ్మ హృదయం

తాజా వార్తలకు, వ్యాఖ్యలకు, కొంగొత్త ప్రత్యేక శీర్షికలకు ఆంధ్రపత్రిక దిన పత్రిక
పెట్టింది పేరు...మీరు మీ కాపీ మీఊరి ఏజెంటుద్వారాగాని లేదా మానేజరు,
గాంధీనగరం, విజయవాడ-3 లేదా మానేజరు, బషీర్‌బాగ్,
హైద్రాబాద్-29 కి గాని వ్రాసి పోస్టులో తెప్పించుకొనండి.

అంటూ చేతులెత్తి టాటా చెప్పేసి కార్లలో ఎక్కికూర్చున్నారు వచ్చినవాళ్ళు.

కార్లు వెళ్ళిపోగానే గూడెంలోని జనమంతా నలుచుట్టూ చేరారు.

ఒక్కొక్కరు పదిరూపాయలనోటును తీసుకు వెళ్తుంటే మాచమ్మ గుడ్లప్పగించి చూస్తుండి పోయింది.

జనం ఒత్తిడి కాస్త తగ్గాక మాచమ్మ కూడా డబ్బు పంచే వ్యక్తి దగ్గరకు వెళ్ళింది

"బాబూ! నా పేరు మాచమ్మ! ఆ శివాలయంలో వుంటున్నాను. నాక్కూడా పైస ఇప్పించండి!" అని అడిగింది.

"ఏం పైసలు?" అన్నాడతను మాచమ్మను వింతగా చూస్తూ.

"ఆ మారాజిచ్చిన పైసలు బాబూ!"

"నీకు ఓటు లేదు. పైసలు రావు!" అన్నాడతను.

మాచమ్మకు గుండె ఆగినంత పనైంది

"అదేం అన్యాయం బాబూ! నాను కూడా మీలానే మడిసినే కదా! నాను కూడా ఆ మారాజుకే ఓటు సేత్తా! పైసలిప్పించండి!"

"పైసల్లేవు గియసల్లేవు పో!" అంటూ కసిరాడు ఆ వ్యక్తి.

మాచమ్మకు పిచ్చెక్కినట్లయింది.

"దయసూపండి బాబూ! నా కడుపు కొట్టకండి!" దీనంగా వేడుకొంది. కళ్ల వెంట నీళ్లొచ్చాయి.

"ఈ ఏడుపేదో ముందే ఏడ్చి ఓటు రాయించుకోపోయావా!" మాచమ్మ వయసే వున్న ఓ ఆడమనిషి అంది మెల్లగా.

మాచమ్మ ఆ ఆడమనిషి దగ్గరకు వెళ్ళింది.

"నువ్వయినా నాకు దారి సూపు తల్లీ! మీ అందరికీ ఓటు లెవరు రాశారు?" ఆత్రంగా అడిగింది.

ఓ (నో) టు కథ

"ఈపేట కవున్సిలరుగా సేసిన లాయరు బాబు! ఆయనే మా అందరికీ ఓట్లు రాయించారు. ఎవరికైనా తినే ప్రాప్తం వుండాలి. గవర్నమెంటోళ్ళు వెయ్యిరూపాయల నోట్లు రద్దు సేయకపోతే మా మారాజులు మా అందరికీ వెయ్యిరూపాయల నోట్లు పంచేవోరంట. ఏం సేత్తాం? ఎక్కడికక్కడికే తృప్తి. పాపం! నీకు అది కూడా ప్రాప్తంలేదు!" ఆడమనిషి ఆగకుండా మాట్లాడేసింది.

కాని మాచమ్మ అవేం విన్పించుకొనే స్థితిలో లేదు. లాయర్ బాబు ఓట్లు రాయించాడన్న ముక్క ఆమె మనసులో ప్రవేశించింది.

మరుక్షణమే పట్నంలో వున్న లాయర్ గారిల్లు మాచమ్మ మనస్సులో మెదిలింది. ఆ వార్డు కౌన్సిలర్‌గా చేసిన లాయర్ చిదంబరం మాచమ్మకు బాగా తెల్సు. ఎందుకంటె ప్రతి ఏటా లాయర్ గారు తన తండ్రి తద్దినానికి మాచమ్మ లాంటి అభాగ్యులకు అన్నదానం చేస్తుంటాడు.

మాచమ్మ ఇక ఆలస్యం చేయలేదు.

లాయర్ గారింటికి బయల్దేరింది.

అక్కడికి దాదాపు అరమైలు దూరం వుంది.

ఒంట్లో ఓపిక లేదు అయినా పట్టుదల కొద్దీ బయల్దేరింది

లాయర్ గారింటి గేటు ముందు నిలబడి బిగ్గరగా అరిచింది.

"లాయరు బాబూ! లాయరు బాబూ!" అంటూ.

లాయర్ గారయితే ఆమె మొరవినలేదు కాని ఆయన పెంచుతున్న కుక్క మాత్రం అమాంతంగా వచ్చి మాచమ్మ మీద పడింది.

అంతే!

మాచమ్మ రోడ్డు మీద పడిపోయింది.

పళ్లు బాగా లోతుగా దిగటం చేత రక్తం బయటకు చిమ్మింది.

బాధను భరించలేక "నాయనో, బాబో!" అంటూ శోకాలు పెట్టింది. అదే సమయంలో ఆ రోడ్డుమీద పోతున్న రిక్షా ఒకటి రక్కున ఆగిపోయింది. అందులోంచి ఓ వ్యక్తి దిగి "ఏం జరిగిందమ్మా?" అని అడిగాడు.

"లాయరు గారింటి కెళితే కుక్క కరిసింది బాబూ!" అంది మాచమ్మ ఏడుస్తూనే

"ఇంత అర్ధరాత్రి వేళ ఎందుకొచ్చావ్?"

"ఓటు రాయించుకొందామని"

ఆ వ్యక్తి క్షణం పాటు ఆశ్చర్యపోయాడు

"ఎందుకు?" అని అడిగాడు

"అదేంటి బాబూ! తెలవనట్టు అడుగుతారు! లాయరుగారు ఓటు రాత్తేగాని గూడెంలో డబ్బులియ్యరంట!"

"డబ్బులేమిటి?"

"కార్లేసుకొని మారాజులొచ్చారు మడిసి మడిసికి పదినోటిచ్చారు నానుకూడా అడిగితే ఓటు లేదన్నారు. అందుకనే రాయించుకోటాని కొచ్చాను" అంది మూల్గుతూ.

ఆ వ్యక్తికి పరిస్థితి అర్ధమైంది.

చిన్నగా నవ్వుకొన్నాడు.

"ఎంత పిచ్చిదానివమ్మా! ఓట్లు రాయటమంటే అంత తేక పనికాదు లాయరుగారు కాదుకదా బ్రహ్మదేవుడు కూడా ఈ రాత్రికి రాత్రే నీకు ఓటు రాయలేడు!"

"అయ్యో దేముడా! ఎరక్కపోయొచ్చాను పాణం బాగోపోయినా వోపిక సేసుకొని ఆశతో వొచ్చాను బాబూ! నా గెహవారం బాగలేదు. ఏదో పది రూపాయి లొత్తాయిగందా వోరం రోజులు గడిసిపోతాయని ఆశతో వొచ్చాను. పాడు కుక్క కండలు పీకేసింది" అంటూ శోకాలు పెట్టింది మాచమ్మ.

"ఇదిగో మామ్మా! నీవు శోకాలు పెట్టడం వలన ప్రయోజనం లేదు. నీక్కావాల్సింది పది రూపాయిలేకదా! నేనిస్తాను!" అంటూ జేబు లోంచి నోటు తీసి మాచమ్మకు అందించాడు.

ఎలక్షన్స్‌లో అత్యధిక మెజారిటీతో నెగ్గిన అభ్యర్ధి ముఖంలా ఆమె ముఖం కళ కళ లాడింది.


"తవరెంత మంచోళ్లు బాబూ!" అంది చేతులెత్తి దణ్ణం పెడ్తూ.

"కుక్క కరిచింది. అశ్రద్ధ చేయకూడదు. రోజూ ధర్మాసుపత్రికి వెళ్లి ఇంజక్షన్స్ తీసుకో!"

"అలాగే బాబూ!"

ఆ వ్యక్తి రిక్షావాణ్ణి పిల్చి "చూడు రాములూ! ఈమెను డాక్టర్ శర్మగారి హాస్పిటల్‌కు తీసికెళ్లి కట్లు కట్టించు రేపట్నుంచి ధర్మాసుపత్రికి వెళ్లి ఇంజక్షన్స్ చేయించుకొంటుంది!" అన్నాడు.

రిక్షావాడి సహాయంతో మాచమ్మను రిక్షాలో కూర్చుండబెట్టి, వంకరటింకర్లు లేకుండా నిలువుగ, నిటారుగా వున్న రోడ్డుమీదికి వచ్చి వడివడిగా అడుగులు వేసుకొంటూ వెళ్లిపోయాడు ఆ నియోజకవర్గం నుండి ఇండిపెండెంట్ అభ్యర్ధిగా పోటీ చేస్తున్న సౌజన్యరావు.



ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

సూరి - శ్రీహరికోట

మారే కాలంలో మారని మనుషులను ఏమనాలి ?

మూర్ఖులని.

నేటి నాగరిక సమాజంలో సీతవంటి స్త్రీలు శ్రీరామచంద్రునివంటి పురుషులు ఎంత శాతమున్నారో అంచనావేసి చెప్పకలరా ?

ఎలా ? ఈ దేశంతో జనాభా క్షణక్షణం పెరిగిపోతూంది. ఏ శాతం చెప్పినా అదీ క్షణక్షణం మారుతూనే వుంటుంది. దీన్నిబట్టే అర్థం కాడంలేదా - ఏ విలువలూ ఒకేలాగా వుండిపోవని.

ఎ. శ్రీ. ఆర్. తమ్మినపట్నం

నన్ను కొందరు మంచివాడు కొందరు చెడ్డవాడు అంటారు. అందరిచేతా మంచి అనిపించుకోవాలంటే ఎలా ?

లాభం లేదు బ్రదర్. అందరూ ఎప్పుడూ ఎవరినీ 'మంచి' అనరు.

జి. ఎస్. ఆర్. చింతకాని

ఒక రచయిత ఒక నటిని వివాహం చేసుకుంటే ఎలా వుంటుంది ?

రచయిత నటించడం, నటి రచించడం ప్రారంభమవుతుంది !

ఎమ్. వి. వి ఎస్. — విశాఖపట్నం

మీరు హిందూ ధర్మాలకు సనాతన సంస్కృతికి ఎదురు తిరగడం పెద్ద ఫాషన్. మీరు హేతువాదినని గప్పాలు కొట్టుకునేముందు... ఈ కుళ్ళిన సంఘానికి భావవిప్లవం...

ఆగండి మహాప్రభూ. మీ గోల నాకర్థం కావడం లేదు. హేతువాదం అంటే ముందు నన్ను అర్థం చేసుకోనివ్వండి. యిక మరీ ధర్మాలు, సంస్కృతీ అంటూ పెద్ద మాటలు అనేయకండి. వాటి అర్థాలు మారిపోయాయి. సాటి మనిషిని మనిషిగా చూడడం ధర్మం అనీ, నాగరికం అనీ అనుకునే నాకు ధర్మపన్నాలు వల్లె వేయడం, హేతువాదం భూస్వామిజం దోపిడీ అంటూ గోలచేయడం - తెలియదు. మీరు బోధించినా యీ మట్టిబుర్రకి గ్రహింపు కాదు. మీకు తెలియదు యీ బుర్రలో 'వైట్ మేటర్' కంటే-కోటనందూరు 'నల్లమట్టి' ఎక్కువవుందని మా నాన్నే అనేవారు! అంచేత బాబ్బాబు నన్ను వదిలేయండి ! ?

భూషణం — రాజపాలెం

స్త్రీకి స్వాతంత్ర్యం యివ్వడం కోతికి కొబ్బరికాయి యివ్వడమే అవుతుంది...

అది బెటరేమో - కోతికి కల్లుపోసినట్టు మగవాడికే సర్వస్వతంత్రాలూ, యిచ్చేయడం కంటే ఏమంటారు ?

అదాన్ - కర్నూలు

ఎదుటి పురుషునిలోని మంచిని గ్రహించక చెడుని గుర్తించే స్త్రీ అహంకారి అంటాను

తప్పు. కాస్త దూరదృష్టికల స్త్రీ అనండి. మంచి శాశ్వతంగా నిలవకపోగా చెడు విజృంభించే అవకాశాలు ఎక్కువ. 'చెడు'లో వున్న ఆకర్షణ మంచికి వుండదు కదా !

ప్రసాద్ — సూళ్ళూరుపేట

రామలక్ష్మి అంటే ఆరుద్రగారి శ్రీమతి కదూ అన్నది ఒక మహిళా స్నేహితురాలు. మీరు వున్నరికగ్నిషన్ ఆరుద్ర భార్యగానే

దానికి నేనేం సిగ్గుపడడం లేదే ! మీరు గమనించారో లేదో - రచయితగా నేను కె. రామలక్ష్మిని. స్త్రీగా ఆరుద్రగారి భార్యను. నా పిల్లల స్నేహితులకు వారి తల్లిని మాత్రమే. దీన్లో వింతేముంది ?

సి హెచ్. ఎస్. ఆర్. — గుడివాడ

గాంధీగారు యిప్పుడు మళ్ళీ పుట్టి ఈ దేశ స్థితిని చూసి ఏమనుకుంటారు ?

మళ్ళీ పుట్టి దేవదాసు ఏం చేశాడో చూశామా ? గాంధీగారూ అంతే- కథ కంటిన్యూ చేస్తారు.

టి. ఏ. ఆర్. ఎమ్ — శ్రీకాకుళం

ఈ కాలంలో ఆడపిల్లలు కాదు మగపిల్లలే గుండెలమీద కుంపటి అంటాన్నేను. మరి మీరు ఏమంటారు ?

ఇన్నాళ్లకేనా నిజం గ్రహించారంటాను ! చదువుకీ ఉద్యోగానికీ, కట్నానికీ పెళ్ళికీ ప్రేమకీ డబ్బుకీ మధ్య రాజీలు కుదరక సతమతమైపోతున్నారు అబ్బాయిలు !

డి సి. ఎన్ ఏ. ఆర్.- శ్రీశైలం

గుంటూరు శేషేంద్రశర్మగారి రచనలు ... అపూర్వ లాలిత్యంగా ఆచరణయోగ్యంగా వుంటాయని అంటున్నాను...

అదేమో తెలియదుగాని వారంత 'లావాటి' పుస్తకాలంతేసి 'చౌక' గా యివ్వడమే నాకు - అర్థంగాని విషయం...

సి. వి. ఆర్. — గుంటూరు


ఇన్నిరోజులూ మీ ప్రశ్నావళి చదివి మీమీద నేనొక నిర్ణయానికి వచ్చాను. మీరంతా -"గోడ మీద పిల్లివాటంగా" సామెతలా వ్యవహరిస్తారని...

ఏ గోడమీద పిల్లివాటమో, ఏ వ్యవహారమో తెలుసుకోకుండా నిర్ణయాలు చేసుకోడం బాగా లేదయ్యా విక్రమార్కా !

సి ఎస్ డి - రాజమండ్రి

అం సీత తన మాట వినాలి అల్లుడు మాటవిని మా ... కోడలు కోడలి మాట వింటే ... ఎందుకు సహించడు ?

ఏదేం మాట సీతాదేవి కోడలైపోయింది కదా ! అంటే కొడుకుని కొంగున కట్టేసుకుంటుందని ఎలా సహించడం ? ఏ అత్తకి తనూ ఓ యింటి కోడలినేనని జ్ఞానం పెట్టుకోడం యిష్టం ఉండదు.



ఓ ప్రేమకథ

శ్యామల



నిర్మలంగా ఉన్న ఆకాశంలో అకస్మాత్తుగా మబ్బు క్రమ్ముకు వచ్చి, వాన మొదలయింది. సన్నగా చినుకులు ప్రారంభమవగానే నడకవేగం హెచ్చించింది అపర్ణ ఆటో కొరకు చూస్తూ అంతలోనే వర్షం పెద్దదయి, ఉరుములు, మెరుపులు, గాలులతో తీవ్రరూపం దాల్చింది రోడ్డు మీద జనం అటూ, ఇటూ, పరిగెత్తసాగారు. అపర్ణ దగ్గరలోనున్న ఓ ఇంటి చూరు క్రింద నిలబడింది చేసేదేమీలేక

వర్షపు తీవ్రత హెచ్చసాగింది చూరు క్రింద నిలబడినా తడిసిపోతూనే ఉంది అపర్ణ. చీరకుచ్చెళ్ళు కాస్త పైకి ఎత్తి పట్టుకుంటూ రిస్టువాచీకేసి చూసింది టైము సరిగ్గా ఆరయింది. ఆ రోజే తన పరీక్షలు అయిపోయినాయి. ఫ్రెండ్స్ నలుగురు కలిసి సినిమా ప్రోగ్రాం వేసుకున్నారు ఆరుగంటలకు సినిమా హాలు వద్ద కలుసుకోవాలని, ఆ రాత్రి కబుర్లతో సరదాగా పద్మ అనే అమ్మాయి యింట్లో గడపాలని అనుకున్నారు బస్ దిగి సినిమాహాలు వైపు నడుస్తుంటే మొదలయింది వాన ఏం చేయటం? చిరాకుగ ఆకాశం వైపు చూసింది వర్షం ఇప్పట్లో తగ్గే చిహ్నాలు లేవు!

చల్లనిగాలి తడిసిన చీరకు తగిలి జివ్వుమన్నది ఒళ్ళంతా. పైటకొంగు భుజం మీదుగా తీసి కప్పుకుంటూ మరింత వెనక్కి జరిగింది అప్పుడే సింది ఆ ఇంటి తలుపు పైనున్న నేమ్ బోర్డ్ — "డా. ప్రభాకర్, ఎం ఇ. టెక్నికల్ మానేజర్, ఐ డి ఎల్ కెమికల్స్ లిమిటెడ్."

ఈరోజుతో తన కాలేజీ జీవితం అం పోయింది ఈరోజు సినిమా, తర్వాత పద యింట్లో భోజనాలు, అక్కడే పడక—ఎంత సరదాగా అన్నీ ప్లాన్ చేసుకున్నారు తి ఇలా వానలో చిక్కుపడి పోయింది ఒక్క రిక్షాకాని, ఆటోకాని, టాక్సీకాని కనబ దేం? ఎంతో దిగులనిపించింది అపర్ణకి

అంతకు ముంచి వానకు తడుస్తున్న చీర రివ్వున వీస్తున్న గాలి— మరింత బాధ పెడుతున్నాయి! పళ్ళు బిగించి ఎదురు చూస్తున్నది ఆ చలినుంచి బయటపడే మార్గం కోసం.

అంతలో ఆ యింటి తలుపు తెరుచుకుంది. "లోపలికి రండి" అన్న మాటలు వినబడినాయి గుమ్మంలో నిలబడిన యువకుడు ప్రక్కకు జరిగి దారి యిచ్చాడు.

పోటీ గడువు **31-8-78** వరకు పొడిగింపబడినది

సుప్రసిద్ధసినిమానటి కుమారి జయసుధ ద్వారా నాటినుండి నేటివరకు కేశాలంకరణ పోటీలో పాల్గొని బహుమతులు పొందండి



ఒక్కొక్క ఎంట్రీతో రీటా అట్ట పెట్టెయొక్క పైభాగము కత్తిరించి పంపవలెను. రీటా రెగ్యులర్ సైజు అయినచో నాలుగు, సూపర్ ఎకానమీ సైజు అయినచో ఒకటి ఎంట్రీతో జతపరచి పంపవలెను.



20 ఎమ్ ఎల్ (రెగ్యులరు)

100 ఎమ్ ఎల్ (సూపర్ ఎకానమి)

మీ కేశ సంపదకు రీటా



ప్రతీ రీటా పెట్టెలోను ఎంట్రీకూపను కలదు.


మీ ఎంట్రీలు మాకు చేరవలసిన ఆఖరు తేది 31-8-1978.

10. మాటలలో రీటా గురించి స్లోగను వ్రాయవలెను.

పీటో కంపెని, బొంబాయి, కలకత్తా, మద్రాసు

"నాటినుండి నేటివరకు"

కేశాలంకరణ పోటీ ఎంట్రీ కూపను



1 ______



2 ______



3 ______



4 ______



5 ______ అజంతా ______



6 ______



7 ______

పేరు ______

చిరునామా ______

ఈ క్రింది చిరునామాకు పంపవలెను.
VETO COMPANY
16 JONES ST. MADRAS-600001

ఈ గీతలలో కూపను కత్తిరించి పంపవలెను.

ఈ దిగువ యిచ్చిన సమాధానములు ఏ బొమ్మకు సరిపడునో వ్రాయవలెను.

1. ఆధునిక	2. జపాన్	3. ఈజిప్ట్
4. చైనా	5. 1000 బి.సి.	6. రాజస్థాన్
7. మహాబలిపురం	8. సుమేరియన్	9. విజయనగర్
10. ఫ్రాన్సు	11. గ్రీసు	12. బర్మా

ఓ ప్రేమకథ

'అమ్మయ్య' అనుకుంది అపర్ణ సినిమా సంగతి దేవుడెరుగు, ముందు ఈ జోళ్లీ తడవటం చలికి వణకటం అయినా తప్పేటుంది! లోపలికి నడిచింది.

"కూర్చోండి... అరె, అక్కడ కిటికీ దగ్గర జల్లు కొడ్తుంది... ఇటు లోపలగా కూర్చోండి. ఇక్కడయితే కాస్త వెచ్చగా ఉంటుంది... ఏమిటలా వణికి పోతున్నారు? ఎంత సేపట్నించి తడుస్తున్నారో పాపం... ఇదిగో ఈ టవల్ తీసుకోండి... కాస్త రిలాక్స్ అవండి, నేను 'టీ' తీసుకు వస్తాను—"

అపర్ణకి హాయిగా అనిపించింది అంత ఆదరంగా అతను మాట్లాడుతుంటే. ఈ యింట్లో ఉన్నది అతనొక్కడే అని తెలుస్తున్నది, "ఈ వానలో ఎక్కడికి వెళ్ళి తెస్తారు, అక్కర్లేదండీ!" అంది మర్యాదగా.

"ఎక్కడికీ వెళ్ళనండీ!" నవ్వాడతను. "తయారుచేస్తాను నేనే" అంటూ లోపలికి వెళ్ళాడు.

అప్పటికి కాస్త సర్దుకున్న అపర్ణ అతను వెళ్ళిన వైపే తొంగి చూసింది. తను కూర్చున్న గది వెనుకనే ఉన్న గది కిచెన్— స్టవ్, కొద్దిగా గిన్నెలు, భోజనాల బల్ల, కుర్చీలు ఉన్నాయక్కడ. అతను స్టవ్ పైన నీళ్ళు పెట్టి టీ చేసే ప్రయత్నంలో ఉన్నాడు. తను కూర్చున్న గది వైపు దృష్టి సారించింది. నాలుగు పేము కుర్చీలు ఒక సోఫా— ఓపు— బెడ్, టీపాయ్, ఓ ప్రక్కగా పెద్దపుస్తకాలరాక్ ఉన్నాయి. ప్రక్కనున్న గదిలో లీలగా ఓ మంచము, బట్టల స్టాండు కనిపిస్తున్నాయి. ఎక్కడా ఆడవాళ్ల సామాన్లు లేవు! బ్రహ్మచారి ఒక్కడూ ఉంటూ ఇంత సామాను ఏర్పరచుకొని, ఇంటిని నీటుగా దిద్దుకోవటం ఆశ్చర్యంగానే ఉంది! పెద్ద ఉద్యోగస్థుడు కదా— బాగా డబ్బుంది కాబోలు... అనుకుంది.

అపర్ణ ఆలోచనల్లో ఉండగానే రెండు కప్పుల్లో టీ తీసుకొని వచ్చాడతను. కప్పు బల్లపైన ఉంచి "తీసుకోండి" అన్నాడు.

"థాంక్స్" అంటూ కప్ అందుకుంది. వేడి టీ గొంతులోనించి దిగుతుంటే ఎంతో హాయిగా అనిపించి, తనపట్ల మర్యాద చేస్తున్న యువకుని పట్ల ఆత్మీయత అనిపించగా, "మీకు శ్రమ యిచ్చాను!" అంది.

"టీ చేయటమూ శ్రమేనా? ఎంతో రుచిగా వంట కూడా చేయగలనండోయ్ నేను! 'నీ కాబోయే శ్రీమతి ఎవరో కాని లక్కీరా' అని నా ఫ్రెండ్స్ నవ్వుతూ ఉంటారు."

'అంటే ఇతను బ్రహ్మచారేనన్నమాట!' అనుకుంది అపర్ణ. "ఇంత పెద్ద ఏదువు చదువుకొని, పెద్ద పొజిషన్‌లో ఉంటూ వంటా పెట్టా ఎలా నేర్చుకున్నారండీ?" నవ్వుతూ అడిగింది.

"ఆఁ... ఎంత చదువూ, ఎంత పొజిషనూ లెండి!"

"అదేమిటి అలా అంటారు? ఎం. ఇ. అంటే పెద్ద చదువు కాదా? ఐ. డి. ఎల్. కెమికల్స్‌లో టెక్నికల్ మానేజర్ అంటే పెద్ద పొజిషన్ కాదా?" వాకిట్లోని నేమ్‌బోర్డు గుర్తు తెచ్చుకుంటూ ఆశ్చర్యంగా అంది.

"నన్మమించి చదువుకున్న వాళ్ళెందరో ఉన్నారని నా భావం" అపర్ణ పొగడ్తకి మొహమాట పడుతున్నట్టు సంకోచంగా అన్నాడు. "సరే, నా విషయం అలా ఉంచండి. అభ్యంతరం లేకపోతే, మిమ్మల్ని పరిచయం చేసుకుంటే సంతోషిస్తాను!"

"నా పేరు అపర్ణ, బి. ఎ పరీక్షలు రాశాను. సినిమాకి వెళ్తుంటే ఇలా వానలో చిక్కుబడి మీ అతిథి నయినాను" క్లుప్తంగా చెప్పింది.

"బి. ఎ. అయిందంటున్నారు? తర్వాత ఏం చేయాలనుకుంటున్నారు?"

'పెళ్లి చేయాలని మా వాళ్ల ఆలోచన. నా ఉద్దేశమూ అదే' అని చెప్పలేకపోయింది అపర్ణ క్రొత్త వ్యక్తితో. ఏదో ఒకటి చెప్పాలి కదా అని "ఉద్యోగం చేయాలనుకుంటున్నానండీ! అయినా రిజల్ట్సు రావాలి.. ఆ పైన ఉద్యోగం దొరకాలి..." అనేసింది.

"ఎం. ఎ. చదవరన్న మాట!" అన్నాడు.

"లేదండీ! ఉద్యోగమే చేయాలని నా ఆలోచన" అంది. వెంటనే సంబంధం కుదరకపోతే ఎం. ఏ. లో చేర్పించాలని నాన్నగారి అభిప్రాయం. తను మాత్రం ఎం. ఎ చదవనని ఖచ్చితంగా చెప్పేసింది. తన కసలు పై చదువులలో శ్రద్ధ లేదు. "ఎందుకండీ ఉద్యోగం చేయాలని

ఓ ప్రేమకథ

అంత పట్టుదల? ఉద్యోగం పురుష లక్షణం కదా —" నవ్వాడు.

ఏం చెప్పటమా అని ఓ నిమిషం ఆలోచించింది అపర్ణ. ఆమెకీ ఈ సంభాషణ సరదాగానే ఉంది. అప్పుడప్పుడు కథలు రాయడం అపర్ణకి హాబీ. జోరున వాన, అపరిచితుని యింట ఆతిథ్యం— ఇదంతా కథల్లో సన్నివేశం లాగానే ఉంది... ఇక్కడో చిన్న కథ అల్లితే ఏం పోయింది? తను అతను తిరిగి కలుసుకోవచ్చారా ఏమిటి? ఇదంతా తిరిగి ఫ్రెండ్స్‌కి చెపుతున్నప్పుడు ఓ మంచి జోకు చెప్పినట్లవుతుంది... కలిసి నవ్వుకోవచ్చు..

"నేను ఉద్యోగం చేయటం సరదా కోసం అనుకుంటే మీరు పొరబడుతున్నారు! మా నాన్నగారు రిటైరైనారు. నాకు ఇద్దరు తమ్ముళ్ళు, ఇద్దరు చెల్లెళ్ళు ఉన్నారు. వాళ్ళను పెద్ద చేయవలసిన బాధ్యత నాపైన ఉంది. అందుకనే నా ఉద్యోగంపైన ఆశలు పెట్టుకున్నాం అంతా..." బరువుగా ఉంది అపర్ణ స్వరం.

అతని ముఖంలో సానుభూతి, మెప్పుకోలు రెండూ కనిపిస్తున్నాయి.

ఓ నిమిషం ఆగిలంది అపర్ణ, "మీకేం— మంచి చదువు, పెద్ద ఉద్యోగం! నావంటి వారి పరిస్థితులకీ, మీకూ ఎంతో దూరం!"

"అలాగనకండి మీ పరిస్థితులను నేను పూర్తిగా అవగాహన చేసుకోగలను. ఎందుకంటే—" ఏదో అనబోయి చటుక్కున ఆగాడు. "మీ స్వార్థం చూసుకోకుండా బాధ్యతలు నిర్వహించటానికి తాపత్రయ పడుతున్నారంటే మీ ఉన్నత సంస్కారం తెలుస్తోంది..."

అతని మాటలకు మొహమాట పడిపోయింది. 'ఇంత నిర్మలంగా మాట్లాడుతున్న అతనితో కథలు అల్లి చెప్పటం తప్పేమో ననిపించింది లీలగా. అయినా ఇప్పుడు వెనక్కి తగ్గే మార్గం లేదు. అందుకని నవ్వి, "ప్రభాకర్ గారూ, మీ స్వంత వూరు ఇదేనా?" అంటూ సంభాషణను అతని వైపుకి త్రిప్పింది.

"మాది తెనాలి. మా నాన్న లక్ష్మీనారాయణగారు. స్కూలు మాస్టరుగా చేసి రిటైరయినారు."

"నాజరు పేటలోని లక్ష్మీనారాయణ గారా?" ఆశ్చర్యంగా అడిగింది.

"అవును. మీకెలా తెలుసు?" మరింత ఆశ్చర్యంగా అడిగాడు.

"మా నాన్నగారు చిన్నతనంలో మీ నాన్నగారివద్ద చదువుకున్నారట. మా అమ్మ, నాన్నగార్ల పెళ్లి కుదిర్చింది కూడా ఆయనేనట. ఏనాటి సంగతులో నమకోండి ఇవన్నీ! ఈ మధ్యన మా ఫాదర్ తెనాలి వెళ్తే 'మా అబ్బాయి హైదరాబాదులోనే ఉన్నాడ'ని చెప్పి మీ అడ్రస్ ఇచ్చారట మీ నాన్నగారు. వచ్చి కలుసుకోవాలని అను

ట్రూ' విధానములో కరాటె నేర్చుకోండి

పాఠము-3

మీరు కొద్దిపై మోకాలు పైకి యెత్తి కాలి క్రిందభాగమును భూమికి సమాంతరముగా నుండునట్లు ఎత్తండి.

కాలును నేరుగా ఎత్తినపుడు తొడభాగము త్రిప్పుతూ పాదమును మీ విరోధి వైపుగా వచ్చునట్లు త్రిప్పండి.

ఈగు దెబ్బను మీ విరోధి శరీరము పై భాగమునకు కూడ తాక వచ్చును. పై విధమునే విరోధి తల మెడ భాగములవైపు మోకాలిని త్రిప్పవచ్చును.



ఓ ప్రేమకథ

కూంటున్నారు కానీ, ఏదీ... ఆఫీసు పను లతో తెమలటం లేదు!"

విస్మయంగా వింటున్న అతనికి ఓ సందేహం కలిగింది. "మీ ఫాదర్ రిటైరయినారన్నారు, ఆఫీసు పనులేమిటి?"

"అదే, పెన్షను" సరుకుంటూ అంది. "రిటైరయినా పెన్షన్ కోసం ఆఫీసుల చుట్టూ తిరగాలి కదండీ!"

"మీ నాన్నగారి పేరు, అడ్రస్ నాకు ఇస్తారా? పెద్దవారు నన్ను వెతుక్కుంటూ రావటం దేనికి, నేనే వచ్చి కలుసుకుంటాను అసలు మా నాన్న నాకు చాలా అడ్రస్‌లు ఇచ్చారు. 'వీళ్ళంతా నా శిష్యులు, వెళ్ళి కలుసుకోరా' అంటూ! నన్ను వాళ్ళసు గుర్తుంచుకున్నంతగా వాళ్ళకు నన్ను గుర్తున్నారో, లేదో అనే సంకోచంతో నేను ఎవరి యిళ్ళకి వెళ్ళలేదు."

"అలాగే, అడ్రస్ ఇస్తాను" అంటూ లేచి నిలబడింది అపర్ణ అడ్రస్ ఇవ్వకుండానే "వర్షం తగ్గితే బాగుండును, వెళ్తాను" అంటూ తలుపు తీసింది. రివ్వున కొట్టింది జల్లు. కాస్త వెనక్కు తగ్గింది.

"భలేవారే, వాన తగ్గలేదండీ, ఎలా వెళ్తారు?" అడ్డు చెప్పాడతను.

టైము చూసుకుంది అపర్ణ. ఎనిమిది అయింది. వాన ఎప్పటికి తగ్గేటట్లు? తను ఎప్పటికి బయట పడేటట్లు? అయోమయంగా అనిపించింది.

"అలా దిగులుగా చూడకండి! వర్షం తగ్గగానే మిమ్మల్ని క్షేమంగా నేను దింపి వస్తాను... మీకు ఇది భోజనం టైము కాబోలు. వంట అయితే వచ్చుకాని, ఇక్కడ కావలసిన సామాన్లు లేవు. కాస్త టిఫిన్ తెస్తాను" అంటూ లోపలికి వెళ్ళాడు అపర్ణ వారిస్తున్నా వినకుండా పది నిమిషాల్లో వెన్న రాసిన బ్రెడ్ స్లయిసెస్, బిస్కట్స్, పాలు తీసుకొని వచ్చాడు.

"అపర్ణగారూ, మన పెద్దలు బాగా దగ్గర వాళ్ళని తెలిసింది కనక మీరూ నన్ను దగ్గర వాడుగా భావించాలి! ఇది అపరిచితుని ఇల్లు అనుకోకండి. మొహమాట పడకుండా ఈ అల్పాహారం తీసుకోవాలి."

"ఈ ఆహారం 'అల్పం' కాదండోయ్, చాలానే ఉంది!" నవ్వుతూ అంది.

అతనూ నవ్వేశాడు.

టిఫిన్ ముగిశాక అపర్ణ ఖాళీ ప్లేట్లు, గ్లాసులు తీయబోతుంటే అతను వారించాడు.

"మీరు గెస్ట్... పనులు చేయటం ఏమిటి?"

"మీరే చెప్పారుగా ఇది అపరిచితుల ఇల్లు కాదని!" అని కిచెన్‌లోకి అన్నీ తీసుకువెళ్ళి, కడిగి, సర్దేసింది.

వాన జోరున కురుస్తూనే ఉంది. అంతకు ముందురోజు పరీక్షల కోసం నిద్ర సరిగా లేకుండా చదివిందేమో, అపర్ణకి అప్పుడే మత్తుగా ఉంది. ఆవులిస్తుంటే గమనించాడు అతను.

"నిద్రగా ఉంటే, ఆ గదిలో పడుకోండి. బెడ్ ఉంది" అన్నాడు.

"అబ్బె, నిద్రేంలేదండీ!" అన్నా, రెప్పలు మూసుకుపోతున్నాయి ఆమెకి.

ఆమె స్థితిని గమనించిన అతను మరేమీ అనకుండా న్యూస్‌పేపరు చేతికి తీసు

కున్నాడు. రెండు నిమిషాల్లో, కుర్చీలోనే తల ఓ ప్రక్కకి వాల్చి నిద్రలోకి జారింది.

అతని చేతిలోని పేపరూ క్రిందికి జారింది. రెప్ప వాల్చకుండా ఆమెనే చూడ సాగాడు.

'ఎంత నిర్మలంగా ఉన్నది ఆ ముఖం! ఎంత హాయిగా నిద్రపోతున్నదో, అమాయకంగా, పసిపాపలా... ఆమెకు ఎన్ని బాధ్యతలో పాపం! నాకూ అంతే అపర్ణా, ఎన్నో బాధ్యతలు... అందుకే మనిద్దరం కలవలేం ...ఛ, ఏమిటిది? అప్పుడే ఇంత దూరం ఆలోచిస్తున్నాను...' గిల్టీగా ఫీలయి తిరిగి పేపరు చేతిలోకి తీసుకొని చదవటానికి ప్రయత్నించ సాగాడు.

మరో అరగంటకు వర్షం తగ్గింది. ఆమెకు నిద్రాభంగం కలిగించటం ఇష్టం లేకపోయినా, లేపటం తప్పనిసరి అనుకుంటూ దగ్గరగా వెళ్ళి మృదువుగా పిలిచాడు "అపర్ణా!"

ఆమె గాఢ నిద్రలో ఉన్నది.

మళ్ళీ పిలిచాడు, "ఏమండీ, అపర్ణా లేవరూ?"

ఈసారి కాస్త కదిలింది. మత్తుగా కళ్ళు విప్పింది. నిద్రాభారంతో బరువుగా ఉన్న కళ్ళు ఓ క్షణం పాటు పరిసరాలను, అతన్ని గుర్తించలేదు. తిరిగి కళ్ళు మూసేసుకుంది. ఐదు నిమిషాలకే మళ్ళీ అతను లేపటంతో మెలకువ తెచ్చుకొని టైము చూసుకుంది. తొమ్మిదిన్నర! చటుక్కున లేచి నిల్చుంది.

"వాన తగ్గింది. మీరు ఎక్కడికి వెళ్ళాలో చెప్తే వచ్చి దిగబెడ్తాను."

"చిక్కడపల్లిలో గుడిదగ్గర పద్మ అనే స్నేహితురాలి యింట్లో ఈ రాత్రి కబుర్లతో సరదాగా గడపాలనుకున్నాం. అక్కడికే వెళ్తాను!"

"ఆ బెడ్‌రూమ్ అవతల బాత్‌రూమ్ ఉంది. మీరు ముఖం కడుక్కోండి. నేను ఇంతలో ఆటో పిలుస్తాను" అంటూ తలుపు తీసుకొని బయటకు వెళ్ళాడు.

బాత్‌రూమ్‌లో ముఖం కడుక్కొనేసరికి మత్తు వదిలి ఫ్రెష్‌గా అనిపించింది అపర్ణకి. అక్కడ ఉన్న పెద్ద అద్దం ముందర ఉన్న హెయిర్ క్రీమ్స్, ఆఫ్టర్‌షేవ్ లోషన్స్, ఫేస్‌పౌడర్స్ మొదలైనవి చూస్తూ "అమ్మాయిలనుమించి షోకులు చేసుకుంటున్నారు ఈ రోజుల్లో మగవాళ్ళు" అనుకొని నవ్వుకుంది.

అంతలోనే ఆటో వచ్చింది. ఆమె ఎక్కి కూర్చుంది. ఇంటికి తాళం వేసి అతనూ ఎక్కాడు.

"మీకు శ్రమ... నేను ఒక్కదాన్నీ వెళ్ళగలను లెండి!"

"ఇటీజ్ ఎ ప్లెజర్... ఇంత రాత్రివేళ ఒక్కరూ వెళ్ళటం మంచిది కాదేమో! అయినా ఇంట్లో కూర్చుని నేను చేసే పని ఏం లేదు ఇప్పుడు."

రోడ్లన్నీ తడిగా ఉండి లైట్ల కాంతిలో మెరుస్తున్నాయి. చల్లని గాలి ఇందాకటివలె చలి కలిగించటం లేదు; హాయిగా ఉంది. అదొక రకమైన మట్టి వాసన నింపుకున్న వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది. ఆటో రివ్వునపోయి అపర్ణ చెప్పిన ఇంటి ముందు ఆగింది.

"థాంక్యూ అండ్ గుడ్ నైట్" అంది అపర్ణ ఆటో దిగి.

"అన్నట్టు మీ అడ్రస్ ఇవ్వారు కాదు!" అన్నాడతను.

"నాన్నగారికి మీ యిల్లు చెబుతాను లెండి, మీకెందుకు శ్రమ! ఆయనే వస్తారు ఫర్వాలేదు."

"అబ్బే, శ్రమేం లేదు... అదీ కాక ఆ యింట్లో నేను ఉంటానో, ఉండనో... ఇల్లు మారుతానేమో..." తడబాటుగా అన్నాడు.

అడ్రస్ ఇవ్వటం తప్పనిసరి అయింది అపర్ణకి. "హిమాయత్ నగర్‌లో ఉర్దూ హాల్ ఎదురుగా ఉన్న యిల్లు" అంది.

"నేను వెళ్ళొస్తాను మరి. సో లాంగ్!" అతను వెనుదిరిగాడు.

గేటు తీసుకొని లోపలికి వెళ్ళింది అపర్ణ. పద్మ, మిగిలిన ఫ్రెండ్స్ పడుకొని కబుర్లు చెప్పుకుంటున్నారు.

"సినిమాకిబయల్దేరేసరికి, దోవలో వానకి చిక్కుపడి పోయాన్రా! ఇప్పటికి రాగలిగను" అంటూ కూర్చుంది అపర్ణ.

"పద్మ కూడా రాలేదు సినిమాకి అనుకోకుండా ఆవిడకి 'అర్జెంట్ పని' తగిలిందిట నేను, వనజ మాత్రమే సినిమా చూసి వస్తున్నాం" అంది శోభ, 'అర్జెంట్ పని' అన్న పదాలను వత్తి పలుకుతూ.

ఏమిటో ఆ పని?" కుతూహలంగా అడిగింది

"అదంతా తర్వాత చెబుతాను కానీ. ముందు భోజనానికి పద! మేము ఇప్పుడే తిన్నాం" అంది పద్మ


'భోజనం చేయలేనే ఇప్పుడు అతను హెవీగా టిఫిన్ పెట్టేశాడు.'

"ఎవరా 'అతను?' ఏమా కథ?" అడిగింది శోభ

అపర్ణ జరిగిందంతా చెప్పింది.

"మొత్తానికి 'అతన్ని' నీవు అనుకున్నట్టే కలుసుకున్నావన్న మాట!" నవ్వింది వనజ

"అదేమిటి?" తెల్లబోతూ అడిగింది అపర్ణ.



ఓ ప్రేమకథ

"అదేనే, నీకు పెళ్ళి చూపులు అంటే ఇష్టం లేదని, కాజువల్‌గా కలుసుకోవాలనీ అంటూ ఉంటావు కదా! అందుకని వరుడిని నీవు కోరుకున్న విధంగానే కలుసుకున్నావు—అంటున్నాను!"

అందరూ నవ్వేశారు. మూతి ముడుచుకుంది అపర్ణ. "అతనేం 'వరుడు' కాదు! ముఖ్యంగా పెద్ద చదువు, పెద్ద ఉద్యోగం ఉన్న వ్యక్తిని నేను పెళ్ళి చేసుకోను. అది మీకూ తెలుసు కదా?"

ఎవరూ మాట్లాడలేదు ఈ మారు. అపర్ణ తండ్రి, అన్నలు, బావగారు హోదా గల పెద్ద ఉద్యోగాలలో ఉన్నారు. వాళ్ళంతా ఎప్పుడూ ఆఫీసు పనులలో నిమగ్నమయి ఉంటారని, భార్యా పిల్లలతో తగినంత టైము గడపరని అపర్ణ భావన. అందువలన తను సామాన్యమైన ఉద్యోగంలో ఉన్న వ్యక్తినే పెళ్ళి చేసుకోవాలనీ, తన స్థానం తర్వాతనే అతని జీవితంలో ఉద్యోగానికి స్థానం ఉండాలనీ, భోగ భాగ్యాలకు—సుఖ సంతోషాలకు సంబంధం లేదనీ అంటుంది. ఇవన్నీ తెలిసిన మిత్రురాళ్ళు కాస్సేపు ఏమీ మాట్లాడలేదు. తర్వాత శోభ అంది, "అయితే అపర్ణా, అన్ని విషయాలూ నచ్చినా, డబ్బు, హోదా కలవాడనే పాయింటుమీద సంబంధాన్ని తిరస్కరిస్తావా నిజంగానే?"

"అవును!" ఖచ్చితంగా చెప్పింది అపర్ణ "అతనుసామాన్య ఉద్యోగి అయితే నేనూ ఈ పాటికి అతనితో పెళ్ళి గురించి కలలు కనే దాన్నేమో... నా ఆలోచనా రీతిగా తప్పు ఉన్నదని మీరన్నాసరే, ఈ విషయంలో మాత్రం సర్దుకోలేనే!... ఇంతకీ సాయంత్రం పద్మకి తగిలిన అర్జెంట్ పని ఏమిటి?"

అంతా ముసిముసిగా నవ్వారు. "పెళ్ళి చూపులు!" అంది వనజ.

"నిజంగానా!? మాకెవ్వరికీ ముందుగా చెప్పలేదేం పద్మా? అయిష్టమూసి అప్రూవ్ చేయకుండానే చేసేసుకుందామనుకున్నావా?" అంది అపర్ణ

"నాకూ ముందుగా తెలియదు. పరీక్ష రాసి ఇంటికి వచ్చాక చెప్పింది అమ్మ. సాయంత్రం ఆరుగంటలకు వచ్చి రెండు, మూడు గంటలు ఇక్కడే గడిపారు."

"సరే, వివరాలు చెప్పు!"

"అతని పేరు ప్రభాకర్. ఎం. ఇ. పాసయినారు. ఐ. డి. ఎల్. కెమికల్స్ ఫ్యాక్టరీలో టెక్నికల్ మానేజర్."

ఉలిక్కిపడింది అపర్ణ. "నీవు చెప్పిన టైములో నేను సరిగ్గా అతని యింట్లో, అతనితో మాట్లాడుతూ ఉన్నాను!"

"అదెట్లా సాధ్యం!?"

అందరికీ గందరగోళంగా అనిపించింది.

"ఇదేదో మిస్టరీ!" అంది శోభ.

మర్నాడు మధ్యాహ్నం, చిప్పనాటి మాస్టరుగారి అబ్బాయిని కలుసుకోవటానికి తండ్రిని బయల్దేర దీసింది అపర్ణ, ఇంటి గుర్తులు చెప్పి. కాస్సేపట్లోనే వెనక్కి వచ్చేశారు ఆయన. "ఆ యిల్లు అతనిది కాదమ్మా, అపర్ణమ్మా! అతని ఫ్రెండ్ ప్రభాకర్ అనే మరొక కుర్రవాడిదిట. ఆ ప్రభాకర్, మాస్టరుగారి అబ్బాయి రూము గుర్తు చెప్తే అక్కడికి వెళ్ళి వచ్చాను. అతను రూములో లేకపోవటంతో కలుసుకోలేక పోయాను. నిన్నసాయంత్రం ప్రభాకర్ యింటికి అతను వస్తే, ఏదో పని మీద ప్రభాకర్ బయటకు వెళ్ళవలసి వచ్చి, తను వచ్చేదాకా ఉండమని చెప్పి వెళ్ళాడుట. నువ్వు ఆ టైంలో అతన్ని కలుసుకొని అదే అతని ఇల్లనుకున్నావు!" అన్నారు.

"అయితే అతను 'ప్రభాకర్' కాదన్న మాట! సరే, మిస్టరీ విడి పడింది. కాని అతను— ఈ ఇల్లు నాది కాదు; నేను ప్రభాకర్‌ని కాను; ఎం. ఇ. ని కానే కాను; టెక్నికల్ మానేజర్‌ని అసలేకాను" అని చెప్పలేదేం?? ఆలోచనలో పడింది అపర్ణ.

ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక

డక్కన్ క్రానికల్ సంస్థలోని కార్మికుల సమ్మె కారణంగా ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక 20-7-78 సంచిక నుండి వెలువరించలేక పోయినందుకు విచారిస్తున్నాము. ఈ తాత్కాలిక అసౌకర్యానికి మన్నించ వలసినదిగా కోరుచున్నాము.

— సంపాదకుడు.

ఓ ప్రేమకథ

సరిగ్గా అప్పుడే అక్కడికి వచ్చాడు అతను. ఆ పెళ్ళి.యింటినీ, ఆ యింటిలోని భోగభాగ్యాలనీ చూసిన అతని ముఖంలో విస్మయం కనిపించింది క్షణకాలం అంతలోనే సర్దుకొని "నమస్తే!" అని గ్రీట్ చేశాడు అపర్ణని. 'నిన్న నాకెందుకు అబద్ధాలు చెప్పావు?' అన్నట్లున్నాయి అతని చూపులు.

ప్రతి నమస్కారం చేస్తున్న అపర్ణ 'నిన్న నాకెందుకు నీగురించి నిజం చెప్పలేదు?' అన్నట్లు చూసింది.

ఓ నిమిషం అలా ఒకరినొకరు చూస్తూ నిల్చున్నారు. 'ఇద్దరం చేసిందీ ఒకటే'నని ఇద్దరికీ ఒకేసారి స్ఫురించగా, ఫకాలున నవ్వేశారు ఒకేసారి!

అపర్ణ తండ్రికి ఏమీ అర్థం కాలేదు.

నవ్వు ఆపుకుంటూ, అపర్ణ అంది "మీ మాస్టారు లక్ష్మీనారాయణగారి అబ్బాయి ఈయనే, నాన్నా!"

అతను కాస్త ముందుకి వచ్చి వినయంగా పరిచయం చేసుకున్నాడు. "నాపేరు మధు. సెక్రటేరియట్‌లో క్లర్కుగా ఉంటున్నాను."

ఆ మాటలు వింటూనే అపర్ణ కళ్ళు ఏదో కాంతితో తళుక్కుమన్నాయి. ఆ వెలుగుకి కారణం తెలియకపోయినా, అర్థంగ్రహించిన మధు కళ్ళూ జవాబుగా మెరిశాయి.

హైదరాబాద్ నోట్ బుక్

(10 వ పేజీ తరువాయి)

తమ పంచమ వార్షికోత్సవం సందర్భముగాను జూలై 11వ తేదీన చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో సన్మానించి, తమనుతామే సన్మానించుకొన్నారు. రాష్ట్ర కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ ఎం. గోపాలరావు ముఖ్యాతిథిగా వున్నారు. ప్రముఖ చలనచిత్ర నటి శ్రీమతి జమునా రమణారావు శ్రీ రొద్దం హనుమంతరావును శాలువతో సన్మానిస్తూ, సి. యస్. ఆర్. ఆంజనేయులతోను, శ్రీ రొద్దంవారితోను తమకు గల పరిచయాన్ని వివరించారు. శ్రీ ఎం. గోపాలరావు మాట్లాడుతూ లండన్‌లో షేక్స్పియర్ నాటకాలకు ప్రేక్షకులు రెండింతల టిక్కెట్టు కొని విరగబడి చూస్తారని, మన నాటకాలకూ అలాటి దశరావాలని అన్నారు. శ్రీ రావూరి వెంకటసత్యనారాయణరావు ప్రసంగిస్తూ, రొద్దంవారి తండ్రి తాతలు మహానాటక కర్తలూ నటులూనని, వారి జీవితమే నాటకమనీ అన్నారు. శ్రీ తాకూరి వెంకటసత్యనారాయణను తబలా విద్వాంసుడు


శ్రీ మాళగి శ్రీధరమూర్తికి ఈ సందర్భంలో సన్మానం జరిగింది. శ్రీరాపూరి వారికి ఇటీవలే ఆంధ్రవిశ్వవిద్యాలయం 'కళాప్రపూర్ణ' బిరుదు ఇచ్చింది. మాళగి శ్రీధరమూర్తికి సి.యస్.ఆర్. కళామందిర్‌వారు "తబలా ఏకాఘహా" బిరుదు ఇచ్చారు. రొద్దంవారు తమ సన్మానానికి కృతజ్ఞత చెప్పిన తర్వాత శ్రీ కె. వి. భూపాలరావు కృతజ్ఞత తెలిపారు. ప్రారంభంలో ఎం. వి. సుబ్బారావు స్వాగతం చెప్పారు. పిదప పానుగంటివారి శ్రీరామ పాదుకా పట్టాభిషేక నాటకం ప్రదర్శించబడింది. సుప్రసిద్ధ నటులు శ్రీ వేమూరి సీతారామశాస్త్రి, శ్రీమతి మల్లాది, శ్రీ అయ్యదేవర పురుషోత్తమరావు, శ్రీ ఎస్. వి. ఆర్. శర్మ, యడవల్లి నాగేశ్వరావు, శ్రీ తంగిరాల వెంకటసుబ్బారావు, శ్రీ రాధా గోపాలరావు నటించారు. స్త్రీ పాత్రలు స్త్రీలే నిర్వహించే ఈ కాలంలోను మంథర పాత్రధారి శ్రీ పి. ఎస్. శర్మ. ప్రేక్షకులను మెప్పించారంటే, మెచ్చదగిన విషయమే. అన్నట్లు మరచాను. శ్రీ రొద్దం వారికి ఒక కుమారుడు. ముగ్గురు కుమార్తెలూ ఉన్నారు. కుమారుడు శ్రీ రొద్దం ప్రభాకరరావు ఇంతకు ముందు పోలీసు డిప్యూటీ కమీషనర్‌గావున్నారు. ప్రస్తుతం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రత్యేకాధికారిగా వున్నారు.

కాలేజీ టీచర్లకు యు.జి.సి స్కేళ్ళు:

పూర్వం 'బతకలేక బడిపంతులు' అనేవారు కాని, ఇప్పుడు ఈ సామెత పూర్తిగా మారింది. 'సుఖంగా బతకడానికి బడిపంతులు' అని మార్చాలి సామెతను. కాలేజీ టీచర్లకు ఎం.ఫిల్: పి.హెచ్.డి. అనే ఎలాటి అదనపు ఉన్నత విద్యార్హతలూ అవసరంలేకనే 1976 నుంచి యూజీసీ వేతనాల స్కేళ్ళు లభిస్తాయి. రాష్ట్ర ప్రభుత్వ నూతనాదేశం మేరకు. దీనివల్ల రాష్ట్రంలో 206 మంది ప్రిన్సిపాల్సుకు, ఐదువేల మంది లెక్చరర్లకు, 1400 మంది ట్యూటర్లకు ప్రయోజనం కలుగుతుంది. కాలేజీఉపాధ్యాయులు ఇకమీద విద్యా ప్రమాణాలు పెంచడానికి తమ యావచ్ఛక్తినీ వినియోగిస్తారని, విద్యాలయాలకు పూర్వపు ప్రతిష్ఠను సంతరిస్తారని ఆశించవచ్చు.

ఉపశ్రుతి:

పసిపిల్లల ఆలోచనా ధోరణిలోని సరళత మహామహా రాజనీతిజ్ఞులకే తల తిరిగేట్టు చేస్తుంది. ఏడేళ్ళ చిరంజీవి కొండె పద్మావతి రామాయణం కథ విన్నది; మననం చేసుకుంది; సీతను రావణుడు ఎత్తుకుపోతే రాముడు అంతగా బాధపడడం ఎందుకో గ్రహించలేక పోయింది. ఎందుకంత హంగామా? "తాతాతా! మరి, నా పెన్సిలు నా క్లాసుపిల్ల లీల తీసుకుపోయింది. అడిగితే ఇవ్వనంది. నేను ఏం చేశానో తెలుసా? వెంటనే ఆమె పుస్తకం ఒక్కటి లాక్కొని వచ్చాను. అంతే. రావణుడు సీతను ఎత్తుకుపోతే, రాముడు మండోదరిని ఎత్తుకు వస్తే పోలే!" అని ప్రశ్నించింది. జవాబు మీకే వదిలాను.



భర్త ఎదుటే భార్యని బలాత్కారం!

బెంగుళూరులో ఓ యువదంపతుల జంట రెండో ఆట సినిమా చూసి ఇంటికి పోడానికి ఓక ఆటోరిక్షా వ్యక్తిని అడిగారట. ఆ రిక్షాలో అతనితోపాటు మరో యిద్దరు వ్యక్తులు వున్నారట. మొత్తం ముగ్గురూ ముందు భాగంలో సర్దుకూర్చున్నారట. ఈ జంట మామూలుగా వెనుక సీటులో కూర్చున్నారట. రిక్షా వ్యక్తుల వేగం పుంజుకుని దారి తప్పిందట. ఇదేమిటని అనేలోగానే ఆ ముగ్గురూ కలిసి వారిద్దర్నీ రిక్షా నుంచి బయటకు లాగి, ఆ యువకుణ్ణి ఓ చెట్టుకు కట్టేసి, ఆమెను బలాత్కరించారట. ఈ విషయం రాష్ట్రప్రభుత్వ దృష్టికి వచ్చి ప్రభుత్వం వారిద్దరికీ వుద్యోగాలిచ్చి, ఆ ముగ్గుర్నీ శిక్షించిందట.

అధికార్ల ఆగ్రహం?

పాండిచ్చేరి రాష్ట్ర హోమ్‌శాఖలో అసిస్టెంట్ సెక్రెటరీగా పనిచేస్తున్న రాధాబాయి అనే ఆమె తనను తన పై అధికారులు కొందరు వేధిస్తున్నారని ప్రయత్నాలు చేస్తున్నారని నేరారోపణ చేస్తూ వారిమీద చర్య తీసుకోవాలని కోరినందున ఆ అధికారులమీద అనవసరంగా నేరారోపణ చేసినందుకు ఆమె వుద్యోగం తీసేశారట. దాంతో ఆమె గత 23 రోజులుగా (9 వ తేదీనాటికి) అమరణ నిరాహార దీక్ష చేస్తున్నారట. ఆమె స్థితి చాలా ఆందోళనకరంగా వుందని ప్రధానికి రాష్ట్ర పార్టీ సభ్యులు తంతి పంపారట.

ప్రధానిపై చరణ్, రాజ్‌ల ఆరోపణలు

తన తనయుని మీదున్న కేసులు విచారణ కావాలని నేనన్నందున నన్ను మంత్రి పదవి నుంచే తొలగించారు ప్రధాని అని చరణ్‌సింగ్ అన్నారట. చరణ్‌సింగ్ కుటుంబం వారిమీద కూడా ఆరోపణలున్నాయి. నా కుమారుని విషయంలో అనవసర ప్రమేయం లేకుండా వుండాలని దేవరకుగా చరణ్‌సింగ్ అంగీకరించాలని మొరార్జీ కోరారట. నామీద కుట్రపన్ని నన్ను తొలగించారు అక్రమంగా, దౌర్జన్యంగా అపటాని రాజ్‌నారాయణ్ అన్నారు. ఇందిరా గాంధిని అరెస్టు చేయకపోవాన్ని ప్రభుత్వ నిర్లక్ష్యంగా చరణ్‌సింగ్ పేర్కొంటే అది పార్టీ ప్రభుత్వ విధానానికి వ్యతిరేకమైన పద్ధతిలో వార్త అవటాన్ని చరణ్‌సింగును ప్రధాని రాజీనామా కోరారు. ఇందిరను అరెస్టు చేయకపోవడానికి హోమ్‌శాఖలో సత్తా లేకపోవడమే కారణమని మొరార్జీ ఆ శాఖను విమర్శించారు. ప్రధాని పదవికి కొన్ని ప్రత్యేక హక్కులు, అధికారాలు వున్నాయని చాలామంది అన్నారు. ఇంతకూ ప్రజ ఏమంటుంది? జనతా కదా... ఏమనగలదు... అసలే ఓటు హక్కు మనకెందుకు దాటా అనయినా అనుకోగలదా!

ఓటువేసిన శతవృద్ధులు

మొన్నామధ్య జరిగిన మహారాష్ట్ర రాజ్యసభ, శాసనసభ ఎన్నికలలో దాదార్ అనేచోట ఓటు వేయడానికి 125 ఏళ్ళ వృద్ధురాలు వచ్చిందట. ధృష్టాపూరులో 115 ఏళ్ళ వృద్ధుడు ఇద్దరి సహాయంతో వచ్చి ఓటు వేశాడట. కర్నాటక రాష్ట్రంలో 127 ఏళ్ళ వృద్ధుడు ఎల్లా ఇంటిలో ఒకటిన్నర కిలోమీటరు ప్రయాణం చేసి వచ్చి ఓటువేసి చక్కాపోయాడట.


అక్రమ సంబంధం - హత్య

తమిళనాడు రాజపాళయం అనే వూరుకు చెందిన పడుగు దేవదానం అనేవూళ్ళో 28 ఏళ్ళ మూక్కన్ అనే అతని చెల్లెలు సీతాలక్ష్మికి మారిసెల్వం అనే అతనికి కొన్నాళ్ళక్రితం పెళ్ళయ్యిందట. కాని, సీతాలక్ష్మికి అదే వూరుకు చెందిన నల్లమాడన్ అనే అతనికి అక్రమ సంబంధం పెళ్ళికి ముందునుంచి వుంది. అది పెళ్ళయ్యాక మరింత బలపడిందట. ఇహ వాళ్ళిద్దరూ ఒకర్నొకరు వొదిలి వుండలేనన్న స్థితికి వచ్చినట్టు నిర్ణయించుకుని, ఓ అర్ధరాత్రి యిద్దరూ పారిపోయి రాజపాళయం చేరారట. రాత్రి వెంటపడి వచ్చిన మూక్కన్ తన చెల్లెలు కనబడకపోయేసరికి సైకిలుమీద వేట ప్రారంభించి, రాజపాళయం బస్సుస్టాండులో ఆమెను చూసి, సైకిలు ఎక్కించుకుని యింటికి తీసుకు వచ్చి "బుద్ధిలేనిదానా" అని పొర పిడితో తల మీద ఒక్కటిచ్చాడట. దాంతో ఆమె తలపగిలి, అక్కడికక్కడే చనిపోయిందట. అతను, అతని స్నేహితులు కలిసి, శవానికి దహనసంస్కారాలు చేస్తుండగా పోలీసులు అడ్డొచ్చారట.

64 కి.మీ. సైకిల్ తపాలా!

అస్సాములో చెందిన "పమితారి" అనే వూరుకు "జకలబంద్రా" అనే వూరుకు మధ్య అరవైనాలుగు కిలోమీటర్ల దూరముట. ఈ రెండు వూళ్ళమధ్య తపాలు బట్వాడా కేవలం సైకిలు మీదనేనట. పొద్దున్నే ఓ పోస్టుమాన్ సైకిలుమీద ఆ 64 కిలోమీటర్లూ వెళ్ళి, తపాలిచ్చి, అక్కడి తపాలు పట్కి మోసుకురావాలట. ఆ పేస్ తీసుకెళ్ళటానికి యీ పని ఎన్ని రోజుల్లో చేస్తే అన్ని రోజులట ఆ ఉత్తరాల ప్రయాణం. అస్సాము రాష్ట్ర ముఖ్యపట్టణం గౌహాతినుంచి యీవూళ్ళకు వుత్తరాలు చేరడానికి వారం పది రోజులు పడుతుందట.

Printed and Published by S. NageswaraRao at the Andhra Patrika press, MallikarjunaRao Street, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna


TATA'S
501
NEW BLUE DETERGENT BAR
501
నీలం 501
డిటర్జెంట్ బార్
తెల్లదనానికి మొదటిది, ప్రకాశానికి మొదటిది
మీరు కోరే లక్షణాలన్నీ ఉన్నాయి:
• డిటర్జెంట్ కావడం వల్ల అధికంగా ఉతికే శక్తి.
• బార్ కావడం వల్ల అధికంగా పొదుపు.
• ప్రత్యేక రీతిలో గట్టిగా తయారు చేయబడినందువల్ల తొందరగా అరిగిపోదు, ముద్ద కాదు.
• తెల్ల బట్టలైనా, రంగు బట్టలైనా ఉతికేందుకు సరిగ్గా తగినట్టిది.
• పట్టుకోవడానికి అనువుగా ఉంటుంది.
మరొక 501 విజేత!
ది టాటా ఆయిల్ మిల్స్ కంపెనీ లిమిటెడ్
CAST-1-223 TEL

"ఆంగ్లము స్వర్గద్వారము"

మరణము (Death), ఉన్నతులు-అధములు (The high and low). చిన్నవారు-పెద్దవారు (The young and the old) అను ఏ విధమైన వ్యత్యాసమును చూడకుండ ఎవరినైననూ ఏ సమయములోను తన చల్లని చేతులలో ఇముడ్చుకొనును. దాని పిదప, వారి పుణ్య పాప కృత్యములకు తగినట్లు "స్వర్గము, నరకము" మొదలగు స్థలములకు గొనిపోబడుదురని తలంచుచున్నారు.

స్వర్గము: పలురకపు పండ్ల వృక్షములు (Orchards) ప్రక్కిందువారు లేక విరివిగా పడియుండు స్థలము. కంటికింపైన నందన వనములు (Colourful flower gardens) స్వచ్ఛమైన సెలయేళ్ళు (Streams), ఇటువంటి వానితో ఒక ఇంద్ర సభ. అచట రంభ, తిలోత్తమ, ఊర్వశి అనెడు నాట్య సుందరాంగులు ఉండెదరు. సోమపానము (అతి మత్తునెక్కించు మధుపానము - Highly intoxicating liquor) త్రాగుచూ, వారి నాట్యమును చూచి ఆనందించవచ్చునట. నిజముగా ఇట్లే స్వర్గముండుననిచో నేను మరణించిన పిదప ఈ స్వర్గము నాకు వలదు.

నరకము: చిత్రవధ చేయబడు స్థలము. పాపాత్ములొకనిని విష సర్పములు కాటు వేయుచునే ఉండును. మరొకనిని ఘోరాగ్నిలో కాల్చుచునే యుందురు. ఇంకొకని కంఠమును కత్తితో కోయుచునే యుందురు. అలవాటు పడినచో, ఇది చిత్రవధలుగానే తోచవు. ఇదియే నరకమనినచో ఈ భూలోకమున కంటెను నరకమే ఎంతో మేలైనదగుచున్నది. ఈ భూలోకములో పాము ఒకసారి కాటేసిననే మనిషి లేడు. ఒకసారి అగ్నిలో వేసిన మనిషైనాశనమగుచున్నాడు. కోసిన పిదప మరల కోయుటకు కంఠము ఉండునా?

స్వర్గమును, నరకమును గురించి ఇటులంతయు వాగుదున్నారే! "ఇటులనే ఉన్నవి. నేను చూచితిని" అని ఎవరైననూ గుండెపై చేయివేసి చెప్పనిమ్ము చూచెదము.

పుణ్యకార్యమునకు సన్మానింపబడువానిని, పాప కార్యమునకు తగిన శిక్షననుభవించువారిని ఈ లోకములోనే కనులారా కాంచుచున్నాము. ఆటులుండగా అపరిచిత స్థలములకు కొనిపోయే ఈ కార్యములను చేసి తీరవలెనను స్థితి భగవంతునికి లేదనుట తేటతెల్లము.

ఆలోచనను పురికొల్పునట్లుగా, ఏదైన చెప్పిన ప్రజలు వాటిని ఒప్పుకొన భీతిల్లెదరు. కావున దేశమునందు ప్రబలిన భావములను "భక్తి" అను ముసుగులో, సినిమా, కాలక్షేపమువంటి వానిద్వారా వ్యాపింపజేసిన ప్రజలు స్వాగతము పలికెదరు. వారినుండి దబ్బు గుంజి ధనవంతులు కావచ్చును. కావుననే, "సూది చెవిలో ఒంటెయు దూరవచ్చును. కాని, ధనవంతులకు స్వర్గములో స్థలములేదు" అను భావము స్థిరపడినది. (Biblical saying preaching socialism).

ఈ సందర్భములో ప్రాజ్ఞులు కొందరి జీవిత చరిత్రల నుండి (Biographies) ఒకటి, రెండు సంఘటనలను జ్ఞప్తికి తెచ్చుకొనుచున్నాను:

"గ్రీకురాజు యుల్లీసిస్, నా ఆయువు ఇంకను ఒక నిమిషమే అనిన ఆ ఒక నిమిషములో ఏమి క్రొత్తగా తెలిసికొన వీలగునో దానిని తెలిసికొన ప్రయత్నించెదను, అనెను. భారత దేశపు నాస్తికాగ్రవేత్త, డాక్టరు విశ్వేశ్వరయ్య తన 101-వ వయస్సులో, మరణించు సమయములో ఆంగ్లములో, అపుడు క్రొత్తగా అంగీకరించబడిన పదములలో తన ఏకాగ్రతను నిలిపెనట".

కావున, తెలివికి, ఆలోచనకు ఎచట స్థలమున్నదో, ఆ స్థలమునే, నేను, "స్వర్గము" అని అభిప్రాయపడెదను. ఆంగ్లభాష తనలో సకలశాస్త్ర గ్రంథములను కలిగియుండుటచే సంపూర్ణమైన ఆంగ్లభాషా జ్ఞానము, తెలివిని పెంపొందించుటతో, చక్కని ఆలోచనకు దారి తీయును.

కావున, ఆంగ్లము "స్వర్గద్వారము".

G. SHANMUGASUNDARAM

